
# కథామంజరి


## పది కథల సమాహారం



డిసెంబర్ 2023

# కథామంజరి

## పది కథల సమాహారం



**కథా మార్గదర్శి**


జయంతి ప్రకాశ శర్మ
సంపాదకుడు

అవసరాల వెంకటరావు
ప్రచురణ కర్త



**డిసెంబర్ 2023**

సంపుటి : 4 ♦ సంచిక : 12

ఈ నెల కథామంజరి సంచికకి

చేయూతనిచ్చినవారు

**శ్రీమతి అన్నపూర్ణ,**

**శ్రీ సూర్యనారాయణ గార్ల**

స్మృతిలో

**శ్రీ సాయి.**

వారికి మా హృదయపూర్వక

**కృతజ్ఞతలు**



# మా జట్టు

సంపాదకుడు

జయంతి ప్రకాశ శర్మ

ప్రచురణ కర్త

అవసరాల వెంకటరావు

సంపాదక సహకారం

ఎం.ఏ. పద్మనాభరావు
కృపాకర్ పోతుల
నందూరి సుందరీ నాగమణి

ప్రచురణా సహకారం

ఎం.ఎల్. కాంతారావు

సాంకేతిక సహకారం

Harbinger Publishing

బొమ్మలు

కొయిలాడ రామ్మోహనరావు
కొచ్చెర్ల వి.ఆర్.
సూరంపూడి చలపతిరావు



# కథామంజరి శ్రావ్యసంచిక

## ఈ నెల శ్రావ్యసంచికకి
## 'గళ' సహకారం అందించిన కళాకారులు

శ్రీ / శ్రీమతి / కుమారి

- పప్పు భోగారావు గారు
- వెంపటి కామేశ్వర రావు గారు
- భువనపల్లి రంగనాథం గారు
- కరవది సరస్వతి గారు
- బి.ఎస్. మూర్తి గారు
- అవసరాల రాఘవరావు గారు
- లలితా గోవిందరాజు గారు
- భమిడిపాటి శరత్ జ్యోత్స్న గారు
- అవసరాల వెంకటరావు గారు

శ్రావ్యసంచిక కొరకు ఇక్కడ నొక్కండి

# ఇదీ వరస

## శీర్షికలు


| | |
|---|---|
| కథాకీయం | i |
| విశిష్ట అతిథి | ii |
| కథా మార్గదర్శి | iv |
| కథా పరిచయం | vi |
| వినదగునెవ్వరు చెప్పిన | ix |
| కథాపుస్తక పరిచయం | xi |


## కథలు, వ్యాసాలు


| | | |
|---|---|---|
| కాంట్రేగుల రామలచ్చుం కొట్టుకాడ | పెనుమాక రత్నాకర్ | 1 |
| ఈ మందిర మిటులుండేనా | డా. దారల విజయకుమారి | 7 |
| హృదయం ఎక్కడున్నాది | వసుంధర | 13 |
| ముందడుగు | అప్పరాజు నాగజ్యోతి | 18 |
| ఆట | సమ్మెట ఉమాదేవి | 23 |
| అడవి | సి. కుమార యశస్వి | 28 |
| మౌలిక స్వరం! | బులుసు సరోజినీదేవి | 32 |
| మొదటి అడుగు | డా. మజ్జి భారతి | 38 |
| గాజు బతుకులు | ఓలేటి శ్రీనివాస భాను | 45 |
| పట్టు పరికిణీ | పంతుల జోగారావు | 50 |


Cover Page Credit : Mr Jesus Vas, Wembley, UK

తెలుగు కథ గురించి మాట్లాడితే కారామాష్టారి గురించి తప్పకుండా చెప్పుకుంటాం! కాని ఆయనే తన ఏభై ఏళ్ళ సాహితీ జీవితంలో పాతిక కథలైనా రాయలేకపోయానని అంటూండేవారు. అయితే ఆయన కథలు అజారమరంగా నిలిస్తే, ఆయన మరో మహత్తరమైన పని చేశారు. 'అసలు వ్యాసాలు రాయడంలో కూడా నాకు అనుభవం లేదు.. ఇదే నా మొదటి ప్రయత్నం' అంటూ భావితరాల వారికి ఓ "గైడ్" ని అందించారు. ఆ గైడ్ పేరు 'కథాకథనం'. ఈ శీర్షిక మీద మాష్టారు వ్రాసిన అద్భుతమైన వ్యాస సంపుటి... దీనిని రచయితలే కాదు, తెలుగు భాష వచ్చినవారందరూ చదవదగ్గ, చదవగలిగే పుస్తకం. ఇంత నొక్కి వక్కాణించడానికి కారణం... 'స్వేచ్ఛా సాహితీ' వారు జనవరి 1990 లో ప్రచురించిన ఈ పుస్తకం కళ్ళబడి చదవడం తటస్థపడింది. నిజంగా రచయితలకి ఇది "కారామాష్టారి గైడ్" అనొచ్చు. అందులో గ్రహించిన విషయాల్లో కొన్ని టూకీగా ముచ్చటించాలి. ఆ ప్రయత్నమే ఇది!

ఆ రోజుల్లో కథలు రాయాలనే కోరిక విస్తృతంగా ఉండేది. సమాజపరంగా ఉండే పరిస్థితుల్ని చూస్తూ, ఉండపట్టలేక కథలు వ్రాయాలనే తపన కనిపించేది. ఇతరత్రా అంటే.. పేరు, డబ్బు సంపాదించాలనే కోరికలు కూడా లేకపోలేదు. ఏదేమైనా అలా రచయితలు కావాలనుకునే వారిలో వయోభేదం లేకుండా, ఆ మాత్రం చదువుకున్న వారి నుంచి.. డాక్టర్లు, డాక్టరేట్లు తీసుకున్న వారి వరకు కథలు వ్రాయడం మొదలెట్టారు. అయితే.. కారణాలు రకరకాలు ఉండొచ్చు, కాని డెబ్బయ్ శాతం మందికి కథంటే ఏమిటో తెలియదు. కథల మంచిచెడ్డల గురించి తెలియదు. ఏ గుణాల వలన కథ మంచిదవుతుందో, చెడ్డదవుతుందో స్పష్టమైన అభిప్రాయాలూ ఉండేవి కాదు. ఆ పరిస్థితులను చూసి, కారామాష్టారు, వారి కోసమే వ్యాసాలు వ్రాసారు. కొత్తరచయితల సందేహాలను, లోటుపాట్లను దృష్టిలో ఉంచుకుని, కథను గూర్చి వారి అవగాహన పెంచుకోవడంలో వారికి సహాయపడేందుకు రాసిన వ్యాసాలు అవి. కథకు సంబంధించి.. వస్తువు, పాత్రలు, వర్ణనలు, సంభాషణలు, సన్నివేశాలు, సంఘటనలు, వాడే భాష, ఆరంభం–ముగింపు... ఇలా ఎన్నో విషయాలను చాలా విపులంగా వివరించారు. అంతే కాదు, అవి చదివితే ఎన్నో చేయతగ్గవే కావు, చేయకూడనివి కూడా తెలుస్తాయి.

పెద్దవాళ్ళ రచనలు చదివి, ఉత్తేజం పొందడం వేరు, అనుకరించడం వేరు. రెండోది ప్రమాదకరం! తగని కథలు రాయడం వల్ల లోకానికి జరిగే మంచిచెడ్డల మాట అటుంచి, అవి మనకేం చేస్తాయో రచయిత గమనించాలి. రాసే కథల్లో చెప్పబోయిన విషయంతో పాటు, ఆ రచయిత వ్యక్తిత్వం కూడా వ్యక్తమవుతుంది. రచయిత వ్రాసిందొకటి, చేసేది మరొకటి కాకూడదు. సిద్ధాంతాలు, సూక్తులు, నీతులు, నిజాయితీలు... ఇవేవి కథలకే పరిమితం కాకూడదు, రచయితలో కూడా కనబడాలి. కథమీదే కాదు... రచయిత మీద కూడా మరింత గౌరవం పెరుగుతుంది.

చివరిగా... మరో మాట బాగా ఆకట్టుకుంది. "రచయితలు తొలిదశలో అనుకరణ తప్పుకాదు, అనివార్యం కూడా కావచ్చు. కాని వీలైనంత త్వరగా ఆ మార్గాన్ని వీడి, మీ మార్గాన్ని ఏర్పరచుకోవాలి!"

చలంగారిలా చలంగారే రాయగలరు. శ్రీపాదవారిలా ఇంకొకరు రాయలేరు. రావిశాస్త్రిగారిలా రాయబోయి మహామహులే భంగపడ్డారు!

ఇలా... ఎన్నో మంచి విషయాలు పొందుపరిచిన ఆ "కథా కథనం" చదవడానికి ప్రయత్నం చేయండి!

**సంపాదకుడు**

# విశిష్ట అతిథి



**శ్రీ ఓలేటి శ్రీనివాసభాను**

ఏ అంశం మీదైనా, ఏ ప్రక్రియలోనైనా అనాయాసంగా రచన చేయగలగడం ఈయనకు వెన్నతో పెట్టిన విద్య. ఆయన కావాలనుకున్నప్పుడు కవి కాగలడు. కోరుకున్నప్పుడు కథకుడిగా అవతారం ధరించగలడు. సినిమాల గురించీ, సినిమా పాటల గురించీ, సినీ ప్రముఖుల జీవితాల గురించీ వ్రాయగలడు. క్రికెట్ గురించీ, అది ఆడేవాళ్ళ గురించీ ప్రామాణికంగా రాయగలడు. టీవీ కార్యక్రమాల రచనలూ చేయగలడు. అనువాదాలు, నృత్య రూపకాలు, లలిత గీతాలు రాయగలడు. ఒక్కమాటలో చెప్పాలంటే, బహుముఖ ప్రజ్ఞావంతుడు! కవీ, కథకుడూ, విమర్శకుడూ, అనువాదకుడూ. వీటన్నిటినీ కలగలిపితే మన ముందు సాక్షాత్కరించే రూపమే శ్రీ ఓలేటి శ్రీనివాస భానుగారు!

తెలుగులో పీజీ చేసి, వీలైతే పీహెచ్.డీ. కూడా చేసి, పిల్లలకి తెలుగుపాఠాలు చెప్పుకోవాలన్న జీవితాశయం తీరకపోవడమేకాక, తన ప్రవృత్తికి ఏవిధంగానూ సరిపడని రైల్వే ఉద్యోగం తప్పనిసరి పరిస్థితుల్లో చేయాల్సి వచ్చినా, ఆ లోకంలో పడి కొట్టుకుపోకుండా, భాషమీదా, సాహిత్యమ్మీదా తనకున్న ప్రేమాభిమానాలు చెక్కుచెదరకుండా కాపాడుకోవడమే కాక, ఇరవై రెండేళ్ల సర్వీసు అతి కష్టమ్మీద నెట్టుకొచ్చి, ఇక చాలనుకుని, నిశ్శబ్దంగా రైల్వే నుండి నిష్క్రమించి, తను ప్రాణప్రదంగా ప్రేమించే తెలుగు అక్షరాన్ని ఆసరాగా చేసుకొని, రచయితగా రాణించిన విలక్షణమైన వ్యక్తి.

బొబ్బిలి కాలేజిలో తనకు తెలుగు చెప్పిన ముసునూరి రఘువర్మ మేస్టారు .. తెలుగుభాష మీద తనకంతటి అవ్యాజమైన ప్రేమ జనించడానికి కారణం అంటారీయన. ముందురోజు ఖరాబుచేసిన కాయితాలు పట్టుకుని మేస్టారింటికి పయనమవడం, గురువుగారు ఇంకా సేదదీరక ముందే వారి వీధిగదిలో వాటిని దిద్దించుకోవడం... ఇవి ఇప్పటికీ ఎంతో నాస్టాల్జిక్‌గా గుర్తుచేసుకోవడం ఈయన ప్రత్యేకత.

సంగీత, సాహిత్య, నాటకాభిమానాలు మెండుగా ఉన్న కుటుంబనేపథ్యం, అన్నయ్య బుచ్చిబాబు ప్రభావం చిన్ననాడే సాహిత్యాభిలాష మొగ్గతొడగడానికి హేతువైతే, ఆరోజుల్లో పార్వతీపురంలో నెలకొనిఉన్న సాహితీవాతావరణం... శ్రీ గణేశ్

పాత్రో వంటివారి పరిచయభాగ్యం, శ్రీ పంతుల జోగారావు, శ్రీ జగన్నాథశర్మ వంటివారి సాంగత్యం అది వికసించడానికి ముఖ్యకారణంగా భావిస్తారీయన.

డెబ్బయ్యో ఏటలో అడుగుపెట్టిన శ్రీ భానుగారు, తన పదిహేనోయేట 'ప్రజామత' పత్రికలో తన పేరును అచ్చులో చూసుకున్నారు. అది మొదలు అదే పత్రికలో బాలల కథలు రాశారు. అనంతరకాలంలో దాదాపు అన్ని పత్రికలలో కథలు, కవితలు, ఛందోబద్ధమైన పద్యాలూ, మాత్రాఛందస్సులో గేయాలూ, నృత్యరూపకాలూ, లలితగీతాలూ, ఫీచర్లు లాంటివి చాలా ప్రచురితమయ్యాయి. 'ఆంధ్రజ్యోతి ఆదివారం', 'ఈనాడు ఆదివారం'' 'సితార' వంటి పత్రికల్లో ఫ్రీలాన్సర్‌గా వేరు వేరు కలంపేర్ల తోను, ఏ పేరూ లేకుండానూ మూడు దశాబ్దాల కాలంలో కొన్నివందల ఫీచర్లు రాశారు. ముఖ్యంగా 'తేజస్వి' కలంపేరుతో 'ఈనాడు' ఆదివారం అనుబంధంలో 'ఇది కథ కాదు' అన్న ఫీచర్‌ని పన్నెండేళ్ల పాటు నిర్విరామంగా రాశారు. ఇప్పటికీ 'ఈటీవీ' లో 'స్వరాభిషేకం', 'పాడుతా తీయగా ' వంటి ప్రోగ్రామ్స్‌కి అక్షరసాయం అందిస్తున్నారు.


తనకిష్టమైన సినిమారంగం మీదా, ఈనాడు పత్రికలో సినిమాల గురించీ, సినిమావారి గురించీ లెక్కకు అందని వ్యాసాలు రాశారు. అంతేకాకుండా, ఆయన 'కథాకథన శైలి'లో రాసిన 'ఎల్వీ ప్రసాద్', 'పి పుల్లయ్య– శాంతకుమారి' గార్ల జీవితచరిత్రలు పుస్తకాలుగా వెలువడ్డాయి. సినిమారంగంపై ఎంతపట్టు ఉందో, ఆధ్యాత్మిక విషయాలపై కూడా అంతే అవగాహన ఉన్న శ్రీ భానుగారు శ్రీ శిరిడిసాయిబాబాపై రాసిన 'కలకంద పలుకులు' ఆంధ్రజ్యోతిలో సీరియల్‌గా వెలువడి, ఎంతో ఆదరణ పొందింది. శ్రీ ఆర్కే నారాయణ్ వంటి లబ్ధప్రతిష్టులైన ఇండియన్ ఇంగ్లీషు రచయితల రచనలను డెబ్బయ్యవ దశకంలోనే తెలుగులోకి అనుసృజించారు. ఇవి కాకుండా వారు అనుసృజన చేసిన బయోగ్రఫీలు – ' కల నిజమైతే' (రెడ్డీ ల్యాబ్స్ అంజిరెడ్డి గారి ఆత్మకథ 'My Unfinished Agenda'), 'వాయుసేన విజయసాధన – ఓ ఇంజినీరు ఆలోచన' (విశ్రాంత వింగ్ కమాండర్ శ్రీ ఎన్. సోమశేఖరరావు గారి ఆత్మ కథ– 'An Engineers Innovation Wins Battles') కూడా పాఠకులను అమితంగా అలరించాయి.

ఇప్పటి వరకూ, వీరి రచనలు పదిహేను.. పుస్తకరూపంలో వెలువడ్డాయి. అవన్నీ ఒక ఎత్తయితే, రైల్వే ఉద్యోగంలో వీరి అనుభవాల ఆధారంగా రాసిన 'పొగబండి కథలు', చిన్ననాటి జ్ఞాపకాలను గుదిగుచ్చి రాసిన 'బెలగాం కథలు' ఇవి రెండూ ఒకెత్తు. బెలగాం కథలైతే, పాఠకుల్ని చెయ్యిపట్టుకొని తమ బాల్యంలోకి లాక్కుపోయి, హృదయాంతరాళాల్లో నిద్రాణమై ఉన్న తియ్యనిజ్ఞాపకాలను తట్టి లేపుతాయి. గుండె బరువెక్కిస్తాయి. కళ్ళు చెమ్మగిల్లేలా చేస్తాయి. భావావేశానికి గురికావడానికి పాఠకుడు పార్వతీపురానికో, ఉత్తరాంధ్రలో ఏదో ఒక ప్రాంతానికో చెందాల్సిన అవసరంలేదు. తెలుగు నేలమీద ఏ ప్రాంతానికి చెందినవాడైనా, గుండె లోతుల్లో ఆర్ద్రత ఉన్నవాడైతే చాలు.

నిరంతరం ఏదో ఒకటి రాస్తూనో, రాయబోయేదానికి కావలసిన సమాచారం సేకరిస్తూనో, క్షణం తీరికలేకుండా గడిపే శ్రీనివాసభాను గారు 'కథామంజరి' ఈ సంచికకు విశిష్ట అతిథిగా విచ్చేసినందులకు ధన్యవాదాలు తెలుపుకుంటున్నాం. వారు తన బెలగాం కథల్లో ఆణిముత్యంవంటి "గాజు బతుకులు'' కథను పాఠకులతో పంచుకోవడం ముదావహం. వారు సాగిస్తున్న అక్షరసేద్యం నిర్విఘ్నంగా, నిర్విరామంగా ఇలాగే కొనసాగాలని మనసా వాచా ఆకాంక్షిస్తూ.....

*కథామంజరి బృందం.*

# కథా మార్గదర్శి



**కీ.శే. శ్రీ పంతుల జోగారావు**

మధ్యతరగతి మనుషుల జీవితాలను కథావస్తువుగా తీసుకుని వ్రాసే కథలు పాఠకులను బాగా ఆకర్షిస్తాయి. ఆ జీవితాలను ఏ రసంలో వ్రాసినా సరే, అది మన చుట్టూ తిరుగాడే వాస్తవజీవితమే అనిపిస్తుంది. అందులో కొందరు రచయితలు ఇలాంటి మధ్యతరగతి కథలను వ్రాయడంలో సిద్ధహస్తులు. వారి కథనం, శైలి, కథావస్తువు... పాఠకుల హృదయాలను కట్టి పడేస్తాయి. హృదయాలని పిండేస్తాయి. గుండెల్లో గూడు కట్టుకుని ఉండిపోతాయి! అలాంటి రచయితలలో నిన్నటితరంలో గొప్ప కథారచయితగా చెప్పుకోదగ్గ కథకుడు, సాహితీవేత్త కీ.శే. పంతుల జోగారావు గారు!

ప్రముఖ రచయిత, సాహితీవేత్త శ్రీ మధురాంతకం నరేంద్ర గారు, జోగారావుగారి రచనల గురించి మాట్లాడుతూ... "జోగారావుగారి కథలన్నీ క్రింది మధ్యతరగతి మనుషుల జీవితాలని, ఆర్థికసమస్యల ప్రభావాలని విస్పష్టంగా ఎత్తి చూపెడతాయి! ఆయన కథలు... వర్ణచిత్రాల్లా కాకుండా, నలుపుతెలుపు రంగుల బొమ్మల్లా ఉంటాయి! పాత్రలన్నీ సజీవంగా పాఠకుడికి పరిచయమవుతాయి. ఉపమానాలు, ఉపమేయాలు అంతగా అవసరంలేని సరళమైన శైలిలో, ఆయన ఎన్నుకున్న వస్తువులకు, సరిజోడుగా హుందాగా సాగుతాయి!" అంటారు.

అక్టోబర్ 1949 లో పార్వతీపురంలో జన్మించిన శ్రీ జోగారావుగారు హైస్కూల్ స్థాయి వరకు ఆ ఊర్లోనే చదివారు. తర్వాత విజయనగరంలో ఉన్న సింహాచలం దేవస్థానం వారి సత్రంలో భోజనం చేస్తూ, మహారాజా సంస్కృత కళాశాలలో భాషాప్రవీణ పూర్తి చేసారు. సాలూరు, పార్వతీపురంలలో తెలుగుపండితులుగా పనిచేసి, పదవీ విరమణ చేసారు. 1966 నుంచి కవితలతో తన సాహితీప్రస్థానం ప్రారంభించి, అనతికాలంలోనే కథారచన వైపు అడుగులు వేసారు. ఆ సంవత్సరంలోనే వీరి మొదటి కథ "బహుమతి" ఆంధ్రప్రభలో ప్రచురింపబడింది. మూడు వందల కథలు, నాలుగు నవలలు వ్రాసిన జోగారావుగారు.. అటూ సాహితీ అవార్డులు, ఇటు వృత్తిపరమైన అవార్డులు కూడా తీసుకున్నారు. నవ్య వారపత్రికలో 'తెలుగు పద్యం వెలుగు జిలుగులు', 'పాలబువ్వ' అనే ధారావాహిక రచనలు, ఆంధ్రభూమి మాసపత్రికలో 'తేనెలొలికే తెలుగు పద్యం' శీర్షికను నిర్వహించారు. నవ్య వారపత్రికలో వందకు పైగా పుస్తక సమీక్షలు చేశారు.

వీరివి... బడిపిల్లల కవితలతో సంపుటాలు, “అపురూపం”, “ గుండెతడి” కథాసంపుటలు వచ్చాయి. చాలాకాలం ఫ్రీలాన్సర్‌గా చాలా పత్రికలలో లెక్కలేనన్ని వ్యాసాలు వివిధ శీర్షికల పేర్లతో రాసారు. “వరద, క్షమించు నేస్తాం, గుర్తింపు, గోవుమాలచ్చిమి కోటి దండాలు, తూర్పు వెళ్ళని రైలు, అడ్రసు లేని మనుషులు, గెలుపు...” వంటి వీరి కథలు పాఠకలోకాన్ని మెప్పించాయి. సాలూరు, పార్వతీపురం, విజయనగరంలలో ఉన్న సాహితీసంస్థలతో అనుబంధం ఉన్న జోగారావుగారు విజయనగరంలో నివసిస్తూ.. 15.01.2021 కనుమూసారు.

కథా రచయితగా ఎంతోమంది ఔత్సాహికులకు మార్గదర్శకులుగా వాసికెక్కిన కీ.శే. పంతుల జోగారావుగారిని ఈ సంచిక “కథామార్గదర్శి” గా తలుచుకుంటూ, వారికి నివాళి అర్పిస్తున్నాం!

**కథామంజరి బృందం**

## శంకగిరి నారాయణస్వామిగారి కథ - తుపాకి

శంకగిరి నారాయణస్వామి గారు రాసిన ఈ 'తుపాకి' కథ ఒక అమెరికన్ డయాస్పోరా కథ. ఈ కథ ఎన్నో ప్రశంసలను పొందింది. ఈయన ప్రస్తుతం అమెరికాలో మిషిగన్ రాష్ట్రంలోని డెట్రాయిట్ నగరంలో నివసిస్తున్నారు. ఆయన కథకుడిగా, అనువాదకుడిగా, సమీక్షకుడిగా తెలుగు సాహితీలోకంలో చాలా సంవత్సరాలుగా కృషిచేస్తూ, అమెరికాలో తనకంటూ ఒక స్థానం ఏర్పరుచుకున్న ప్రవాస రచయిత. ఆయన తన బ్లాగుల తోనూ, తన యూట్యూబు ఛానెల్ (ఎస్. నారాయణస్వామి) లో కథల్ని విశ్లేషించడంతోనూ ఎందరో పాఠకులను ఆకట్టుకోవడమే కాక, అటు నాట్యరంగంలోనూ, ఇటు నటనారంగంలోనూ కూడా ఎంతో ప్రవేశమున్న నారాయణస్వామిగారు విస్తారమైన తన అనుభవాలను పంచుకుంటున్నారు.

నాసీ, కొత్తపాళీ కలం పేర్లతో రచయిత పాఠకులకు పరిచితులే. 'తుపాకి' కథ సెప్టెంబరు 1999 'ఈమాట' అంతర్జాల పత్రికలో ప్రచురితమయింది.

అమెరికాలో మనుషులకంటే తుపాకులెక్కువ. ఆ తుపాకులవల్ల జరిగే హింసా ఎక్కువే. పెద్ద, చిన్న తుపాకులను ఆయుధాలుగా ధరించే హక్కు రాజ్యాంగం ఇచ్చిందని, జంతువులను వేటాడడానికి, స్వయం రక్షణకు తుపాకులు అత్యవసరమని భావించేవారు చాలామందే ఉన్నారు. అంతకంటే తుపాకుల్ని తయారుచేసే కంపెనీలు పెంచి పోషించే రాజకీయనాయకులూ ఎక్కువే. అందుకే ఈ తుపాకుల్ని నిర్మూలించే, కనీసం తగ్గించే ప్రయత్నాలన్నీ విఫలమవుతున్నాయి. 1999 లో రచయిత ఎంచుకున్న సాంఘిక సమస్య ఈ రోజుకీ సమస్యగానే ఉండిపోయింది.

కిరణ్ అనే ఒక పదేళ్ల కుర్రాడు ఓరోజు తల్లితండ్రులతో కార్లో వెళ్తూ తనకొక గన్ కావాలని అడగడంతో ప్రారంభమవుతుంది కథ. అదీ నిజం తుపాకి అని చెప్పినప్పుడు నిజంగానే వాళ్ళ గుండె పేలింది. ఎందుకు కావాలంటే... తను జంతువుల్ని వేటాడ్డానికి, ఊర్కెనే కాల్చడానికి. పెద్దయ్యాక తనో వేటగాడవుతాట్ట మరి. తల్లితండ్రుల మధ్యలో ఆలోచనలలో తేడా – తల్లి 'నోర్మూసుకో, తుపాకీ లేదు, గిపాకీ లేదు' అంటే, తండ్రి లాజికల్‌గా విడమర్చి చెప్తాడు 'గన్స్ వల్ల వచ్చే ప్రమాదాలు – కొడుకెంత వేటగాడవుదామనుకున్నా.

అవును, 'ఎయిర్ గన్ కొనచ్చుగా ఎంచక్కా ప్రస్తుతానికి నిజం గన్స్ అక్కర్లేదులే!' స్నేహితుడు బ్రయన్ ఎంచక్కా పేలుస్తాడో! వాడూ మొనగాడల్లే కథలు చెప్తుంటే హీరోలా ఉంటాడు. తనెందుకు కాకూడదు? వాళ్ళింటికెళ్ళినప్పుడు వాళ్లింట్లో బీరువాలో ఎన్ని గన్సో! జిమ్మీ అని ఇంకో ఫ్రెండు. వాడికి బ్రయన్ వాళ్ళలాగా అంత డబ్బుల్లేవు. అయినా వాళ్ళ నాన్న వాడిని వేటకు తీసికెళ్తాడుగా!

ఇక తల్లి తండ్రుల మధన చెప్పాలా? మన సంస్కృతేమిటి? పూజలూ, పునస్కారాలూ, వేదాంత చర్చలూ ... ఇవన్నీ వదిలేసి ఈ గన్స్ ఏమిటి? ఏం స్నేహాలో ఏమిటో?

ఓరోజు లంచ్‌టైమ్‌లో జిమ్మీ వచ్చి చెప్తాడు వాళ్ళ నాన్న ఉద్యోగం పోయిందని, దానికి కారణం నిగ్గర్ లే (నిగ్గర్ అనేది

నల్లజాతి వాళ్ళని అంటే ఆఫ్రికన్ అమెరికన్లను తక్కువ చూపుతో పిలిచే మాట) అని. "ఆ దొంగనాకొడుకులకి మనమంటే అసూయ. వాళ్ళు సొంతంగా ఏం చేసుకోలేక... మనకున్నవన్నీ లాగేసుకోవాలని చూస్తున్నారు..." ఆ చిన్నారి మనసులో తండ్రి చెప్పిన మాటలు బయటకు వచ్చాయి. ఆ నిగ్గర్‌లని అలా వదిలేస్తే తమందరి ఇళ్ళూ, ఉద్యోగాలూ అన్నీ వాళ్ళ హస్తగతమైపోతాయి త్వరలో! అదీ భయం.

ఇంతలో ప్రిన్సిపాల్ చేసిన అనౌన్స్‌మెంట్ మరింత బలపరిచింది ఆ ఆలోచనల్ని. కౌంటీలోని ఓ వంద మంది బీద విద్యార్థుల్ని స్కూల్లో చేర్చుకుంటున్నామని. ఇంకేముంది, ఆ బీద విద్యార్థులు ఇంకెవరో అవరు — వాళ్ళేగా! బ్రయన్, జిమ్మీలలో తరతరాలుగా నల్లవారి మీద ఉన్న అసహ్యం బయటపడింది. ఆ నల్లవారిని ఎంత తక్కువగా చూడాలో కిరణ్‌కి అర్థమైపోయింది.

ఇంటికొచ్చి తలదించుకుని కూర్చొన్న కిరణ్ తల్లితండ్రులకి చెప్పిన విషయమేమిటంటే, 'తను, తన స్నేహితులూ మాట్లాడుకోవడం విన్న ఎవరో.. ప్రిన్సిపల్‌కి చెప్పారని, పిల్లలు మాట్లాడకపోతే తల్లితండ్రులు మాట్లాడించాలని' నిర్ధారించినట్లు తెలుస్తుంది. కిరణ్ చెప్పిన మాటలవల్ల స్నేహితుల ప్రభావం ఎంతుందో అర్థమవుతుంది. ఒంటిరంగులు మనుష్యుల ప్రవర్తనను నిర్ధారించవని, ఒకరికీ ఇంకొకరికి మధ్య తేడాలు రంగులను బట్టి నిర్ణయించడంలో అర్థం లేదని తండ్రి చెప్పిన మాటలు కిరణ్ మనసుకు తెలిసేలా చేస్తాయి. "...ఎందరో ఆఫ్రికన్ అమెరికన్లు అన్ని రంగాల్లోనూ గొప్ప విజయాలు సాధించారు. అయితే చాలా మంది ఇంకా బీదరికంతోనూ, ఇతర బాధల్తోనూ కుస్తీ పడుతున్నారు. అలాగని తెల్ల అమెరికన్లు మాత్రం అందరూ సుఖంగా ఉన్నారా? అంచేత అందరూ మనుషులే... వీళ్ళందరూ అమెరికన్లే.." అంతే కాదు, బ్రయన్ వాళ్ళు కూడా మంచి పద్ధతిని గుర్తిస్తే వాళ్ళే మారతారు. అంచేత ప్రస్తుతానికి వాళ్ళకోసం తప్పు చేయద్దని చెప్తాడు తండ్రి.

మర్నాడే బస్సులో మథ్యూ అనే నల్ల అబ్బాయితో పరిచయమేర్పడింది. మాథ్యూ కొత్తగా చేరిన పిల్లల్లో ఒకడు. చూడంగానే కిరణ్‌కి కూడా ఇష్టంగా కనబడ్డాడు. ఒకే క్లాసు. ఇంకేం. ఒకరి ఇష్టాలు మరొకరితో పంచుకున్నారు. తనీ అబ్బాయితో స్నేహం చేయడంలో తప్పేమీ కనబడలేదు కిరణ్‌కి.

ఒకరోజు శంకర్ (కిరణ్ తండ్రి, డాక్టర్) హాస్పిటల్లో ఉండగా ఒక స్కూల్‌లో షూటింగ్ జరిగిందని, ఓ నలుగురు పిల్లల్ని హాస్పిటల్‌కి పట్టుకొచ్చారని, శంకర్ వారిని ఎటెండ్ అవాలని వార్త వస్తుంది. ఆ నలుగురు పిల్లల్లో కిరణ్ లేడు. కాని తుపాకి బుల్లెట్లు దూసుకుపోయిన శరీరంతో వచ్చిన పదేళ్ల నల్లబ్బాయి మాథ్యూ. తృటి పాటిలో ప్రాణగండం తప్పింది.

ఆరోజు జరిగిన స్కూల్ ఈవెంట్లో మాథ్యూ, తను స్టేజ్ మీద మాట్లాడి కిందకు రాగానే జిమ్మీ ఒక తుపాకీతో మాథ్యూని కాల్చడం, మాథ్యూ కిందపడిపోవడం జరిగిపోయాయి. కిరణ్ ఆ సమయానికి బాత్రూంకి వెళ్ళడం తన స్నేహితుడిని డీసెర్ట్ చేశాననే గిల్ట్ పట్టి బాధించింది. ఆ బాధ లేత శరీరాన్ని ఉప్పెనలా ఊపేసింది ఆ సంఘటనను తల్చుకోగానే.

"నాన్నా.. నాకు తుపాకి వద్దు" అన్న వాక్యంతో కథ ముగుస్తుంది.

అమెరికాలో ప్రవాసులుగా మొదటి తరం భారతీయుల జీవన విధానంలో ఉన్న కొన్ని సంఘర్షణలు (conflicts) ఈ కథలో రచయిత పాఠకుల ముందుంచడం జరిగింది. తమ సంతతే అయినా రెండవ తరం ఎదుర్కొనే పరిస్థితులు వేరు. ఎంతవరకు స్థానిక సమాజంలో కలసిపోవాలి అన్నది నిరంతరం జరిగే మథనే.

సరళంగా, సహజంగా కథ చెప్పిన విధానం, లాజికల్‌గా ఒక సమస్యను పదేళ్ల కుర్రాడి మనసుకు తెలిసేలా చెప్పించిన సంభాషణ, రచయిత ప్రతిభకు నిదర్శనం.

ప్రతిసమాజంలోనూకొన్నిరుగ్మతలుంటాయి.వాటినిగుర్తించడం,చర్చించడం,వాటినితొలగించడం,సంఘసంస్కరణలో ఒక భాగం. అమెరికాలాంటి దేశంలో తుపాకులు లేక గన్స్ సృష్టిస్తున్న సమస్యను గుర్తించరా అని కాదు. గుర్తించినా మార్పు తేవడానికి ఎంతో సమయం పడుతుంది ఎందుకంటే సమస్య అక్కడి సంస్కృతిలో ఒక భాగమైపోవడంవల్ల. ఒకప్పటి భారతదేశంలో ఈ తుపాకుల సంస్కృతి తక్కువే – ఇప్పటికీ తక్కువే అని చెప్పాలి కాని విస్తరిస్తోంది. ఒక తెలుగు రచయిత ఈ సమస్యను తీసుకుని ఎంతో సున్నితమనస్కులైన పిల్లల ఆలోచనలనల ఆధారంగా అల్లిన ఈ కథ అమెరికాలో స్థిరపడిన భారతీయులనే కాదు అందరినీ ఆలోచింపచేస్తుంది. ఒక విషయం గమనించాలి – గన్స్ కొనుక్కునే భారతీయుల సంఖ్య అమెరికాలో పెరుగుతోందే తప్ప తరగడం లేదు. ఆ నేపథ్యంలో తప్పక ఈ కథ కనువిప్పు కలిగిస్తుంది. పాతికేళ్ళక్రితమే ఈ కథ రాసిన రచయితను అభినందించక తప్పదు. కేవలం అహింసాయుతంగా మాత్రమే తెచ్చుకున్న స్వాతంత్ర్యం మన సమాజంలో హింస పెద్ద భాగం కాకుండా చేసిందనడం నిజమే కదా!

*పరిచయకర్త: శాయి రాచకొండ, హౌస్టన్*

*https://eemaata.com/em/issues/199909/839.html*

శ్రీ పి. చంద్రశేఖర్ అజాద్‌గారి "ఆ ఇద్దరి కథ" కథలో అంజనీ ఇచ్చిన పుస్తకాలు చదివి అనామకుడు అంజని గురించి తెలుసుకుంటే, అనామకుడు తన గురించి అంజనికి చెప్పడం వల్ల అంజని తెలుసుకుని ఇద్దరూ ఎవరి బ్రతుకులు వారు బ్రతుకుతారని అనుకున్నాను. కానీ అనామకుడిలోని పిరికితనం పోయి, ధైర్యం రావడం.. మంచి కథనంతో కథ ఆకట్టుకుంది.

శ్రీ సలీం గారి కథ 'రాచనాగు" కథని ఆద్యంతం చదివింపజేసింది కానీ కింగ్ కోబ్రా గుడ్లు పెట్టడానికి ముందు గూడుకడ్తున్న దృశ్యాల్ని చిత్రీకరించడాన్ని కథలో వివరించలేదు రచయిత ఎందుకనో మరి! కుటుంబ నేపధ్యంలో సాగిన కథ శ్రీ పెనుమాక నాగేశ్వరరావుగారి "ఎదురు బదురు". అపార్ట్‌మెంట్ సంస్కృతిలో ఉంటున్న తరుణంలో ఇలాంటి కథలు విరివిగా రావాలి. మంకు కృష్ణకుమారిగారు వ్రాసిన కథ "చిక్కుముడి" కథని పరిశీలించినట్లయితే, ఇంట్లో పెద్దవాళ్ళ ప్రాముఖ్యతని తెలియజెప్పిన కథ. శ్రీ సి.వి.శాస్త్రిగారి కథ "గమ్యం వైపు గమనం" లో రాఘవ పాత్ర ద్వారా చెప్పించిన మాటలు అక్షర సత్యాలు. నేటి సభ్యసమాజంలో ప్రతిరోజూ జరుగుతున్నవే అన్నీనూ! డా. ఎం.సుగుణరావుగారి కథ "కాలజ్ఞాని" .. కాకి కాలజ్ఞానన్న విషయం తెలియచెప్పింది. కథని ఆసక్తిగా అద్యంతం చదివింపజేసింది. అక్కడక్కడా యథాతథంగా ఇంగ్లీష్‌లో వాక్యాలు అలాగే ప్రింట్ చేశారు నది కథలో . అలాకాకుండా ఆ ఇంగ్లీష్ వాక్యాలను అలాగే తెలుగులో వ్రాసివుంటే బాగుండేది. నేటి సభ్యసమాజంలో జరుగుతున్న సంఘటనలకి దర్పణం పడుతున్నది శ్రీ సింగరాజు శ్రీనివాసరావుగారి కథ "సంస్కారవృక్షాలు". ఇంట్లో పెద్ద వాళ్ళుండటం వలన పిల్లలకి మంచి సంస్కారం అలవడుతుందని చాటి చెప్పిన, ఈ కథకి ప్రథమ బహుమతి ఇవ్వదగ్గ కథ అన్నది నా అభిప్రాయం మాత్రమే సుమా!

ఈ మాసపు విశిష్ట అతిథి డా. పాపినేని శివశంకర్‌గారి కథ సముద్రం. కథని మూడు పాత్రలతో నడిపించారు. మంచి విలువలున్న, సమాజంలో మార్పు తెచ్చిన పుస్తకాలను వ్రాసిన రచయితలను, ఆ పుస్తకాల పేర్లను స్మరించుకునేటట్లు చేసిందీ కథ. కీ.శే. వాసిరెడ్డి సీతాదేవిగారి కథ "చిచ్చుబుడ్డి" సందర్భోచితం. ఎందుకంటే రాబోయే పండుగ దీపావళి కదా! దీపావళి పండుగ సందర్భంగా టపాకాయలు కాలుస్తున్న తరుణంలో కొడుకు, తండ్రి ఒకరి వెంట ఒకరు మరణించడం హృదయాన్ని కలచివేసింది.

***సి. హెచ్. నాగార్జున శర్మ, తిరుపతి***

---

ఈ కథల పోటీ ఫలితాలు ఆశించినంత ఉన్నత పరిమాణాలు సాధించ లేకపోయాయని చెప్పడానికి సాహసిస్తున్నందుకు నన్ను అందరూ సహృదయంతో అర్థం చేసుకుంటారని భావిస్తున్నాను.

మొదటి బహుమతి పొందిన కథలో కథావస్తువు భిన్నంగా ఉన్నా, చూపిన విధానం పేలవంగా ముగించారనిపించింది. కురూపైనకథానాయిక, ఆత్మన్యూనతా భావంతో ఉండే నాయకుడు, మధ్య సమన్వయాన్ని రచయిత సాధించలేకపోయారని అనిపించింది. చివరలో నాయకుడు ధైర్యం కోసం సమయం కావాలి అని కోరుకోవడం, మళ్ళీ నాయికకు సమాజంలో ధైర్యంగా నిలబడమని చెప్పడం, అతని ద్వైదీ భావాన్నీ, పలాయన వాదాన్నీ చెప్పకనే చెప్పారా అని అన్పించింది. కలిసి

ఉంటూనే వారిద్దరూ జీవనాన్ని కొనసాగించవచ్చు అన్న భావాన్ని పాఠకుల్లో కలగజేసింది.

రెండో బహుమతి పొందిన రాచనాగు కథ, కథనం, శైలీ, పాత్రచిత్రణా బాగా కుదిరాయి. సింగి పాత్ర విధానం బాగుంది. పగబట్టిన ఆడనాగు ప్రతీకారం పగడ్బందీగా ఎలా తీర్చుకుందో హృద్యంగా వర్ణించారు. దీనికి ప్రధమ తాంబూలం ఇవ్వవచ్చును అని అనిపించింది.


ఇక ఎదురు బదురు కథలో అనవసర సంఘటనలుతో సాగదీశారనిపించింది. కేవలమూ నారాయణ పాత్ర చిత్రణ కోసం ఇంత కథ అవసరమా అనిపించింది. ఇది పురస్కారంకి అర్హత లేదనిపించింది.

ఇదే ధోరణి ప్రత్యేక బహుమతులు పొందిన కథల్లోను కనిపించింది. ఇందులో కాలజ్ఞాని కథ కొత్తగా వాయసము అంతరంగాన్ని ఆవిష్కరించిన రీతి బాగుంది. అలాగే సంస్కార వృక్షాలు కథ ఆకర్షించింది. నేటి సమాజంలో సంతానం బాధ్యతలను, వృద్ధులపట్ల వారు అనుసరించవలసిన విధానం చక్కగా వివరించారు.

నేటి కథల నాణ్యత, క్రమంగా క్షీణదశలో ఉందేమో అనిపిస్తుంది. పెద్దిభోట్ల, మధురాంతకం (రాజారామ్) వంటి కథకుల స్థాయి తల్చుకుంటే చాలా బాధగా ఉంటుంది. చిన్న విషయాలను కూడా మనసుకు హత్తుకునేలా సూటిగా చెప్పేవారు. ఎందుకో ఆ సంతృప్తి ఇప్పుడు లభించడంలేదు. సూరంపూడివారి చిత్రాలు ఆహ్లాదకరమైన రంగుల్లో, సందర్భోచితంగా ఉన్నాయి. చాలా అందంగా ఉన్నాయి

**రామలింగేశ్వరరావు**

*(సంచికలో కథల మీద అభిప్రాయాలని అందించేవారు... ఏ నెలకి ఆ నెల 15వ తేదీ లోగా పంపితే, ఎప్పటికప్పుడు వాటిని ప్రచురించడానికి వీలవుతుంది... సంపాదకుడు)*




## క్విల్ట్

ప్రవాస భారతీయ తెలుగు కథా రచయిత శ్రీ సాయి బ్రహ్మానందం గొర్తి .. విదేశాలలో ఉంటూ, ఆ మనుషులను, అలవాట్లను, సాంప్రదాయాలను, వారి మాటలు, చేష్టలు.. వగైరాలను క్షుణ్ణంగా అధ్యయనం చేసి, కథలు అల్లి, వాటినో మాలగా గుచ్చి, అందించిన కథల సంపుటి "క్విల్ట్". ₹ 300/– ఖరీదు ఉన్న ఈ పుస్తకం

ప్రతులకు


"అనల్పా బుక్స్",
నారెడ్‌మెట్ క్రాస్ రోడ్స్,
**హైదరాబాదు**


## కథా ముత్యాలు

చిన్న సందేశంతో ఆంగ్లభాషలో వచ్చిన చిన్న చిన్న కథలను అనువాదం చేసి, ముప్ఫయ్ రెండు కథలతో ఈ మధ్యకాలంలోనే రెండోసారి విడుదలైన పుస్తకం "కథా ముత్యాలు". రచన : శ్రీ కె.వి. శేషారావు.

ప్రతులకు

గురజాడ బుక్ హౌస్,
షాపు నెం. 1, ఎన్జీఓ హోమ్,
**విజయనగరం – 535 002**






## గురుదక్షిణ

చిన్న చిన్న సంఘటనల నేపథ్యంలో సాగిన ఇరవై కథల సమాహారమే "గురుదక్షిణ". ప్రముఖ రచయిత్రి శ్రీమతి దినవహి సత్యవతిగారి ఈ కథాసంపుటి వెల ₹125/-.

ప్రతులకు


శ్రీమతి దినవహి సత్యవతి
డోర్ నెం 26-28-31/బి,
గాయత్రీమాత దేవాలయం వీధి,
1వ లైను, ఏ.టి. అగ్రహారం
**గుంటూరు -522 004**
ఫోన్ : 9790752180.

## అమ్మచేతిలో బువ్వ

పాఠకుల హృదయాలపై ఓ ప్రత్యేక ముద్ర వేయుంచుకోగలిగే కథలు అందిస్తున్న ప్రముఖ కథా, నవలా రచయిత శ్రీ కట్టా రాంబాబుగారి కలం నుండి జాలువారిన ముప్పయ్ కథల సంపుటి "అమ్మచేతిలో బువ్వ". ₹.250/- వెల గల ఈ సంపుటి కోసం ఈ దిగువ వారిలో ఎవరినైనా సంప్రదించవచ్చును.

శ్రీ కట్టా రాంబాబు,
DNo. 54-5-3/4,
403, యశోద ఆర్కెడ్,
అద్దేపల్లి కాలనీ,
**రాజమండ్రి – 533 103.**

డా. సునీల్ కుమార్, M.S, ENT,
ఓక్ గార్డెన్ అపార్ట్మెంట్,
నారాయణపురం కాలనీ,
నిడమనూరు,
**విజయవాడ – 521 104**
ఫోన్: 8179055679.





9063854331

ప్రత్యేక బహుమతి పొందిన కథ

కథామంజరి శ్రీమతి పోడూరి నాగమణిశ్రీ స్మారక కథల పోటీ ❖ శ్రీ శోభకృత్ నామ వత్సర దీపావళి - 2023

# కాండ్రేగుల రామలచ్చుం కొట్టుకాడ

పెనుమాక రత్నాకర్

*బి.ఎస్సీ, ఎమ్.బి.ఏ. చదివి, వివిధ బహుళజాతి కంపెనీల్లో హెచ్.ఆర్, మేనేజర్‌గా పనిచేసి, పూర్తికాలం సామాజికసేవ చేయాలనే ఆకాంక్షతో, యానాంలో ఒక స్వచ్ఛంద సేవాసంస్థ నెలకొల్పి ఎవరి దగ్గరా నిధులు తీసుకోకుండా స్వంత నిధులతో కార్యక్రమాలు చేస్తున్నారు. నలభైయొక్క సార్లు రక్తదానం చేసారు. మూడు సంవత్సరాల క్రిందటే, రచనా వ్యాసంగం మొదలెట్టినా, అరవై కథలు, ఐదు నవలలు, ముప్పయ్ కవితలు రాసారు. వీటిలో పదహారు కథలకు బహుమతులొచ్చాయి. "గౌతమీ తీరం" పేరుతో కథాసంపుటి వచ్చింది. "గౌతమి ఒడ్డున" అనే రెండవ కథాసంపుటి త్వరలో రాబోతోంది. చాలా విశిష్టసంస్థల సన్మానాలందుకున్నారు. కొన్ని కథలని కోనసీమ, గౌతమీ తీరగ్రామాల ప్రజల శబ్దభాషలో రాస్తున్నారు. ఇప్పటి వరకూ రాసిన కథకులు వ్యవహారికభాష అంటూ రాసిన దానికి శబ్దభాష చాలా దగ్గరగా అనిపించినా కూడా నిశితంగా పరిశీలిస్తే చాలా తేడా ఉంటుంది . ఇది వారు చేస్తున్న కొత్త ప్రయోగం!*

***రామలచ్చుం నవారు మంచం మీద పడుకుంటాది. ఆపక్కనే చద్దరు మీద బ్రౌనీ పడుకుంటాది. రామలచ్చానికి ఈ ఒంటరి బతుకులో ఓ తోడు దొరికింది. మనిషిలో మాటాడినట్టు దాంతో మాటాడతంది. అది అంతా ఇంటన్నట్టు, దానికేదో అర్ధమైనట్టు తోకూపుతా గారమొత్తే కాళ్ళు నాకుతా ఉంటాది.***

అద్దంకివారి లంకలో రామాలయం పక్కన కిరాణాకొట్టు అమ్మే రామలక్ష్మికి నోరెక్కువ. ఆమె కొట్టు అమ్మేటపుడు కూడా కొంటానికొచ్చినోళ్ళతో నెమ్మదిగా మాట్టాడదు. అందుకే, తప్పకపోతే తప్ప ఆవిడ కొట్టుకు రారు జనాలు! 'ఎవరైనా కొంటానికొచ్చినోళ్ళతో కొంత నెమ్మదిగా మాటాడవే' అని ఆవిడ స్నేహితురాలు పార్వతిలాంటోళ్ళు ఎవరైనా చెబితే "ఏం ఆళ్ళు నా మాటలు కొనుక్కొటానికొచ్చారా, నా సరుకులు కొనక్కోటానికి వచ్చారా? ఆళ్ళకి అవసరం లేనిది 'అయ్యో మన రామలచ్చుమ అమ్ముతుందని కొంటారా... లేపోతే ఓ రూపాయి ఎక్కువిచ్చి కొంటారా? నేను నాడిమైన సరుకమ్ముతాను. అందుకే వత్తారు తప్ప, నాతో కబుర్లాడతాకొత్తారేటే?'' అంటూ వితండమాడతాది.

ఊళ్ళో ఎవరెలా వున్నా ఈవిడ నోటికి జడిసి తలపోటెందుకని, ఏ సాంగతం పెటుకోపోయినా, ఊరి మొత్తంలో ఈ పార్వతి ఒక్కతే రామలక్ష్మికి స్నేహితురాలు! 'దానితో ఎలా ఏగుతున్నావే?' అని ఎవరైనా అడిగినా, 'దాని మాటే కటువు మనసు ఎన్నపూస! ఏదైనా కట్టం అంటే ముందుంటాది. నాకు దానవసరం లేకపోయినా, చిన్నప్పటి నుంచి చూసిందాని మీదట దాన్ని వదులుకోలేను' అంటాది. 'దాని నోటికి కన్నకొడుకే పారిపోయి, ఏరే ఉంటున్నాడు నువ్వు మాత్రం బాగానే అర్ధం చేసుకున్నావే' అంటారాళ్ళు!

రామలచ్చుం అని అందరూ పిలేచే అడబాల రామలక్ష్మికి, అప్పుడెప్పుడో చాపెక్కిన సంవత్సరానికి అద్దంకోరి లంకలో, దింపు తీసే కాండ్రేగుల సీతారాముడితో పెళ్ళైంది. పెళ్ళైన ఏడాదికే ఓ పిల్లోడు కడుపున పడ్డాడు. ఆడు భూమ్మీద పడక ముందే సీతారాముడు అద్దంకి సూర్యనారాయణగారి చేలో, దింపుతీత్తా మోకుతాడు తెగిపోయి నేలమీద పడ్డాడు. పిల్లోడు ఆళ్ళమ్మ కడుపులోంచి భూమ్మీద పడకముందే సీతారాముడు భూదేవి కడుపులోకెళ్ళిపోయాడు. అప్పటికి రామలచ్చుంకి

పదహారేళ్ళు. ఆళ్ళమ్మా, నాన్న గుండెలు బాదుకుని ఏడ్చారు, తీసుకెళ్ళి పురుడయ్యేంత వరకూ దగ్గరుంచుకున్నారు. ఆళ్ళు మాత్రం ఈవిడని ఏటెల్ల కాలం పెంచలేరు కదా! ఆ పిల్ల తర్వాత ఆళ్ళకి, ఇంకో ఇద్దరు ఆడపిల్లలు పెళ్ళికి ఉన్నారు. అందుకే ఆళ్ళమ్మ ఓ రోజు బియ్యం ఏరతున్నపుడు నెమ్మదిగా ''రామూ మీ ఆయన పోయినా ఆళ్ళూరిలో ఇల్లుంది కదా! నువ్వెక్కడే కూకుండే అదెవరైనా ఎగరేసుకుపోతారు. ఈ ఊళ్ళో చెయ్యటానికి కూడా ఏ పనులు ఉండవు. ఆ ఊళ్ళో అయితే ఏదోక పని దొరుకుద్ది. కూలిపనైనా చేసుకోవచ్చు. ఇక్కడేముంది? ఖాళీగా కూర్చుని నీ మొఖం నేను, నా మొఖం నువ్వు చూసుకోటం తప్పా! మీనాన్న నేను ఓ నెలకి సరిపడా సరుకులు, పై ఖర్చులు ఇచ్చి నిన్ను దింపేసి వత్తాం!'' అంటూ సైతిగా నిన్నిక పెంచలేం అని చెప్పింది.



రామలచ్చాన్ని... ఆళ్ళమ్మ నాన్న తీసుకొచ్చి ఆళ్ళత్త గారింట్లో దించి ఓ రెండ్రోజులుండి ఎళ్ళారు. రామలచ్చుం అత్తగారు అందరిలాంటిదికాదు. ఊరంతా 'దీని కాలు మంచిది కాదు! ఇదిలా అడుగెట్టిందీ, దున్నపోతులాంటోణ్ణి మింగేసింది. ఇంకెందుకు దీన్ని నీ దగ్గరెట్టుకున్నావ్ తోలెయ్యకా' అని ఎందుకు పనికిరాని సలహాలిచ్చినా, కోడల్నేమైనా అన్నా ఊరుకోదు. ఆవిడేం చదువుకోపోయినా ''అదేమన్నా మోకుతాడు కోసేసిచ్చిందా? లేపోతే చెట్టు మీంచి గెంటేసిందా? ఆడికి భగవంతుడు ఎన్ని పుట్లు తినాలని రాసాడో! అందుకనే ఎవడిరాత ఎవడు మారుత్తాడో..'' అంటుంది. పైగా అంత చిన్న వొయసులో మొగుడుపోయాడు, కొంతకాలం బతికాల్సిన పిల్ల బతుకెట్టా ఉంటాదో అంటా జాలిపడతంది. ఆ పిల్లని ఆళ్ళమ్మనాన్న వొదిలేసారని మరీ జాలిగా ఉంది ఆయమ్మకి! అందుకే ''ఒలే రామలచ్చుం, కూలో నాలో చేసుకుని కలోగెంజో తాగుదాం! నువ్వెక్కడికీ ఎల్లక్కల్లెద్దు. నేను పన్లోకెల్లి ఒచ్చేనప్పుడికి కాత కూడొండిపెట్టు చాలు!'' అంటుంది.

అలాగే ఊళ్ళో ఎవరి చేలో పనున్నా, ఆయా రైతులకు కూలోళ్ళని పురమాయించే మేస్త్రీలందరికీ 'ఎక్కడ పనున్నా పిలవమని తనొత్తానని' చెప్పింది. కానీ పాపం ఊదుపు కెళ్ళి వొచ్చిందంటే నడుం సలుపుతుందని రాత్రంతా మూలిగేది. అందుకే "బాప్ప ఇయ్యాల్దినించి, నువ్వు చిన్నోడిని చూసుకుంటా ఇంట్లో ఉండు పన్లోకి నేనెల్తాను" అంటూ రామలచ్చుం ఎళ్తంది పన్లోకి.

ఓరోజు రామలచ్చుం జతగా ఉండే ఇందుర్తి... పార్వతి ఆళ్ళాయన కమతం చేసే ఏకుల బద్ద్రాజు చేలో కలుపుతీతకి ఈళ్ళద్దరినీ రమ్మన్నాడు, ఎళ్లారు. మజ్జానం భోజనాలయ్యాక రామలచ్చుం ఒక్కతే కాళ్ళు మడుచుకొటానికెళ్తంటే, ఎనకాలే పార్వతి చేలోకి దిగిపోయింది. చేలోకి దిగితే రామలచ్చుం ఉన్న చోటు కనిపించదు. అందుకే పార్వతిని కంగారెట్టి చేలోకి దింపేడు. బద్ద్రాజు అసలు ఆ ఉద్దేశంతోనే ఈళ్లిద్దరినీ పనికి రమ్మన్నాడు. ఇందుర్తి పార్వతి చూడటానికి అంత బాగోదు. రామలచ్చుం మొఖం తేటగా కళగా కళ్ళు తేనే రంగులో ఉండి, మళ్ళీ మళ్ళీ చూడాలనిపించేలా ఉంటాది. ఈ అందం తన సొంతమైతే చచ్చేదాకా అనుభవించొచ్చు అన్న ఆలోచన బద్ద్రాజుది. మగస్పర్శ కరువైన శరీరం ముట్టుకుంటే రాగాలు పలికే రసరంజితమైన వయసు. అందుకే ఎలాగైనా సొంతం చేసుకుని తనివితీరా అనుభవించాలని అతని ఆలోచన. అందుకే ఈ ప్రయత్నం. రామలచ్చాన్ని ఎనకాల నుంచి గట్టిగా కావిలించుకున్నాడు.

వెనకనించి పట్టుకోగానే, ఊహించని ఆ దౌర్జన్యాన్ని తట్టుకోలేక బలంగా తిరగబడింది. శక్తినంతా ఉపయోగించి ఆ కౌగిలినించి విడిపించుకుని, పారిపోతుంటే వెంటాడాడు. వేగంగా వచ్చి మళ్ళీ పట్లుకోబోయేలోగా కాలికి తగిలిన రాయి తీసుకుని, బలంగా పట్టుకుని ''దగ్గరకొచ్చావంటే బుర్ర బద్దలుకొట్టేత్తాను. నువ్వు మోతుబరవైతే... మిగితా ఓళ్ళకి! నాక్కాదు, దగ్గరకొచ్చావో చచ్చావే'' అంది.

''ఏంటే పెద్ద పత్తిత్తులా మాటాడతన్నావ్! మొగుడు చచ్చి ఏడాదైంది ఇన్నిరోజుల్లో ఎవడితోటి పడుకోలేదా... అంత పత్తిత్తువా? బతికినన్నాళ్ళు ఎవడితోటి పడుకోవా, చూత్తాను! ఏదో రోజు నీకు నువ్వే నాదగ్గరకొత్తావ్, చూస్కో! ఊరు నాది, నన్ను కాదని ఎలా బతుకుతావో నేను చూత్తాను!'' అంటా, దగ్గరకెళ్తె నిజంగానే బుర్ర బద్దలుకొడతాదని వదిలేసాడు.

అక్కడినించి పరుగులాంటి నడకతో సరాసరి ఇంటికొచ్చేసింది. వెక్కివెక్కి ఏడ్చుకుంటా!

అది చూసిన మంగతాయారు, జరిగిందేంటో ఊహించింది. ఇలా జరుగుతుందని భయపడే తను ఎళ్ళేది పనిలోకి. ఏడుత్తా వత్తన్న రామలచ్చికి ఎదురొచ్చి ''ఏమైందే తల్లీ! ఆ భద్ద్రావు గాడేమైనా అన్నాడా? సచ్చినోడు ఆడికి ఆడోళ్ళంటే చాలా లోకువ. ఆడి చేలో పన్చేయటాని కొచ్చినోళ్ళంతా, ఆడి పక్కలో తొంగోడాని కొచ్చినోళ్ళని ఆడి ఉద్దేశం. ఏమైందే తల్లీ చెప్పు!'' అంటా బతిమాలింది.

రామలచ్చి జరిగిందంతా చెప్పింది.

"ఒలే... ఇలా నోరుమాలిందాన్లా ఉంటే, లెగలేనోడు కూడా చెయ్యట్టుకుంటాడు. నిన్ను చూత్తేనే ఉచ్చోసుకొనీలా ఉండాల! 'అయ్యబాబోయ్ దీనితో పెట్టుకుంటే ఊరందరిలో పరువు తీసేత్తది' అని భయపడాల. నిన్ను చూసి ఎవరైనా అలా ఉండాలంటే, ఉప్పడిలా నోరు మాలిందానిలా కాదు, గయ్యాళి గంపలా ఉండాల!'' అంటూ చెవిలో ఇల్లు కట్టుకుని పొరెట్టింది.

అక్కడినించి రామలచ్చుం ముంగిలా ఉండటం మానేసి పాత సినిమాల్లో సూరేకాంతంలా తయారయ్యింది!

రామలచ్చుం చేతిలో బంగపడ్డ బద్దర్రాజు ఒళ్ళు ఉడికి పోతుంది. ఎలాగైనా కసి తీర్చుకోవాలని ఊళ్ళో పనులకి మనుషుల్ని పురమాయించే ఓళ్ళందరినీ పిలిచి చేప్పేడు. “రామలచ్చిది నిన్న నా పన్లోకొచ్చింది. సరిగా పన్జేత్తలేదని అడిగితే తిట్టింది. కులం తక్కువ ముండ.. దాన్నింక ఎవరి పన్లోకి పిలకండి! పిలిచినా, పన్లోకెట్టినా మీ అందర్ని ఎలేసేసి, తూరుపోళ్ళతో పని చేయించుకుంటాం జాగర్త!” అంటూ మేస్త్రీలందరికీ వార్నింగిచ్చాడు.

అప్పటినుంచి ఆళ్ళిక బయింపడి, రామలచ్చాన్ని పన్లోకి పిలత్తుం మానేసేరు. ఇది తెలీక అందర్నీ అడుగుతుంది రామలచ్చుం. దానికాళ్ళు... అసలిసయం చెప్పకుండా మాట దాటేత్తన్నారు. చివరకి పార్వతి చెప్పేసింది అసలిసయిం!

అలా ఓ నెలరోజులు చూసాక, మంగతాయారు కోడలికి తలకి కొబ్బరినూని రాసి దువ్వుతా ‘‘ఒలే రాముడూ ఆళ్ళిక నిన్ను పనికి పిలరు. ఆళ్లు పిలిచినా ఎళ్ళొద్దు కానీ, నా దగ్గర పదేలున్నాయ్. ఇంగో ఈ దిద్దులమ్మితే ఇంకో ఇరవై ఏలొత్తాయ్. లచ్చారం రెడ్డిగారి దగ్గర ఓ ముప్పై ఏలు వారం పద్దు తీసుకుంటే అరవై ఏలుతో కిరాణాకొట్టెడదాం. రాములోరి గుడి పక్కన కాంద్రేగుల నారాయడు గారిల్లు ఖాళీగా ఉంది కదా, ఆళ్ళు పనులకని హైదరాబాద్ ఎళ్ళిపోయారు. ఆ ఇల్లు అడిగితే ముందు గది అద్దెకిత్తారు. అందులో కిరాణా కొట్టెడితే భలేగుంటది. నీకిట్టమైతే, రేపు కంసాలి ఈరబెమ్మం గారి దగ్గరకెళ్ళి దిద్దులమ్మి డబ్బులట్టుకొత్తాను!’’ అంది.

దానికి ‘‘బాప్ప నీకంటే నాగురించి ఆలోచించి ఓళ్ళు ఎవరున్నారు నీ ఇట్టం!’’ అంది.

అనుకున్న పదిరోజులికి అన్ని అనుకున్నట్టే జరిగాయి. ఊరి మద్యలో కోదండరామాలయం పక్కన కాంద్రేగుల నారాయిడి గారింట్లో ఆకెళ్ళ పేరిశాస్త్రిగారి లక్ష్మీగణపతి పూజతో వ్యాపారం మొదలెట్టారు. కొట్టు నదరలో ఉండబట్టి, ‘రామలచ్చుం నాడిమైన సరుకులమ్ముతాది’ ‘మాట నవర్ద ఉండదు. ఖచ్చితమైంది.’ ‘నోరే మంచిదికాదు కానీ...’ అంటా ఊరంతా అనుకోటంతో కొట్టు బాగా లాగుతుంది. కొట్లో అదిలేదు, ఇదిలేదు అనకుండా అన్ని అమ్ముతుంది. రామలచ్చుం పనులు చూసి మంగతాయారు మురిసిపోతుంది. ‘బిడ్డ మొగోడిలా కట్టపడతుంది. ముద్దు ముచ్చట లేకుండా’ అనుకుంటా ఓ రోజు ‘‘ఒలే రాముడు... ఏటెల్ల కాలం నేనుండను. నీకేమీ ఒయిసై పోలేదు. ముప్పైకూడా రాలేదు. నీక్కూడా ఓ అందం చందం ఉండాల ఒక తోడుండాల, నా మాటిని మళ్ళీ పెళ్ళి చేసుకో’’ అని బతిమాలతంది.

దానికి ‘‘చాల్లే బాప్ప! ఇప్పుడు పెళ్ళేంటి ఒచ్చినోడు నాకొడుకుని చూత్తాడా? చేత్తాడా? నా సంపాదనతో ఆణ్ణి పెంచాల, నాకొడుక్కి ఇంకేముంటాది?’’ అంటా ససేమిరా ఒప్పుకోలేదు.

పార్వతితో కూడా చాలాపార్లు చెప్పించింది. ఆళ్ళమ్మ నాన్నలతో కూడా చెప్పించింది. కానీ ఒప్పుకోలేదు. అలాగే ఏళ్ళకేళ్ళు గడచిపోయేయ్, కానీ రామలచ్చుం ఆలోచన మారలేదు. మంగతాయారుకి ఓ తెల్లవారు జామున లో బిపి వల్ల నిద్దర్లోనే ప్రాణం పోయింది. ఆ రోజు దాకా కోడల్ని కూతుర్లా చూసిన అమ్మలాంటి అత్తగారు, ఆవిడ కూతుర్లాంటి కోడల్ని శాశ్వతంగా వొదిలి శాశ్వత నిద్రలో కెళ్ళిపోయింది. రామాలచ్చాన్ని నిజంగా ఒంటరిని చేత్తా!

ఆళ్ళత్తగారు మంగతాయారు ప్రేమ వాత్సల్యం గురుతొచ్చి రోజూ పొగిలి పొగిలి ఏడుత్తుంది. నిజానికి జీవితంలో అంత ఏడుపు ఆఖరికి ఆళ్ళాయన చచ్చిపోయినపుడు కూడా ఏడలేదు.

మంగతాయారుకి చేయాల్సిన అన్ని కార్యాలు, పదకొండో రోజు కార్యక్రమాలతో సహా చాలా ఘనంగా చేసింది రామలచ్చుం అత్తగారి మీద ప్రేమతో! ఇప్పుడు నిజంగా ఒంటరిదై పోయింది. రామలచ్చుం కొడుకున్నా ఆ ఒంటరితనాన్ని

బర్తీ చేయలేకపోయాడు. ఆడికి ఆడి జతగాళ్ళు ఆళ్ళతో ఆటలతో మునిగి తేల్తున్నాడు.

ఊరిలోకి కొత్తగా బాప్టిస్ట్ చర్చికి జేగురుపాడు నించి ముంగమూరి దైవప్రసాద్ అని ఓ పాస్టరు గారొచ్చారు. ఆయన చర్చి కొచ్చేవోళ్ళు, రానోళ్ళు అనే తేడా లేకుండా అందరిళ్ళకీ వొచ్చి ప్రార్థన చేసి ఎళ్తన్నారు. అలా పతివారం వత్తా రామలచ్చున్ని మార్చేసారు. ఆవిడప్పుడు బైబిల్ మిషన్ చర్చికెళ్తంది. బాప్తీసం కూడా తీసుకుంది.

సీతారామ్ ఆళ్ళ కాలేజీలో జూనియర్ ఏకుల బద్ధ్రరాజు కూతురు కార్తీకని ప్రేమించాడు. ఆ ఇసయం ఆళ్ళమ్మతో చెబితే అళ్ళిపోయింది. ''ఆళ్ళ నాన్న పరమ మూర్ఖుడు! పోయి పోయి ఆడి కూతుర్ని ప్రేమించావేంట్రా బాబా!'' అంటూ బయపడింది.

డిగ్రీ పూర్తవగానే సీతారామ్‌కి బెంగుళూరులో ఉద్యోగం వచ్చింది. మంచి పేకేజీతో ఆ ధైర్యంతో పేటలో పెద్దోళ్ళని తీసుకెళ్ళి సంబంధం అడిగితే ఎవరూ ఊహించని విధంగా బద్ధ్రరాజు పెళ్లికొప్పుకున్నాడు. ఎందుకంటే కార్తీక, సీతారామ్‌ని తప్ప ఎవరినీ చేసుకొనందంట. సీతారామ్‌కేమో మంచి జీతంతో మంచి ఉజ్జోగం ఉండటం వల్ల ఒప్పుకునొండొచ్చు. 'కానీ పెళ్ళయ్యాక ఎప్పుడికీ రామలచ్చుం దగ్గర ఉండం అని ఒప్పుకుంటేనే' అంటా మెలికెట్టాడు. దానికి రామలచ్చుం ఎంటనే ఒప్పేసుకుంది. సీతారామ్ ఏమీ మాట్లాడలేదు. ఊళ్ళో మాత్రం, రామలచ్చుం నోటికి జడిసి కొడుకే ఊరొదిలి పోయాడని ప్రచారం చేసాడు బద్ధ్రరాజు.

అలా మళ్ళీ ఒంటరైంది!

రామలచ్చుం ఆ కొట్టు లేకపోతే ఆ ఒంటరి బతుకులో ఇంకేం దారుణాలు జరిగియ్యే అనుకుంటూ, రోజూ అత్తగార్ని, కొడుకుని తల్చుకుంటా ఏడ్వని రోజు లేదు రామలచ్చానికి! రోజంతా కొట్టు కాళీ దొరికినపుడు ఆదివారాలు పూర్తిగా చర్చి, సహవాసులు బైబిలు... ఇది రామలచ్చుం జీవితం!

ఓ ఊరకుక్క దాని పిల్లతో కలిసి రామలచ్చుం కొట్టుకాడి కొచ్చింది. పొద్దతమానం ఆ కొట్టు దగ్గరే పడుకుని చూత్తంది. ఎవరైనా ఏమైనా ఎత్తారేమోనని. రామలచ్చానికి కుక్కలంటే చిరాకు, భయం! ఆ ఊరకుక్క కొట్టెదురుగా కూచ్చుని పొద్దున్నించి చూత్తన్న దానికేమీ ఇదపలేదు. కొట్టుకాడికి అరిస తింటా వొచ్చిన బన్నూగాడు కుక్కపిల్ల నచ్చి అరిస ముక్కిరిసి ఏసాడు. కుక్క పిల్ల తింటానికొచ్చేలోపు, తల్లికుక్కొచ్చి దాని వాసన చూసి దాని కుక్కపిల్ల ఎక్కడ తినేత్తాదోనని, అరిస ముక్క నోటితో కరిసి పెట్టుకుని, దూరంగా తీసుకెళ్ళి కాళ్ళతో గొయ్యితీసి, అరిస దాంట్లో ఏసి మట్టితో కప్పేట్టేసింది. ఇదంతా చూత్తన్న బన్నూగాడికి, రామలచ్చానికి ఇద్దూరంగా అనిపించింది.

''పెద్దమ్మా ఆ కుక్కెందుకలా చేసింది?'' అనడిగితే ''అరిస తింటే కుక్క చచ్చిపోద్దిరా! ఆ అరిస తిని, దాని పిల్లెక్కడ చచ్చిపోద్దో అని తల్లికుక్క దాన్ని కప్పేట్టేసింది. చూసావా ఇది చాలా మంచి కుక్కన్నమాట!'' అంది. ఎంటనే ఆయిమ్మి తెచ్చుకున్న కేరేజి లోంచి కొంచెం అన్నం తీసి పెరుగు కలిపి ఒక సత్తుగిన్నెలో ఏసి పెట్టింది. రెండు కుక్కలు తిన్నాయ్. అప్పుడు చూసింది. కుక్కపిల్ల కాలుకి రక్తం కారుతుంది. అది చూసి జాలేసి దానికి మందు రాసి కట్టుకట్టింది. ఆదే మొదటిసారి రామలచ్చుం కుక్కని ముట్టుకోవటం. రోజంతా అక్కడే ఉంటున్నాయి, ఆ తల్లీ పిల్లాని. రెండ్రోజుల తర్వాత తల్లికుక్క ఎక్కడికి పోయిందో కనబడట్లేదు. కుక్కపిల్ల ఒంటరిదైపోయింది. పొద్దుట సాయంత్రం రామలచ్చుం దానికి పెరుగన్నమో కూరన్నమో, అప్పుడప్పుడూ పాలు పోత్తంది.

పొద్దత్తమానం కొట్టు దగ్గరే ఉండి రామలచ్చుం కొట్టుకట్టేసి ఇంటికెళ్తంటే కూడా వత్తంది. దాన్ని చూసి రామలచ్చానికి జాలేసింది. 'దాని బతుకు నాలాగా ఒంటరిది' అనుకుంది. దాని మేపటం మొదలెట్టింది. వారానికోసారి సబ్బుతో తానం చేయిత్తంది. మెడలోకి తోలు బెల్ట్ ఏసింది. తానాం చేయింతనపుడు చూత్తే గోళ్ళు లెక్కడితే ఇరవై ఒకటి గోళ్ళున్నాయ్. అలా వుంటే ఆ కుక్కకి ఇస్వాసం ఎక్కువుంటదని ఎప్పుడో చిన్నప్పుడిన్నది. అందుకే ఇది ఇంత నమ్మకంగా ఉంటుందని అనుకుంది. కుక్కపిల్లకి పెరెట్టమంటే సీతారామ్ ' బ్రౌనీ' అని పెరెట్టాడు. ఆ పేరు దానికి నచ్చినట్టుంది. 'బ్రౌనీ' అనగానే తోకూపుకుంటా వచ్చేత్తంది. కుక్కపిల్లలు చిన్నపడే బాగుంటాయ్. పెద్దదే బాగోవు కానీ దీనికి సదుపాయం వల్ల బుజ్జిగా అందంగా జాతి కుక్కలకంటే అందంగా ఉంటుంది. రామలచ్చానికి ముద్దోచ్చేసి దానికి తానం చేయించి బొట్టు పెడతంది. ఆ బొట్టు దానికెంత బాగుంటుందో!

రామలచ్చుం నవారు మంచం మీద పడుకుంటాది. ఆపక్కనే చద్దరు మీద బ్రౌనీ పడుకుంటాది. రామలచ్చానికి ఈ ఒంటరి బతుకులో ఓ తోడు దొరికింది. మనిషిలో మాటాడినట్టు దాంతో మాటాడతంది. అది అంతా ఇంటన్నట్టు, దానికేదో అర్థమైనట్టు తోకూపుతా గారమొత్తే కాళ్ళు నాకుతా ఉంటాది.

ఓ తెల్లవారు జాము గుండెపోటుతో నిద్దర్లోనే చచ్చిపోయింది రామలచ్చుం. పొద్దుటే లెగ్గానే ఆళ్ళమ్మ లెగలేదని చూసుకొని, కాళ్ళునాకినా, చేతులు నాకినా, గోళ్ళతో రక్కినా, చలనం లేపోయే సరికిదానికి అర్థమై పోయింది... రామలచ్చుం చచ్చిపోయిందని! అది చెప్పటానికి దానికి మాటలు రావు కాబట్టి దాని భాషలో పెద్దగా మొరుగుతూ అరుత్తా వుంటే చుట్టుపక్కలోల్లకి అనుమానమొచ్చి' ఏంటి ఎప్పుడూ లేంది ఇంత గట్టిగా అరుత్తుందేంటి కుక్క' అని తిట్టుకుంటా, దాన్ని కొడదామని వచ్చినోళ్ళకి రామలచ్చుం వరండాలో నులకమంచం మీద పడుకునుండటం చూసి, దగ్గకొచ్చి చూత్తే అప్పటికే చచ్చిపోయి చాలా సేపవటం వల్ల ఒళ్ళు చల్ల బడిపోయిందని అర్థమైంది. చుట్టుపక్కలోల్లు కొడుక్కి ఫోన్ చేసి చెప్పారు. ఎంటనే ఇమానంలో ఒచ్చేసాడు. అన్ని కార్యక్రమాలు దగ్గరుండి మాబాగా జరిపించాడు. చిన్నప్పటినించి ఫ్రెండ్‌లా మెలిగిన ఆళ్ళమ్మని గుర్తుచేసుకుని కుమిలి కుమిలి ఏడ్చాడు. బ్రౌనీ రోజంతా మొరుగుతూనే ఉంది. అది దాని ఏడుపేమో!

ఇన్నిరోజులు రామలచ్చుం బతుకుతో ఒంటరితనం దోబూచులాడతా ఉన్నప్పుడు, తన జీవితంలోకొచ్చిన బ్రౌనీకి, ఇప్పుడు ఒంటరితనం మిగిలింది. అది దాన్ని తట్టుకోలేకపోయింది. రోజంతా రామలచ్చుం సమాధికాడ ఉంటుంది. పందకొండోరోజు అందరూ రామలచ్చుం పెద్దకార్యం నాడు పొద్దునే ప్రార్థన చేద్దామని ఎళ్ళేసరికి రామలచ్చుం సమాధి కూడా కాళ్ళు దగ్గర బ్రౌనీ చచ్చిపోయి ఉంది. నిజానికి కుక్కలకి తొమ్మిదేళ్ళ ఆయిషుంటది. బ్రౌనీకిపుడు మూడో ఏడు. వేదన ఉంటే ఆయిషుతో పనేముంది. రామలచ్చుం లేని లోటుని భరించలేకపోయిన బ్రౌనీ ఇస్వాసం ముందు మనుషుల ప్రేమ చిన్నబోయింది.

జీవితమంతా ఒంటరితనంతో దోబూచులాడిన రామలచ్చుం చివరికి చావులో మాత్రం ఒంటరి కాలేదు!

ప్రత్యేక
బహుమతి
పొందిన కథ

# ఈ మందిర మిటులుండేనా


**డా. దారల విజయకుమారి**

9177192275


తిరుపతిలో నివసిస్తున్న, డా. విజయకుమారి గారు మానసికశాస్త్రంలో పిహెచ్ డి చేసారు. ఈమె కవితలు, కథలు... ఫన్ డే, సాహిత్యప్రస్థానం, వివిధ, స్నేహ, ప్రజాశక్తి, నేటి నిజం, మహిళామార్గం, శ్రమజీవి, ప్రజాసాహితి, సహరి, నెచ్చెలి, కౌముది, ఈమాట, మల్లెతీగ, వార్త, స్వాతి విశాలాక్షి లాంటి పలు పత్రికల్లో ప్రచురితమయ్యాయి. "వేచాను కలకై" అనే కవితాసంపుటి విడుదలైంది. కర్నూలు జిల్లా కలెక్టర్‌గారి ఉగాది పురస్కారంతో పాటు పలు సంస్థల నుండి పురస్కారాలు, బహుమతులు అందుకున్నారు. ఆకాశవాణి లో కవితలు, కథలు ప్రసారం చేయబడ్డాయి. నవలలు రాసే ప్రయత్నంలో ఉన్నారు.

***"శ్రీజ గూర్చి నువ్వు ఏదేదో ఊహించుకుని బాధపడుతున్నావు. శ్రీజను నేను ఎప్పుడూ ప్రేమించలేదు. ఆమె ప్రేమను తన ఉత్తరాలు మెసేజ్‌లు ద్వారా వ్యక్తపరచినా నేను పట్టించుకోలేదు. మన పెళ్ళి జరిగాక, తాను నాకోసం బిల్డింగ్ పైనుండి దూకేసి ఆత్మహత్య చేసుకోవడానికి ప్రయత్నించిందని వాళ్ళ పేరెంట్స్ చెప్పేదాకా తెలియదు. పెళ్ళి అవగానే నీకీ విషయం చెప్పాను. తనకు కాళ్ళు చేతులు సచ్చుబడి పోయాయి."***

అస్తిత్వ ప్రకటన చేయాలని ఉంది. ఎన్ని నైపుణ్యాలున్నా ఇంటి అద్దంలో కొంచెమై ఒదిగిపోయాను. ఎత్తిపొడుపుల హోరున్నా... కొండలా నిశ్శబ్దంగా ఉండిపోయాను. నా కోసం ఏమైనా చేయమని కోరలేదు. వేకువను... వెన్నెలను సృష్టించి ఇచ్చేయమని అడగలేదు. అరక్షణమైనా నా కోసం ఉంచుకోలేదు. నా కాలాన్ని తనకు తనవాళ్ళకే ధారపోసాను.

'మట్టంత మంచిదాన్ని... మినహాయించే మనసున్నదాన్ని' అంటారు నా స్నేహితురాళ్ళు.

ప్రతి నిమిషం తన చుట్టూ మసలే నా మమతలను తాను గమనించదు. నా ఆశల ప్రవాహాలను ఎత్తులనుండీ తోసేసినా సరే తన గొంతు తడిపే జలపాతమైపోయాను. ఎడారి జీవితాన్నిచ్చినా ప్రేమ పచ్చిక మొలిపించాను. కలతల్ని ఉండచుట్టి విసిరేసుకుని... మా అనుబంధాలను అనుసంధానం చేసేందుకు ఎంతో సహనం... ఎన్నో సర్దుబాట్లను చేసా.

అయినా సరే... నిశ్శబ్దం మా ఎదలగుండా నెమ్మదిగా ఎలా ప్రవహించిందో నేనెప్పుడూ ఆలోచించలేదు. సహజంగానే జరిగింది. మా మధ్య అరమరికలు ఎప్పుడు పొడచూపాయో... రాన్రానూ అసమానతలు పెద్దవిగా కనిపించసాగాయి.

ఎప్పుడూ వ్యక్తిగత ప్రయోజనాల కోసమే తాపత్రయపడే మనిషి. నా కోసం ఎలా ఆలోచించగలడు? ఏ సాయమైనా ఎలా చేయగలడు? నాకోసం ఒక్క పదిరూపాయలు ఎలా ఖర్చు పెట్టలేడో... తన పది నిముషాల కాలాన్ని కూడా ఖర్చు చేయడు. అంతా లెక్కాచారమే... తన దృష్టి లో జీవనం అంటే లాభనష్టాల వ్యాపారమే. కొంత ఆలస్యంగానైనా అంది పుచ్చుకుంటాడనుకున్నా. ఉహూ..

అతని గూర్చి కూడా ఒకటేదైనా మంచి చెప్పాలంటే... బండగా పనిచేయగలడు శ్రమించగలడు!

నాకేమో చదువు సంధ్యలు, సాహిత్యం కళల పట్ల తృష్ణ.

'అవేవీ తిండి పెట్టవు. ఇన్ఫ్రాక్ట్ పనికి రావు. అలాంటి మనుషులు కూడా ఉత్త టైం వేస్ట్ మనుషులు' అని చాలా తేలికగా కొట్టి పారేస్తాడు.

ఈ వైరుధ్యాల పర్యవసానమే ఈ పేరుకుపోయిన నిశ్శబ్దమా.. అవుననే అంటుంది మనసు! నా పట్ల అతని తప్పిదాలు చాలానే ఉన్నాయి.



నా ఎదుగుదలను అడ్డుకోవడం అతని మొదటి తప్పిదం. అతనికి అతను లాంటి చాలా మంది మగవాళ్ళకు, అసలు అది తప్పే కాదు.

నాకు చాలా కళలలో ప్రవేశం ఉంది, నైపుణ్యం ఉంది. మ్యూజిక్, డ్రాయింగ్, పెయింటింగ్, రచనలు... అన్నీ కాకపోయినా ఏవో ఒకటి రెండింటిలో అయినా బాగా రాణించాలని ఆశ! మ్యూజిక్ అంటే కచేరీలు చేసే స్థాయి ఉందా.. డ్రాయింగ్ అంటే ఎగ్జిబిషన్ పెట్టే స్థాయి ఉందా... ఏం ఉపయోగమని అడుగుతాడు. అన్నింటినీ డబ్బుకు ప్రయోజనానికి ముడిపెడితే ఎలా... నా సంతృప్తి కి విలువలేదా? అది నాకు చాలా ఇంపార్టెంట్ కద. అందుకే... నా మట్టుకు నాకు అది ఇంకా తీవ్రమైన నేరం. నా మనుగడ మొత్తాన్ని రాసిచ్చేందుకు ఎవరికి ఎవరు!

నైపుణ్యాలను కొన్ని కొన్ని సంపాదించుకుంటూ జ్ఞానాన్ని కాస్త కాస్త చేర్చుకుంటూ... జీవితంలో ఏవేవో సాధించి, నలుగురికీ ఉపయోగపడే పనులు చేస్తూ... ఈ ఊహే ఎంత బాగుంది. గుర్తింపబడాలని ఎవరి కుండదు. నాకూ ఉంది!

మా ఫ్రెండ్ అంటుంది 'ఎవరికైనా ఎప్పటికీ బోర్ కొట్టనిది రెస్పెక్ట్ అని' అలాంటి రెస్పెక్ట్ కూడా కావాలి నాకు!

రోజువారీ సందుల గుండా అడుగులేస్తున్నప్పుడు, జీవితంలో ఎదిగే క్రమంలో, ఎత్తులకు ఎగబాకే క్రమంలో కాళ్ళకు సహనపు తొడుగుల్ని నేనే వేసుకోవాలి. అందుకే ఓపికను వెంటబెట్టుకొని అడుగుతుంటా 'అవి చేయాలి ఇవి చేయాలి' అని!

అయినా నాకు ఇష్టమైనవి చేసేందుకు ఇన్ని ఇబ్బందులా... ఎంత దాకా ఇలా?

ఎందుకోసమైనా... ఎవరికోసమైనా తాపత్రయ పడేందుకు ఎంతోకొంత అభిమానం ఉండాలి. అది ఉంది గనుకే, నేను తన కోసం తన వాళ్ళ కోసం పనులు చేస్తున్నాను. మరి అతనికి నాపట్ల ఉందా లేదా..?

ఈ పిచ్చి మనసు బంధాల నుంచీ పక్కకు వెళ్ళ నివ్వదు. బాధ్యతల నుంచి తప్పుకు తిరగ నివ్వదు. ప్రేమలు ఉండాల్సిన మనసుల మధ్య... మనుషుల మధ్య ఎందుకిన్ని యుద్ధాలు అనుకుంటేనే చెప్పలేనంత బాధ కల్గుతుంది.

రెప్పల క్రింద మోహరించినవి రాలిపడనీకుండా... ఎన్ని లక్షల సార్లు అడ్డుకున్నానో, కూర్చుకున్న బంధాలు జారిపోకుండా... ఎన్ని వేల సార్లు కాచుకున్నానో! తాను విసిరి పారేసిన అనుభూతులను ఏరుకుని పదిలపర్చుకున్నా. తానెపుడు మేలుకుంటాడో అని ఎంతగానో నిరీక్షించాను. నిట్టూర్పులు లేని రోజులు అరుదుగా వస్తున్నాయి!

గిర్రున తిరిగే కాలంలోనూ నిందలను ఎత్తిపొడుపులను జతేసుకుని మరీ వస్తున్నాయి. వర్తమానాన్నీ ఒడుపుగా వాడుకోలేక అవస్తలు పడుతూనే, గతం గతః అనుకుని సర్దుబాటు ముసుగు వేసుకుని కాలంతో నడుస్తున్నాను.

పెళ్ళైయ్యాకే... ఎన్నో కలలు కూలిపోయాయి!

మరెన్నో అభిరుచులు కాలిపోయాయి!

ఆశ్చర్యంగా అనుభవాల చేదేమో శిథిలమవదు! ఒక పక్క గాయపడిన వైనాలేమో మనసు తెరపై కెక్కుతూ అణిచేస్తున్నా, ఆత్మాభిమానము మళ్ళీ మొలుస్తూనే ఉంది.

ఒకనాడు తన చేతల అల్లరికి చెవిలో చెప్పే తన ఊసులకు ఆహ్లాదపడిన అల్ప సంతోషిని. ఇపుడు గాయపడిన ప్రతి అనుభవానికీ వేసుకున్నా ఓ నవ్వు ముసుగు, చుట్టూ తిరిగి చూరు కింద చేరుకుని, తలను తీసి రెక్కలోన దాచి పెట్టుకోవడమే నా పని! ఏముందీ సంసారంలో ఉక్కపోతల మధ్యాహ్నాలు, సంఘర్షణల సాయంత్రాలు, ఊపిరాడని రాత్రులు!

తప్పించుకోలేని... తప్పుకు తిరగలేని... నెత్తిన బెట్టుకు తిరగక తప్పని సంబంధాలు!

ఎన్నెన్ని అనుకున్నాను! కష్టాలు ఎంత దూరంగా విసిరేసినా, వెతుక్కుంటూ బంధాల పిచ్చుకలు మరలి వచ్చేస్తున్నాయి గుండెల్లో గూళ్ళు కట్టుకోవాలని! అల్లిబిల్లి ఊసుల కోసం బుల్లి బుల్లి పొదరిండ్లను కట్టుకోవాలని, అందులో... సంయమనపు సరాగాలను సాగనివ్వాలని... ప్రతిదినం ఆప్యాయత చినుకుల్లో తడిసిపోవాలని... కదిలితే ఒలికిపోయేలా హృది కడవ నిండుగా అనురాగం ఉండాలని... ఏవేవో కట్టుకున్నాను ఊహల్లో!

ఏడ్చిన ఎదను ఏకరువు పెట్టనిస్తే కదా... ఏదో ఒక వేళలో హృదిలోని సెగలకు జోల పాడాలి కదా! నిట్టూర్పులకు నెమ్మదించినపుడే వేసారిన భావాలు సముదాయించు కోగలిగేది! స్థిమితంగా కూర్చోనివ్వని... నిటారుగా నిల్చోనివ్వని... నెమ్మదిగా పడుకోనివ్వని గాయాలు. బాధను తగ్గించుకునే చిట్కాలనే చెబుతారు, కానీ గాయాల మూలాలను తడమరు. నా గాయాల గూర్చి ఎవరికైనా తెలియాలి.

కనీసం ఒక పిట్టకో... జంతువుకైనా ఇలా చెప్పాలనుంది.

“తన నోటినే చూడు, ఫిరంగిలా లేదూ! మాటల గుండ్లు పేలుస్తుందది గురిపెట్టిన సందర్భాలే రోజంతా...” అని అసలు పెళ్లి అవసరం ఎంతుందో ఎవరు చెప్పగలరు.

'పెళ్లి అనే ప్రక్రియ జీవితాన్ని ఎంతవరకు ప్రభావితం చేస్తుంది' అన్న కోణంలో ఇంకా నమోదు కాని అనుభవాలున్నాయి, చేదు అనుభూతులున్నాయి! ఎందరో మేధావులున్న ఈ నేలపై ఖచ్చితంగా సమాధానాలు చెప్పలేని ఎన్నో ప్రశ్నలున్నాయి. స్వానుభవంతో సహానుభవంతోనో కొన్నింటికి జవాబులు చెప్పగలిగినా ఇంకా మీమాంసలోనే!

సెపరేషన్ పాయ, మా కాపురం గుండా నెమ్మదిగా ఎలా ప్రవహించిందో నేనెప్పుడూ ఆలోచించలేదు! చాలా సహజంగానే జరిగింది. మధ్య అసమానతలు ఎప్పుడు పొడచూపాయో రాన్రానూ అసమానతలు పెద్దవిగా కనిపించ సాగాయి. వ్యక్తిగత ప్రయోజనాల కోసం తాపత్రయపడే మనిషి కొంత ఆలస్యంగానైనా, నా భావాలను అందిపుచ్చుకుంటాడనుకున్నా! అదేదీ జరగలేదు. పూర్తిగా విభిన్న ధ్రువాలం. అందుకే ఆకర్షింపబడ్డామేమో... కాపురం మొదలవడం వరకూ సైన్స్ బాగానే పనిచేసింది.

"కలిసి భోజనం చేయాలని... కాస్సేపు మాట్లాడుకోవడం కోసమే సమయం కేటాయించాలని" అడుగుతాను... అప్పీలు చేస్తాను. కానీ అవేవీ తనకు తెలియవు. అసలు అలాంటి ఇష్టాలు కోరికలు తనకు లేవు. అడిగితే కొనిపెడతాడు. చెబితే చేస్తాడు. అలా కాదుకదా! అడగకుండానే చెప్పకుండానే కొన్ని కొన్ని తెలుసుకోవాలి... అలా మసలుకోవాలి. ఇంత యాంత్రికంగా ఉన్న జీవిత సహచరుని నేను ఊహించలేదు. సరదాగా మార్చుకునేందుకు ఎన్నో ప్రయత్నాలు చేసాను. ఏవీ ఫలించలేదు!

"ఆమెకు మెత్తగా కలిపి తినిపిస్తారుగా... నాకూ ఎపుడైనా అలా సేవలు చేసారా?" డైరెక్ట్‌గా అడిగేస్తే..

"దానికంటే చేతుల్లేవు, నీకేమైంది! అయినా నువ్వూ అడిగితే పెట్టేవాడ్ని" తన జవాబు.

"మీ కోసమే వెయిట్ చేస్తున్నా భోంచేయకుండా"

"నిన్ను ఎవరు వెయిట్ చేయమన్నారు. నీ టైంకు నువ్వు భోంచేయడం నేర్చుకో" అతని జవాబు.

"ఉదయం నుంచీ చాలా మిస్ అయిపోయా. ఇంత ఆలస్యం అయిందేం?" అంటే,

"ఆఫీస్ అయిపోయాక బయట నాకు ఎన్నో పనులు..."

"ఆమె పనులేనా..."

"బయట పనులు ఎవరు చేస్తారు?"

"బయట పనులంటే ఇంటికి కావాల్సిన సరుకులు తీసుకుని రావడమే కదా"

"ఇంట్లోకే అన్నీ తెచ్చిపెడితే చేస్తున్నావు. బయట తిరిగి కష్టపడి అన్నీ తెచ్చుకుంటే తెలిసేది"

"నేనూ అక్కడా ఇక్కడా కష్టపడే పని చేస్తున్నాను కదా!"

"లోకంలో నువ్వొక్కదానివే కాదు ఉద్యోగం చేస్తున్నది. లేడీ టీచర్లను చూడు. ఆరున్నరకంతా బస్టాండులో ఉంటారు. ఎప్పుడు లేస్తారో ఎప్పుడు వందుతారో"

ఎవరికి తగిన ఇబ్బందులు వాళ్ళకున్నాయి. నా ఇబ్బందులు చెప్పినా పట్టించుకోడు. అసలు వినడు. ప్రతిసారీ ఆయన మాటలతో నాకు షాక్ తగులుతూనే ఉంది. మాటల రాళ్ళను గొంతు జేబులో వేసుకుని తిరుగుతుంటాడు.

నేనొక డబ్బుల చెట్టును. సంపాదన పండ్లు తక్కువ కాసినపుడు... ఈ దేహపు చెట్టుకు రోగాలొచ్చినపుడు... అందమైన ఆకులు ఒక్కోటి రాలిపోతుపుడు... బహుశా ఒక్కో రాయి విసురుతాడు. ఎద ఏ మూలకో విసురుకుని పడి విస్తృతంగా ముక్కలు చేస్తుంది. కాస్త నిమ్మళించాక మళ్ళీ ఒక్కో శకలము వచ్చి అతుక్కుంటుంది. ఈ గుండె పగిలి అతుక్కోవడం రోజులో ఎన్ని సార్లు? ఇదమిత్థం లేదు.

మొగుడు పెళ్ళాల మధ్య నలిగినట్టు మనసు మరెక్కడా ఇంతగా నలగదేమో. అయినా అనాదిగా ఆ విషయాలేవీ చర్చకు రావు! వచ్చినా... ఏ పది శాతమేనేమో! ఆలుమగల గొడవలు నాలుగ్గోడల మధ్యలోనే సమసిపోవాలనే పెద్దరికాలు, మద్దిస్తాలు మరీ ఎక్కువ. ప్రతి స్త్రీకి ఎన్నో అనుభవాలు. కానీ ప్రతివారి అనుభవాలు భిన్నమైనవే.

అతడేం మీకు కొత్తగా ఆనందాన్ని పరిచయం చేసిందేమీ లేదు. ఆనందాన్ని ఆవిష్కరించడం స్త్రీకేమీ కొత్తకాదు. అసలు స్త్రీ సమక్షమే ఉత్తేజపూరిత సందర్భం. అది చవిచూసిన మగవారు ఆమెను ఎన్నడూ చులకన చేయరు.

అయినా స్త్రీని సమీపించిన, ఆమె నిజమైన సాన్నిహిత్యాన్ని అనుభవించిన పురుషులు అరుదుగా అగుపిస్తారు. ఆసక్తికరమైన విషయం ఏమిటంటే... అందుకు మగవారికి ఉండాల్సిన అర్హతలను ఆ సదరు స్త్రీలే నిర్ణయిస్తారు. ఇవి ఆమె నుండీ లాగేసే హక్కు ఎవరికీ లేదు. స్త్రీల బలం ఇక్కడే దాగుంది.

స్త్రీలనుండి విడుదల కోరిన వారు ఒక రకంగా పుల్లని ద్రాక్ష అనుభూతులతో నిండిన వారే. దుర్బలమైన మనసున్నవారు. ఓటమిని అంగీకరించిన వారు. నిజానికి వారు ఛేదించడానికి వీలుపడని... ఆమె ఒక సంక్లిష్టమైన ప్రక్రియ. నేనూ దానికి కొనసాగింపునే. ఆటుపోటుల్లోంచి పడిలేచే ప్రయత్నం మరింత బలమైంది. అదే నేనిప్పుడు చేస్తున్నది!

కలిసి జీవించాలా... విడిపోయి జీవించాలా? అసలు విడిపోయేంత పెద్దకారణాలా ఇవన్నీ? అదే తేల్చుకోవాలి. సాధ్యమైనంత త్వరగా తేలిపోవాలి.

విడిపోవాలని ప్రతిపాదిస్తే ఏమంటాడో! ఏమన్నా సరే. నేనే నాకేది కావాలో నిర్ణయించుకోవాలి. ఈరోజు ఆఫీస్ నుంచి ఇంటికి చేరుకోగానే నా అస్తిత్వ ప్రకటన చేయాలి. ఆ తర్వాత విడిపోవడం గూర్చి ప్రస్తావించాలి.

పరధ్యానంగా నడుస్తున్నానేమో ఏదో కొట్టిన గుర్తు... తర్వాత ఏం జరిగింది గుర్తులేదు. మెలుకువ రాగానే హాస్పిటల్ బెడ్ పైన ఉన్నాను. నా బెడ్ పక్కనే కిటికీ ఉంది. ఏవో మాటలు వినిపిస్తున్నాయి. అది మా ఆయన గొంతు.

“అబ్బే మీరేమీ కంగారు పడకండి మామయ్యా... కాలు ఫ్రాక్చర్ అయింది. సర్జరీ చేసి ఇంప్లాంట్ వేసారు. ఆ... అవును మామయ్యా... ఇపుడు మెడిసిన్ ఎంతో డెవలప్ అయింది. మీరు ఎవరూ రాకండి! నేను చూసుకుంటాను. చాలా సున్నితమైంది. చిన్న చిన్న వాటికే బాధపడుతుంది. నా కొడుకుతో పాటూ తనూ చిన్నదే! నేనూ మెడికల్ లీవ్ కు అప్లై చేసాను. అయ్యో... భలేవారే. ఆమె నా భార్య! నాకేమైనా అయితే దాని ప్రాణమే పోతుంది. ఎప్పుడూ తానే అన్నీ చేస్తుంది. తనను కనిపెట్టుకుని చూసుకుందుకు నాకు ఈ అవకాశం దొరికింది. మీరు, అత్తమ్మ ధైర్యంగా ఉండండి. నేను చూసుకుంటాను. ఉంటాను మరి!”

ఆయన వస్తున్న అలికిడికి కళ్ళు మూసుకున్నాను. ఆయన నా మంచానికి దగ్గరగా వచ్చి స్టూల్ మీద కూర్చుని నా తలపై చేయి వేసి నిమిరారు. అంతే. నేను కళ్ళు తెరిచాను.

“అంత పరధ్యానంగా నడిస్తే ఎలా!”

“నేను వేరుగా ఉండాలని నిర్ణయించుకున్నాను. మీతో సేవలు చేయించుకోవడం నాకు ఇష్టం లేదు!” గొంతు పెగుల్చుకుని ఎలాగో చెప్పేసాను

మొదట చాలా షాక్ అయ్యాడు. తర్వాత నన్నుఅలాగే నిమురుతూ చెప్పడం మొదలు పెట్టాడు.

“శ్రీజ గుర్చి నువ్వు ఏదేదో ఊహించుకుని బాధపడుతున్నావు. శ్రీజను నేను ఎప్పుడూ ప్రేమించలేదు. ఆమె ప్రేమను తన ఉత్తరాలు, మెసేజ్‌లు ద్వారా వ్యక్తపరచినా నేను పట్టించుకోలేదు. మన పెళ్ళి జరిగాక, తాను నాకోసం బిల్డింగ్ పైనుండి దూకేసి ఆత్మహత్య చేసుకోవడానికి ప్రయత్నించిందని వాళ్ళ పేరెంట్స్ చెప్పేదాకా తెలియదు. పెళ్ళి అవగానే నీకీ విషయం చెప్పాను. తనకు కాళ్ళు చేతులు చచ్చుబడి పోయాయి. ఎపుడైనా వాళ్ళ అమ్మ కాల్ చేస్తుంది. ఏదో మానవతా దృక్పథంతో వెళ్ళి చూసి వస్తుంటాను అంతే! ఆమెకు జీవితమే లేదు. పరోక్షంగా ఆమె ఈ స్థితికి నేనే కారణం. ఏదో గిల్టీనెస్! నన్ను నువ్వే అర్థం చేసుకోకుంటే ఎలా... ఇంకెలా చెప్పను? నువ్వు తప్ప నా జీవితంలో ఎవ్వరూ లేరు. నన్ను నమ్ము. అయినా ఇవన్నీ నీకు చెప్పి చేసిందే! సారీ రా”

అలా చెబుతుంటే దుఃఖం కట్టలు తెంచుకుంది. వెక్కిళ్లు పెడుతుంటే... “ఉత్త తిక్కదానివి. ఇంత దానికే ఏడుస్తారా! ప్రమాదం ఇంతటితో పోయింది. దానికే ఆనందపడాలి. ఈ ఫ్రాక్చర్ ఎంత? ఆరువారాలైతే నార్మల్ అయిపోతావు!”

ఏడుస్తూనే... నిమురుతున్న ఆయన చేతిని పట్టుకున్నాను.

మళ్ళీ ఆయనే... “ఇంత సున్నితమైన దానివి ఎలా దొరికావే? నిన్ను ఎంత జాగ్రత్తగా చూసుకోవాలి!” అంటూంటే ఫోన్ రింగయింది.

“ఆ ఆ ఎలా వచ్చావ్? ఆటోలోనా? మరి రెస్ట్ తీసుకుంటావా? వంట చేస్తావా? మీ వదిన వంట బాగ చేస్తుంది తెలుసుగా... వదినకి నచ్చేటట్లు చేస్తావా... సరే సరే నవ్వనులే. మీ వదిన బాగుందిలే. నువ్వు వచ్చి చూద్దువు కానీ. అయితే హోటల్ నుంచి వద్దంటావ్. సరేలే. నువ్వు ఇక్కడి కొస్తే... నేను వెళ్లి బాబును పికప్ చేసుకుంటాను. సరే మరి ఉంటాను తల్లీ!” కాల్ కట్ చేసి, “మంజు వచ్చింది. రమ్మని నేనే కాల్ చేసా. ఎప్పుడు నువ్వు అందరికీ చేసిపెట్టడమే... కానీ ఏ రోజూ ఎవరితో ఏదీ చేయించుకోలేదు. నీ విషయం చెప్పగానే అమ్మ అందరూ వస్తామంది. నేనే వద్దన్నాను. సరే మరి మంజును పంపుతాను అంది!” అని మళ్ళీ నాకు దగ్గరగా వచ్చి కూర్చున్నాడు

నేను తనని అలాగే చూస్తుంటే... “ఏవీ ఆలోచించకుండా నిద్రపో. ఎప్పుడూ నీకు రెస్ట్ దొరకలేదు. ఈ విధంగా అయినా హాయిగా విశ్రాంతి తీసుకో. నీ జాబ్ గుర్చి అస్సలు వర్రీ వద్దు. ఆ ఉద్యోగం పోయినా బాధలేదు. నీ ఆరోగ్యం ముఖ్యం!” అని తలుపు దగ్గరకు వేసి బయటకు నడిచాడు.

నేను అలా ఎలా ఆలోచించానో.. తనని ఎలా అలా అర్థం చేసుకున్నానో... ఇపుడు కళ్ళు తేటగా కనిపిస్తున్నాయి. చుట్టూ అన్నీ సరిగ్గా కనబడుతున్నాయి..

అయినా విడిపోవడం ఏంటి... అంత తేలికా?



9885620065

ప్రత్యేక బహుమతి పొందిన కథ

# హృదయం ఎక్కడున్నాది

వసుంధర

*కథామంజరి పాఠకులకే కాదు, తెలుగు సాహితీప్రియులకు సుపరిచితులం. ఆరు దశబ్దాలుగా కొన్ని వేల రచనలు చేసిన వీరిని, మరోసారి పరిచయం చేయడం.. సూర్యుదుని దివిటీతో చూపెట్టడమే అవుతుంది.*

***పరోపకారిగా పేరు రాలేదు కానీ, నాస్తికురాలని పేరుపడ్డాను. దేవుడు లేదని ఎన్నడూ అనకపోయినా, గుడికి వెళ్లడానికి సంకోచించకపోయినా నాకా పేరు పోలేదు. నేనూ ఖండించలేదు.***

***ఇరవయ్యో శతాబ్దంనుంచి ఇరవయ్యొకటో శతాబ్దంలో ప్రవేశించేనాటికి నా వయసు నలభైరెండు. సంప్రదాయాల పట్ల జనం తీరు మారుతుందని ఆశ పడ్డాను కానీ ఇక్కడా రెండు దశాబ్దాలు దాటినా, సంప్రదాయం మరింత చిక్కబడిందే కానీ పల్చనవలేదు.***

ఆచరణలో శతాబ్దాలుగా చెరగని సంప్రదాయం మనది. ఆదరణతో దశాబ్దాలుగా నిలబడ్డ రాజ్యాంగం మనది. కానీ హృదయం ఎక్కడుందో తెలియక, ఈ రెండూ భావం పలకని సంగీతమై పోయాయని నా పరిమిత జ్ఞానానికి చిన్నప్పట్నించీ అనిపిస్తూనే ఉంది.

నాకు ఎనిమిదేళ్లప్పుడు మూడో క్లాసులో ఉండగా... బడికి ఒకాయనొచ్చి, "మాయింట్లో నందికేశుడి నోము. చిమ్మిలి, చలిమిడి, సెనగలు, పరవాన్నం ప్రసాదాలు. లంచవర్లో మీ క్లాసులో బ్రాహ్మల పిల్లల్ని మాఇంటికి పంపండి!" అని మేస్టారికి చెప్పి వెళ్లాడు.

అప్పట్లో ఎక్కువమంది ప్రభుత్వపు బడుల్లోనే చదివేవాళ్లం. ప్రైవేటు బడుల్లో బాగా ఒళ్ళు వాచిన వాళ్ల పిల్లలు చదివేవాళ్లు.

"మీలో బ్రాహ్మల పిల్లలందరూ, అయిదో తరగతి మేస్టారితో కలిసి, ఆయన తీసుకెళ్లిన చోటికి వెళ్లండి!" అన్నారు మా మేస్టారు మధ్యాహ్న భోజన సమయంలో.

"మీరు రారా మేస్టారూ!" అనడిగితే, "మేము రాకూడదు. ఇది బ్రాహ్మలకు మాత్రమే!" అన్నారాయన మామూలుగా! మనోభావాలు దెబ్బతినడం గురించి అంతగా తెలియని రోజులవి.

మేమంతా వేరే మేస్టారితో వెళ్లి, వాళ్లు పెట్టినవి కడుపునిండా తిన్నాం.


మాలో ప్రతి ఆరుగురు పిల్లలకీ ఆ ఇంటి మనిషొకరు కాపలా ఉన్నారు. వంటకాల్లో పిసరంత కూడా వదిలేయకూడదుట. అందుకని కాపలా అన్నమాట!

ఆ రాత్రి నాకు విరోచనాలు మొదలయ్యాయి. నాల్రోజులు బడికి సెలవెట్టాల్సొచ్చింది. ఐదోరోజు బడికెడితే, ఆ రోజు నాతోపాటు విందుకి వెళ్లనవాళ్లందరిదీ నా పరిస్థితే!

విందుకి రాని మిగతావాళ్లు, 'మా బాగా అయింది' అని మమ్మల్ని చూస్తునట్లు అనిపించింది నాకు.

నాకు పదిహేనేళ్లప్పుడు మా పిన్ని కైలాసగౌరి నోము నోచింది. ముత్తైదువులకు పసుపు, కుంకం పంచిపెట్టడం ఆ నోములో భాగం. నోముకి ఇన్ని కుంచాల పసుపు, ఇన్ని కుంచాల కుంకం అని లెక్క ఉంటుంది. నియమం ప్రకారం ఆ మొత్తం పసుపు, కుంకం బ్రాహ్మణ ముత్తైదువలకే పంచాలి.

మా పిన్ని ఉండే అపార్టుమెంట్సులో అన్ని కులాలవాళ్లూ ఉన్నారు. ఇతర మతాలవాళ్లు కూడా ఉన్నారు. అంతా సుహృద్భావంతో ఒకే కుటుంబంలా ఉంటారు. ఒకరి నియమాల్ని ఒకరు తప్పు పట్టరు. ఎవరి పరిధుల్లో వాళ్లుంటూ, అన్ని వేడుకల్లోనూ ఒకరికొకరు సహకరిస్తుంటారు.



మా పిన్ని కూడా కలుపుగోలు మనిషి. నోముకి తన స్నేహితుల్లో ఇతర కులాలవాళ్లనీ, మతాలవాళ్లనీ కూడా పిలిచింది. పంపకాల లెక్కకు సరిపడా పసుపు, కుంకం పళ్లేల్లో సర్దింది. ఇతర కులాలు, మతాల వారికి వేరే పళ్లేలు ఏర్పాటు చేసింది. ఇది చాలా ఏళ్లుగా జరుగుతోంది.

పసుపు కుంకుమల పంపకమయ్యేదాకా పిన్ని ఎవరితోనూ మాట్లాడకూడదు. అందుకని నాకూ, నా వయసుదే అయిన తన కూతురికీ, ముందుగానే చెప్పింది... 'తను సైగ చేసినప్పుడు పళ్లేలు మార్చెయ్యమని!'

చిన్నపిల్లలం కదా, అప్పుడప్పుడు తడబడేవాళ్లం! వెంటనే పిన్ని గుడ్లెర్రజేసేది. చటుక్కున తప్పు గ్రహించి సద్దుకునేవాళ్లం.

పిన్ని గుడ్లెర్ర చేయడాన్ని అక్కడున్న కొంతమంది చూసే ఉంటారని నా అనుమానం. వాళ్లకిది అలవాటే ఐనా, నాకు మాత్రం మనసు నొచ్చుకుంది.

'అంతా మనుషులేగా పిన్నీ! అందరికీ ఒకలాగే ఇవ్వచ్చుగా' అన్నాను తరవాత.

'అంతా మనుషులే! కానీ కలెక్టరాఫీసులో కలెక్టరుకి ఎగ్జిక్యూటివ్ చైరూ, గుమస్తాలకి మామూలు కుర్చీలు. ప్యూనుకి బెంచి. అక్కడెవరూ ఏమీ అనుకోరుగా! మన సంప్రదాయం కూడా కలెక్టరాఫీసులాంటిదే!' అంది పిన్ని తేలికగా.

నాకు ఇరవై ఏళ్లప్పుడు క్షీరాబ్ధిద్వాదశి పూజ చేయించడానికి పురోహితుణ్ణి పిలిచింది అమ్మ!

ఆయన మంత్రాలు చదువుతుంటే, మేమంతా ఉసిరికాయలో దీపాలు వెలిగించి తులసిమొక్కకు పూజ చేశాం. పూజ పూర్తయ్యేక అమ్మ ఆయనకు అడిగిన సంభావన ఇచ్చేసింది.

ఆయన వెళ్లిపోయేక, 'పూజ బొత్తిగా బాగా చేయించలేదు. సంభావన మాత్రం పేలేసి పుచ్చుకున్నాడు. ఈ మాత్రం పూజ నేను చేయించలేకనా?' అని గొణిగింది అమ్మ.

'అలాంటప్పుడు నువ్వే చేయించాల్సింది. అటు సంభావనా ఇచ్చి, ఇటు తిట్టుకోవడంవల్ల చేసిన పూజకి ఫలితముంటుందా?' అన్నాను. దానికి బదులుగా అమ్మ చూసిన చూపు నన్నక్కణ్ణించి తరిమేసింది.

అమ్మే కాదు, నాన్న విషయంలోనూ ఇలాంటివున్నాయి.

ఏటా తాతగారి ఆబ్దీకానికి, మా ఇంటి పురోహితుడు భోక్తగా తన తండ్రిని కూడా తీసుకొస్తాడు. ఆ పెద్దాయనకి, తాగడంతో పాటు గుడిసెల్లో దూరే అలవాటూ ఉంది. తంతు ముగిసి, ఆయన భోంచేసి వెళ్లేక, 'ఇలాంటివాడి కాళ్లు కడిగి, ఆ నీళ్లు నెత్తిన జల్లుకోవాల్సొస్తోంది. నా కర్మ!' అని మిత్రులవద్ద వాపోయేవాడు నాన్న.

అంతా నాన్నపై జాలిపడేవారు. కానీ ఒకసారి ఓ మిత్రుడు, 'మా నాన్నకి ఆబ్దీకం పెట్టే రోజు ఉల్లిపాయ కూడా తినేవాణ్ణి కాదు. తంతు పూర్తయ్యేదాకా పచ్చి మంచినీళ్లు ముట్టుకోకుండా పరమనిష్ఠగా ఉండేవాణ్ణి. కానీ ఓ సారి తంతు జరిపించే పురోహితుడు... ఉదయమే హొటలుకెళ్లి ఉల్లిదోసె తినడం చూశాను. దాంతో తద్దినాలు పెట్టడం ఆపెయ్యాలనిపించింది. కానీ జనం నోటికి వెరవాలి కదా! హృదయాన్ని పక్కనపెట్టి, ఆబ్దీకాలు కొనసాగిస్తున్నాను. వాళ్లని ఆడిపోసుకోవడం ఎందుకు? మనకిష్టం లేని నిష్ఠలు, నియమాలు ఆపేస్తే సరిపోతుంది' అన్నాడు.

నాన్న అలా మారతాడని ఆశపడ్డాను. కానీ ఆయన ఆ పెద్దాయన విషయంలో పద్ధతీ మానలేదు, తిట్టుకోవడమూ మానలేదు.

'నోములూ, వ్రతాలకీ దూరంగా ఉండు. వీలైనంతలో తోటివాళ్లకి సాయపడు' అని ఈ అనుభవాలు చిన్నప్పట్నించీ నన్ను ప్రభావితం చేస్తూనే ఉన్నాయి. చేతనైనంతలో ఆచరణలో పెట్టాను.

అందువల్ల పరోపకారిగా పేరు రాలేదు కానీ, నాస్తికురాలని పేరుపడ్డాను. దేవుడు లేడని ఎన్నడూ అనకపోయినా, గుడికి వెళ్లడానికి సంకోచించకపోయినా నాకా పేరు పోలేదు. నేనూ ఖండించలేదు.

ఇరవయ్యో శతాబ్దంనుంచి ఇరవయ్యొకటో శతాబ్దంలో ప్రవేశించేనాటికి నా వయసు నలభై రెండు. సంప్రదాయాల పట్ల జనం తీరు మారుతుందని ఆశ పడ్డాను కానీ ఇక్కడా రెండు దశాబ్దాలు దాటినా, సంప్రదాయం మరింత చిక్కబడిందే కానీ పల్చనవలేదు.

ఆ మధ్య బాగా కలిగిన వాళ్లింట్లో నందికేశుడి నోముకి పిలుపొస్తే వెళ్లలేకపోయాను. 'మీరు రాలేదు, మంచిదే అయింది. నోము క్యాన్సిలైపోయిందని వెనక్కి పంపేశారా ఇంటివాళ్లు. కనీసం సారీ అయినా చెప్పలేదు' అని వాపోయారు వెళ్లొచ్చినవాళ్లు.

ఇంత జరిగినా నేను అదే నోముకి మరో ఇంటికెళ్లాల్సొచ్చింది.

పిలిచినవాళ్లు నా ముఖ్యస్నేహితుల చుట్టాలు. భార్య, భర్త మా ఇంటికొచ్చి, ''రేపు మీరు, అంకుల్ తప్పకుండా రావాలి. దోసెలు, గారెలు, అప్పాలు ప్రసాదం. బ్రేక్‌ఫాస్ట్‌గా పెట్టేస్తున్నాం. ఈ రోజుల్లో అందరికీ సుగరూ, బీపీ కదా! అందుకని ఎనిమిదికల్లా ప్రసాదం పెట్టేలా పూజ ప్లాన్ చేస్తున్నాం' అన్నారు.

ఎందుకైనా మంచిదని, నేను, మావారు తొమ్మిది దాటేక వెళ్లాం. అప్పటికక్కడ చాలామంది, ఎక్కువగా పెద్దవాళ్లు, నిలబడి ఉన్నారు. లోపల హాల్లో డైనింగ్‌టేబుల్స్, కుర్చీలు ఉన్నాయి. కుర్చీల్లో కొంతమంది చిన్నపిల్లలు వారి తల్లిదండ్రులతో కూర్చున్నారు.

పూజ ఇంకా మొదలవలేదట. నోము చేసే దంపతులు రెడీ అవడంకోసం... పురోహితుడు కూడా ఎదురుచూస్తున్నాడు.

బయట బాగా ఎండగా ఉంది. కూర్చోడానికి కుర్చీలు వేసారు కానీ వచ్చినవాళ్లందరికీ సరిపోయేటన్ని లేవు. అక్కడికీ కుర్చీల్లో కూర్చున్న కొంతమంది యువతీయువకులు పెద్దవాళ్లు రాగానే లేచి కుర్చీలు వాళ్లకి ఇచ్చేస్తున్నారు. అయినా ఇంకా నిలబడ్డ పెద్దవాళ్లు చాలామందే ఉన్నారు.

"వెళ్లిపోదామా?" అన్నారు మావారు.

"వెళ్లిపోతే బావుండదు. అయినా ఇంకా తొమ్మిదేకదా అయింది. మనింట్లోనే ఒకోసారి టిఫినుకి పదవుతుంది!" అన్నాను.

అక్కడే నిలబడి తెలిసినవాళ్లతో ఆ కబురూ ఈ కబురూ చెప్పుకుంటున్నాం! పూజ తొమ్మిదిన్నరకి మొదలయింది. పూజకి గంట పడుతుందని తెలిసి కొంతమంది ఇళ్లకెళ్లిపోయారు.

వీళ్లెంతమందిని పిలిచారో తెలియదు కానీ ఇంకా చాలామందే ఉన్నారు. మావారు నాకేసి వెళ్లిపోదామన్నట్లు చూశారు.

అంతలో నా క్లోజ్ ఫ్రెండ్ ఒకామె వచ్చి "ఆగండి! పెద్దవాళ్లం కదా, మనదే ఫస్ట్ బ్యాచిట!" అంది.

నేను కావాలనే మావారికేసి చూడకుండా సరేనన్నట్లు తలూపాను.

పూజ అయ్యేసరికి పావుతక్కువ పదకొండు.

ప్రసాద వితరణ మొదలెట్టగానే, పెద్ద హీరో సినిమా రిలీజైన తొలి ఆటకి హాలు ముందుండే తొక్కిసలాట కంటే ఎక్కువగా ఈ హాలు ముందు గందరగోళం మొదలైంది. ఆవురావురుమంటూ ఉన్న ఆ జనంలో కొంతమందికి చిన్నవే అనుకోండి, గాయాలయ్యాయి. కొంతమందికి ఎండవేడికి కళ్లు తిరిగితే, వాళ్లవాళ్లు మంచినీళ్ల కోసం వెతుకుతున్నారు.

పదకొండు దాటింది. నాకూ మా వారికీ నీరసమొచ్చేస్తోంది. కుప్పకూలితే చూడ్డానికి, పిల్లలు కూడా దగ్గర లేరు.

"వెళ్ళిపోదాం పదండి!" అన్నాను మావారితో.

"ఇప్పుడెక్కడికి? ఇంట్లో టిఫిన్ ఏర్పాట్లు కూడా లేవుగా!" అన్నారు మావారు.

అక్కడ మాకు తెలిసిన ఇంకో మాలాంటివాళ్లున్నారు. వాళ్లు వాళ్లబ్బాయితో కార్లో వచ్చారుట. వాళ్లు మాకు, కొంచెం దూరంలో ఉన్న హొటలుకెళ్లడానికి కారు ఆఫర్ చేశారు.

వెనక నుండి నా క్లోజ్ ఫ్రెండు, "ఉండండి, నెక్స్ట్ బ్యాచి మనదే" అని కేకెట్టింది. కానీ విననట్లుగా వెళ్లిపోయాను.

ఆ కారుని దేవుడే పంపేడనిపించింది నాకు. హొటల్లో టిఫిన్ తిన్నాక, ఒళ్లంతా చెమటలు పట్టేసి బాగా నీరసమొచ్చేసింది మాకూ, మమ్మల్ని తీసుకొచ్చిన పెద్దవాళ్లకీ! అది గమనించిన వాళ్లబ్బాయి, స్థిమిత పడేదాకా అక్కడే కూచుందామన్నాడు. తర్వాత మేము క్యాబ్ చేసుకుని వెళ్లిపోతామన్నా ఒప్పుకోకుండా, మమ్మల్ని మా ఇంటి దగ్గర దింపేశారు వాళ్లు.

'వాహనదాతా, సుఖీభవ' అనుకున్నాం మేమిద్దరం.

ఓ వారం తర్వాత వారంవారం మా కాలనీకొచ్చే కూరల సంతకెడితే, అక్కడ వారం క్రితం నోము నోచిన ఆమె కనబడింది. ఆమె నన్ను చూడలేదు. పక్కనున్న ఆమెతో, "నోము గ్రాండ్‌గా జరిగింది. చాలామందొచ్చారు. ఒంటిగంటదాకా ప్రసాద వితరణ జరిగింది. ప్రసాదమైపోయినా ఇంకా జనాలున్నారు. అన్నమొండించి పెడతామన్నాం కానీ వాళ్లు ససేమిరా అని, 'ఇంత గొప్ప వేడుక చూడ్డమే మా అదృష్టం' అని అభినందించి, ఏం తినకుండానే వెళ్లిపోయారు!" అంది.

'అయ్యో, మా చుట్టాలమ్మాయి పెళ్లికి అదే ముహూర్తం కావడంతో, అంత గొప్ప వేడుక మిస్సయ్యామన్నమాట!' అని బాధ పడింది వింటున్నామె.

ఆ పక్కనే ఉన్న మరొకామె, "నాకు నోములంటే మహా ఇష్టం. కానీ ఇంట్లో పెద్దాచిన్నా కూడా సహకరించరు. మీరు చక్కగా అన్ని రకాల నోములు నోస్తున్నారు. అదృష్టవంతులు. మీకు పుణ్యమే పుణ్యం" అంది.

నోము నోచినామె కళ్లబడకుండా మొహం చాటేశాను. నన్ను చూసిందంటే, వేడుక గొప్పతనానికి సాక్ష్యం అడుగుతుందేమో అన్న భయంతో!

నా మనసులో 'ఏది పుణ్యం, ఏది పాపం' అన్న మథన మొదలైంది. ఎందుకంటే అతిథులక్కడికి వచ్చింది... తిండికోసం కాదు, పుణ్యంకోసం! అలాగే నోము నోచినవాళ్ల ప్రసాదవితరణా, పుణ్యం కోసమే!

భావం పలకని గీతాన్ని హృదయం లేని మనిషితో పోల్చేవారు మా సంగీతం మేస్టారు. ఈ నోములు నాకు అలాంటి గీతంలా తోచగా, "పూజ అయిపోయాక ఆ ప్రసాదాన్ని ఏ అనాథాశ్రమానికో తీసుకెళ్లి ఇస్తే బాగుండదూ?" అన్నాను నా స్నేహబృందంతో.

వాళ్లంతా ఏకకంఠంతో, "అప్పటికీ ఇప్పటికీ నువ్వు మారలేదే! ఇంకా నాస్తికురాలివే" అన్నారు.

ఆచరణలో శతాబ్దాలుగా చెరగని సంప్రదాయం మనది. ఆదరణతో దశాబ్దాలుగా నిలబడ్డ రాజ్యాంగం మనది. కానీ హృదయం ఎక్కడుందో తెలియక, ఈ రెండూ భావం పలకని సంగీతమైపోయాయని నా పరిమిత జ్ఞానానికి చిన్నప్పట్నించీ అనిపిస్తూనే ఉంది.

శతాబ్దం మారినా జనం ఆలోచనలు మారలేదనుకుని నిట్టూర్చాను.

# ముందడుగు

అప్పరాజు నాగజ్యోతి

ప్రత్యేక బహుమతి పొందిన కథ



9480930084

*స్వస్థలం మచిలీపట్నం, ప్రస్తుత నివాసం బెంగుళూరు! ఎమ్ టెక్ (ఉస్మానియా యూనివర్సిటీ) , ఎంహెచ్ఆర్ ఎం (పాండిచ్చేరి సెంట్రల్ యూనివర్సిటీ ) , పీజి పిపిఎం(ఐఐఎం, బెంగుళూరు) చేసి, ఆల్ ఇండియా ఇంజనీరింగ్ సర్వీసెస్‌లో యుపిఎస్ సి ద్వారా ఇండియన్ టెలికాం సర్వీసెస్‌కి ఎంపికై, ప్రస్తుతం బెంగుళూరు లోని భారత్ సంచార్ నిగం లిమిటెడ్‌లో జనరల్ మేనేజర్‌గా పనిచేస్తున్నారు. అన్నిరకాల పత్రికలూ, పుస్తకాలూ చదివే అలవాటు బాల్యం నుండీ కొనసాగుతున్నా, సాహిత్యం పట్ల మక్కువతో మాతృభాష అయిన తెలుగులో స్వయంగా రచనలు చేయడం మాత్రం సెప్టెంబర్ 2016 నుండే మొదలైంది. నాలుగు సీరియల్స్, సుమారు వంద కథలు, నలభై పైగా కవితలు, వ్యాసాలు వీరి సాహితీ సంపద. ఈనాడు ఆదివారం అనుబంధంలోనే పదహారు కథలు ప్రచురించబడ్డాయి. స్వాతి వారపత్రిక నవలల పోటీలో వీరి నవలకి లక్ష రూపాయల బహుమతితో పాటు, వీరి చాలా కథలకు కూడా బహుమతులు, పురస్కారాలు లభించాయి.*

***మీ నానమ్మ ఇక తిరిగిరాలేని లోకాలకి వెళ్ళిపోయింది.***
***ఎవరో ఏదో అనుకుంటారన్న సంశయాలేమీ లేకుండా, హాయిగా, కరువుతీరా , నీ మనసులోని బాధంతా బైటకి వెళ్ళిపోయేలా శోకించు బాబూ!***

హాల్లో పడుకోబెట్టిన అమ్మ పార్థివదేహం ప్రశాంతంగా నిదురిస్తున్నట్లుగా వుంది!

'జాతస్య మరణం ధృవం' అంటూ దూరం నుండి భగవద్గీతలోని శ్లోకాలూ, వచ్చీపోయే వాళ్ళ రోదనలూ, పరామర్శలూ ఇవన్నీ కూడా అమ్మ, ఆ సర్వేశ్వరుని పిలుపునందుకుని వెళ్ళిపోయిందనే రుజువు చేస్తున్నా, 'అమ్మ ఇకపై లేదు' అన్న వాస్తవం మాత్రం నా బుద్ధిని దాటి మనసుని చేరనంటోంది!

"అదిగో... అమ్మాయి, అల్లుడు వచ్చేసారు. ఇంక కార్యక్రమం మొదలెట్టేయొచ్చు!" అన్న బాబాయి మాటలకి తలెత్తాను.

అప్పుడే గడపలోకి అడుగుపెడుతున్న అక్కయ్య "తమ్ముడూ, మనల్ని అనాథల్ని చేసి వెళ్ళిపోయిందిరా అమ్మ" అంటూ అమ్మ నిర్జీవకాయంపై పడి భోరుమని విలపిస్తుంటే "అక్కా, ఒక్కరోజు ముందైనా రాలేకపోయావా" అన్న మాటలని బైటకి రానీకుండా లోలోపలే అదిమేసేందుకు చాలా కష్టపడ్డాను.

మంచానికి అంకితమైన గత ఆరుమాసాల్లోనూ అమ్మ మాటలనిండా అక్కయ్యకి సంబంధించిన తలంపులే! ఆఖరి క్షణాల్లోనూ అక్కయ్యనే పలవరిస్తూ తనువు చాలించింది అమ్మ. కనీసం ఒక్కరోజు ముందైనా ఎలాగోలా వీలు చేసుకుని అక్కయ్య ఇక్కడికి వచ్చుంటే కూతుర్ని కళ్ళారా చూసుకున్న సంతృప్తితో అమ్మ వెళ్ళి వుండేది!

అక్క వెక్కిళ్ళ శబ్దం ఎంతకీ ఆగడంలేదు. రెండు పుష్కరాలపైనుండీ అమెరికాలోనే స్థిరపడిపోయి, పుట్టింటి బంధాన్ని

ఫోనుల్లో మాటల వరకే పరిమితం చేసుకున్న అక్కయ్య, ఈవేళ ఎంతో స్వేచ్ఛగా కన్నీళ్ళని జారవిడుస్తుంటే, కడుపులో పడ్డ నాటినుండీ ఈరోజు దాకా అమ్మనే అంటిపెట్టుకున్న నేను మాత్రం చెలియలికట్టని దాటి బైటకి దూకేందుకు ప్రయత్నిస్తున్న అశ్రుధారని, లోలోనే అదిమేసేందుకు విశ్వప్రయత్నాలు చేస్తున్నాను. ఎందుకంటే, గుండెల్లో సుళ్ళు తిరుగుతున్న దుఃఖాన్ని ఆపుకోలేక కాసింత ప్రక్కకి తిరిగి కళ్ళు తుడుచుకున్నా, లేదా ముక్కు చీదినా ఎవరో ఒకరు గభాల్న నా వద్దకి వచ్చి 'అరేయ్ విష్ణూ, ఆడాళ్ళతో సమంగా నువ్వూ కుళాయి విప్పితే ఎలా కుదురుతుందిరా! ముందు జరగాల్సిన కార్యక్రమం చూడు' అంటూ భుజం తట్టి మరీ 'నువ్వు మగాడివిరా బుజ్జీ' అని గుర్తుచేసి వెళ్తున్నారు.

భావోద్వేగాలకీ లింగభేదాలని అంటగట్టే సాంఘిక నియమంలోని ఔచిత్యమేమిటో నా బుర్రకి బోధపడడంలేదు!

ఇంతలో 'వదినా' అంటూ నా భార్య వినీల కూడా లోపలనుండి పరిగెత్తుకొచ్చి అక్కయ్యని పట్టుకుని ఒక్క తీరున రోదించడం నన్ను విభ్రాంతికి గురిచేసింది.



నేనూ, వినీలా ప్రేమించుకున్నామని తెలిసిన వెంటనే 'కులం గోత్రం తెలీని ఒక అనాథను నా ఇంటి కోడలిగా నేను ఒప్పుకోను' అంటూ మా వివాహానికి అభ్యంతరం చెప్పకపోగా 'పాపం, తల్లీతండ్రి లేని పిల్ల' అంటూ వినీలని ఆప్యాయంగా అక్కున చేర్చుకుంది అమ్మ! నాకూ, వినీలకి మధ్యన మాటామాటా వచ్చినపుడు కూడా అమ్మ నావేపున కాకుండా, వినీల పక్షాన నిలబడుతుండడం నాకు అప్పుడప్పుడు కోపాన్ని తెప్పించినా, అత్తాకోడళ్ళు అంత సామరస్యంగా ఉండడం నాకెంతో గర్వంగా వుండేది!

అలా వినీలని అమ్మ తన స్వంతకూతురిలా చేరదీసినా, చివరిరోజుల్లో ఆవిడ మంచాన పడ్డాక, వినీల మాత్రం అంటీముట్టనట్టుగా పరాయింటి పిల్లలాగే ఉండిపోవడమే కాకుండా, అమ్మ మలమూత్రాలని నేను స్వయంగా ఎత్తిపడేస్తుంటే చీదరించుకునేది కూడా! కడుపులోపడ్డ నాటినుండీ మా అమ్మ నాకెన్ని చేస్తే నేను ఇంతవాడ్ని అయ్యుంటాను? అలాంటి మా అమ్మకి స్వయంగా నా చేతులతో సేవలు చేయడం నా అదృష్టంగా భావిస్తాను.

మాతృసమానురాలైన అత్తగారిని చివరిరోజుల్లో అంతటి నిరాదరణకి గురి చేసిన వినీల కూడా, ఇప్పుడు ఆవిడ పోయాక ఆవిడ దేహంపై పడి శోకిస్తుంటే... మరి నేనో!

★★★

"శ్రాద్ధకర్మలను మనసుపెట్టి శ్రద్ధగా చేయాలి నాయనా, అప్పుడే ఫలం దక్కుతుంది" అన్న బ్రాహ్మడి హెచ్చరింపుకి ఉలిక్కిపడి, ఆలోచనల నుండి తేరుకుని అమ్మవేపు చూసాను.

శాశ్వతమైన నిద్రలోకి జారుకున్న అమ్మని చూస్తుంటే నాలో ఉవ్వెత్తుకొస్తున్న జ్ఞాపకాలు ఎన్నో!

అమ్మతో నా నలభై అయిదేళ్ల బంధంలోని ప్రతీక్షణమూ ఒక్కో మధురస్మృతే! జీవితంలో ఎప్పుడు ఏ చిన్నకష్టం కలిగినా 'అమ్మా' అంటూ వెళ్లి అమ్మ ఒళ్లో తల పెట్టుకుంటే ఎంతో ఉపశమనం దొరికేది. అలాంటిది యిప్పుడు ఇంత పెద్ద విఘాతం కలిగితే తలదాచుకునేందుకు ఏదీ అమ్మఒడి? గుండెల్లో బాధంతా బైటకి వచ్చేలా భోరున ఏడ్చేయాలనుంది. ఈ దుఃఖభారాన్ని నా గుండె ఇంక మోయలేనంటోంది!

ఇంతలో "పెద్దమ్మా" అంటూ పెద్దగా ఏడుపు వినిపిస్తే అదాటున తలెత్తాను.

అమ్మ భౌతికకాయంపై పడి ఒక్కతీరున రోదిస్తున్న మా పిన్ని కూతురు కాంచనని చూసి నివ్వెరపోయాను.

రెండుమాసాల క్రితమనుకుంటా, నా చేతికి శస్త్రచికిత్స జరగడంతో నేను నాలుగు రోజులపాటు ఆస్పత్రిలోనే ఉండిపోవలసివచ్చింది. 'నువ్వొచ్చి ఇంట్లో అమ్మకి కాస్త తోడుగా వుంటావా కాంచనా' అని ఆనాడు నేను అర్థిస్తే, 'అమ్మో, ఆవిడకి పైనుండీ క్రిందదాకా అన్ని పనులూ చేయడం నావల్ల కాదు బాబూ' అంటూ నిర్ద్వంద్వంగా చెప్పేసిన కాంచన, ఇప్పుడు తరలిరాని తీరాలకి పయనమైన అమ్మని చూసి గుండెలు పగిలేలా రోదిస్తుంటే నా మనసంతా నిర్వేదంగా మారింది.

ఈ మధ్యనే నెలరోజుల క్రితం ఇటువంటి కార్యక్రమాన్నే దగ్గరుండి చూడడం మూలాన బ్రాహ్మడు చెబుతున్న క్రతువుని తడబడకుండా చేస్తున్నానే గానీ, మనసంతా ఆరోజున ఇటువంటి పరిస్థితినే ఎదుర్కొన్న ప్రక్కింటి సంధ్య జ్ఞాపకాలతో నిండిపోయింది.

★★★

"అమ్మాయ్, పెద్దలం చెబుతున్నాము విను. మీ అన్నయ్య ఎక్కడున్నా వెంటనే పిలిపించు. కొడుకు చేత కన్నతల్లికి తలకొరివిని పెట్టించడమే విధాయకం! లేకపోతే ఆవిడకి పున్నామనరకం తప్పదు!"

"బ్రతికుండగా అమ్మని వేధించుకుతిన్న ఆ త్రాష్టుడు మా అమ్మకి తలకొరివి పెట్టడమంటే దగ్గరుండి మనమే స్వయంగా ఆవిడని పున్నామనరకంలోకి త్రోయడమేనండీ. అసలు వాడు పెట్టిన బాధలకే మా అమ్మ ఇలా అర్థాంతరంగా గుండెపోటుతో చనిపోయింది. ఆ నీచుడికి మా అమ్మ పాదాలని స్పృశించేందుక్కూడా అర్హత లేదు. మా అమ్మకి తలకొరివి

నేనే పెడతాను!" అంటూ దృఢంగా చెప్పింది... తల్లిని కడదాకా కంటికిరెప్పలా కాచుకుని చూసుకున్న కూతురు సంధ్య.

అయితే ఆమె మాటలని వీసమెత్తయినా ఖాతరు చేయకుండా "ఈ మాటలకేమి గానీ, ఎవరో ఒకరు ముందు ఆ కొడుక్కి కబురు పంపండి!" అని ఆ పెద్దవాళ్ళంతా అంటుంటే, ప్రక్కింట్లోనే వుండే నేనిక చూస్తూ ఊరుకోలేక "చూడండీ, కాలం మారుతోంది. స్త్రీపురుష భేదాలు లేకుండా అంతా అన్ని రంగాల్లోనూ దూసుకుపోతున్న ఈ ఆధునికకాలంలో, పాత నియమాలనే పట్టుకు వేలాడడం సబబు కాదు. సంధ్య అన్నయ్య ప్రతాప్‌ని నేను బాగా ఎరుగుదును. వాడంత నికృష్టుడిని నేనెన్నడూ చూడలేదు. తల్లికి తలకొరివి పెట్టాలంటే ముందుగా ఈ ఇల్లు తన పేరిట వ్రాయాలంటూ, ఆవిడ బ్రతికుండగానే వాడు పెట్టిన షరతుకి , ఆ తల్లి గుండె ఎన్ని చెక్కలయిందో నాకు తెలుసు! అటువంటి అప్రాచ్యుడిచేత తలకొరివి పెట్టిస్తే ఆ మాతృమూర్తి ఆత్మని క్షోభ పెట్టిన వాళ్ళమవుతాము. తల్లిని కళ్ళల్లో పెట్టుకుని చూసుకున్న కూతురి చేత ఆవిడకి తలకొరివి పెట్టించడమే సబబు. కాలంతో పాటు మార్పు అనివార్యం!" అంటూ అందరికీ నచ్చజెప్పి దగ్గరుండి సంధ్య చేత శ్రాద్ధకర్మలని జరిపించాను.

★★★

ఆనాడూ నా మనసులో ఇటువంటి భావాలే చెలరేగాయి.

ఈ సమాజం దృష్టిలో, అమ్మాయిలకి అందమూ, అణుకువా, అదే అబ్బాయిల విషయానికొస్తే... చదువూ, తెలివితేటలూ, ఇవే పొగడ్తలకి అర్థాలు! పొరపాటున అవి కాస్తా తారుమారయాయంటే ఆమెనేమో 'పొగరుమోతు, అహంకారీ' అనీ, అతన్ని 'చాతకాని సన్నాసి' అంటూ నిర్దాక్షిణ్యంగా ముద్ర వేసేసే సమాజం తను రూపొందించిన నియమావళికి భిన్నంగా మసలుకునే స్త్రీ పురుషులని తన బలమైన ఛర్నాకోలుని విసురుతూ ఎవరి బరిలోకి వాళ్ళు తిరిగి వెళ్ళేట్టుగా ఎల్లవేళలా చూసుకుంటూ ఉంటుందన్నమాట!

ధనంతో తులతూగే శ్రీమంతుల పట్లా, దారిద్ర్యరేఖకి బాగా దిగువున వున్నవారి పట్లా కొద్దిగా చూసీ చూడనట్టుగా వుండే సమాజం, ఒక్క మధ్యతరగతి మనుషులని మాత్రం క్షణక్షణం వేయికళ్ళతో కాపలా కాస్తూ వుంటుంది. ఇదేం న్యాయం?

మనసులో ఆలోచనాప్రవాహం ఎంతకీ తెగడంలేదు.

"మనవడు, మనవరాలు కనిపించరేమిటీ?" అని ఎవరో అడుగుతుంటే, "వచ్చేస్తున్నారండీ. దారిలో వున్నారు" అంటూ వినీల సర్దిచెప్పడం వినిపిస్తోంది.

అమ్మ చనిపోయిన వెంటనే నేను పిల్లలకు ఫోన్ చేయబోతుంటే "చూడండీ, ఈరోజు పిల్లలిద్దరూ వాళ్ళ స్నేహితులతో ఏవో పిక్నిక్ ప్రోగ్రాంలు పెట్టుకున్నారు. అనవసరంగా వాళ్ళ సరదాలని నాశనం చేయకండి. మీ అక్కయ్యగారు అమెరికానుంచి వచ్చేందుకు ఎంతలేదన్నా పదహారు గంటల సమయం పట్టనే పడుతుంది. అందాకా ఆవిడని కదిపేందుకు ఎలాగూ లేదు. ఆలోగా పిల్లలు ఇక్కడికి చేరుకుంటారులెండి!" అని వినీల నిష్కర్షగా చెప్పడంతో నేను ఆగిపోవలసి వచ్చింది.

మరికొద్దిక్షణాల్లో పార్థివదేహాన్ని పాడె పైకి ఎక్కిస్తామనగా ఇంటికి చేరుకున్నారు మా కవలపిల్లలైన రవళి, రాజీవ్‌లు! పుట్టినప్పటి నుండీ వాళ్ళ ఆలనాపాలనా చూసింది అమ్మే! నేనూ, వినీలా ఇద్దరం ఉద్యోగస్తులం కాబట్టి, పిల్లల పెంపకమంతా అమ్మ చేతుల మీదే జరిగింది. అందుకే పిల్లలిద్దరికీ వాళ్ళ నానమ్మ అంటే ప్రాణం.

వస్తూనే నానమ్మ శవంపై పడి భోరున ఏడ్చేసింది రవళి.

దాని కూడా వున్న రాజీవ్‌ని చూస్తూనే "హమ్మయ్య, వచ్చేసావా! ఇంటికి మగపిల్లాడివి, మీ నాన్నకి తోడుగా వుండు. ఒక్కడే అన్ని పనులూ చేసుకోలేక తంటాలు పడుతున్నాడు మీ నాన్న!" చప్పున అన్నాడు ప్రక్కింటి సురేష్.

అంతే, నానమ్మ వద్దకి వెళ్ళబోతున్న వాడల్లా, కళ్ళల్లో గిర్రున తిరుగుతున్న నీళ్ళని చొక్కాతో తుడిచేసి వెంటనే నా ప్రక్కకి వచ్చి నిలబడ్డాడు నా కొడుకు.

పొంగుకొస్తున్న దుఃఖానికి ఆనకట్ట వేసేందుకు వాడు చేస్తున్న విఫలయత్నాలు నా దృష్టిని దాటిపోలేదు. ఎందుకంటే నాదీ అదే అవస్థగా!

'ఎలాంటి వేళల్లోనైనా నిబ్బరంగా, భావోద్వేగాలకి అతీతంగా స్థితప్రజ్ఞుడిలా వుండేవాడే మగాడు' అన్న సిద్ధాంతాన్ని ప్రతిపాదించిన సమాజం, ఇటువంటి సందర్భాలకీ మినహాయింపునివ్వకపోవడం ఏమంత సబబు? హేతుబద్ధత లేని భావాలని పసితనం నుండే పిల్లల లేతమనస్సులో నాటడం వలననే అబ్బాయిల్లో సున్నితత్వమూ, అమ్మాయిల్లో ధైర్యసాహసాలూ మెల్లిమెల్లిగా కనుమరుగైపోతున్నాయి. పొంగుకొచ్చే బాధని లోలోనే అదిమేసి, పైకి హుందాగా ప్రవర్తించవలసి రావడంతో, మగవాళ్ళు తీవ్రమైన ఒత్తిడికి గురై మానసికవ్యాధుల బారిన పడుతుంటే, అతి సున్నితంగా, సుకుమారంగా పెంచబడుతున్న ఆడపిల్లలు విపత్కరపరిస్థితుల్లో తమని తాము రక్షించుకోలేకా, తమకేం కావాలో తెలుసుకోలేకా, తెలిసినా సాధించుకోవడం ఎలాగో తెలీకా ఆత్మహత్యలకి పాల్పడుతున్నారు.

సమాజం ప్రతిపాదించిన అర్థం లేని ఈ సిద్ధాంతాలకి అంతా మూకుమ్మడిగా బలి కావలసిందేనా!

అర్థంపర్థం లేని ఈ ఆంక్షలకి అనుగుణంగా ఒక మూసపోతలోనే మా అందరి జీవితాలూ సాగిపోకతప్పదా?

లేదు, లేదు... తరతరాలుగా మనిషిని మానసికంగా హింసిస్తున్న ఈ బూజు పట్టిన భావజాలానికి చరమగీతం పాడవలసిన రోజు వచ్చేసింది! ముందుముందు నా కొడుకు నాలా మరో విష్ణు కాకూడదంటే, ఈ విషయంలో నేను ముందడుగు వేయవలసిందే.

మనసులో అలా దృఢంగా నిశ్చయించుకున్న వెంటనే రాజీవ్‌ని దగ్గరకి పిలిచి "నాన్నా, మీ నానమ్మ ఇక తిరిగిరాలేని లోకాలకి వెళ్ళిపోయింది. ఎవరో ఏదో అనుకుంటారన్న సంశయాలేమీ లేకుండా, హాయిగా, కరువుతీరా , నీ మనసులోని బాధంతా బైటకి వెళ్ళిపోయేలా శోకించు బాబూ!" అంటూ నా భుజాలని వాడికి ఆసరాగా ఇచ్చాను.

కష్టాలని పంచుకునేందుకు కాకుంటే విశాలమైన ఈ భుజాలున్నవి దేనికట?

మరుక్షణం, ఇరువురిలో ఎవరం ముందుగా కదిలామో తెలియదు గానీ, ఒకరినొకరం ఆసరా చేసుకుని ఒకేసారి పెద్దగా భోరుమన్నాం! గట్టిగా బిగించిన బిరడాని ఒక్కసారిగా బైటకి లాగినప్పుడు నీటిప్రవాహం ఎంత ఉధృతంగా బైటకి వస్తుందో, అంతే వేగంగా మా ఇద్దరి గుండెల్లోని వేదనా కన్నీటి రూపంలో బైటకి ప్రవహించింది.

చుట్టూ వున్నవారంతా మమ్మల్ని విచిత్రంగా చూస్తున్నా పట్టించుకోకుండా ఇద్దరం తనివితీరా ఏడ్చాము.

కడుపులో బాధంతా కన్నీళ్ళ రూపంలో బైటకి వెళ్ళిపోయి, మా మనసులు తేలికపడ్డాకే మిగతా కార్యక్రమాలకి నడుం బిగించాము!



9849406722




# ఆట

సమ్మెట ఉమాదేవి

*రచయిత్రి సమ్మెట ఉమాదేవి విశ్రాంత ఉపాధ్యాయిని. అమ్మ కథలు, రేలపూలు, సమ్మెట ఉమాదేవి కథానికలు, జమ్మిపూలు, మా పిల్లల ముచ్చట్లు, చిలుక పలుకులు, నిక్ అంటే ప్రేరణ పుస్తకాలు వెలువరించారు. ప్రస్తుతం హైదరాబాద్ నివసిస్తున్న వీరు.. ఇప్పటిదాకా 150 కథలు రాశారు. పలు బహుమతులు, పురస్కారాలు అందుకున్నారు.*

***ఇపుడు మన జీవితంలోకి ఈ కొత్త పాత్రలు ఎందుకు? చిన్నప్పుడు నాకు వీల్‌చైర్ లేదు. గవర్నమెంట్ బడేమో దూరంగా వున్నది. అంత దూరం వెళ్ళలేనని, ఫీజులెక్కువైనా సరే దగ్గరలోని ఇంగ్లీషు మీడియంలో వేశారు సారంగపాణి సర్. నేను బాగా చదవడం చూసి, స్కూల్ ప్రిన్సిపాల్ ఫీజులు వద్దన్నారు. మా సార్ వాళ్ళకూ, మా బడివాళ్ళకు వున్న ప్రేమా, జాలీ కూడా లేని ఆ అమ్మానాన్నలనబడే వాళ్ళు ఇన్నేళ్ళకు వస్తే, అసలు ఎలా వెళ్తాము? ఎందుకు వెళ్తాము?”***

అసలు క్రీడాస్థలం అంటేనే ఎంతో కోలాహలంగా వుంటుంది. ఆటగాళ్ళ ప్రతిభా పాటవాలు ఒక వంక... ప్రేక్షకుల కేరింతలు ఒక వంక! దూరంనుంచి వింటున్నవారికి అదో జలపాతపు హోరు. కానీ ఇప్పుడు అక్కడ ఆడుతున్న ఆటగాళ్ళ ఆటలు చూస్తున్న వాళ్ళకు మాత్రం ఒళ్ళు గగుర్పొడుస్తున్నది. అప్రయత్నంగా కొందరి మనసూ, కళ్ళూ తడిబారుతున్నాయి. వాళ్ళంతా తమ అవయవలోపాలు మరిచి సర్వశక్తులు కూడగట్టుకుని ఆడుతున్నారు. సాధారణ క్రీడాకారులు వాళ్ళ ఆటలను విస్తుబోయి చూస్తున్నారు. హాజరైన సామాన్య ప్రేక్షకులు... ఒక గొప్ప కార్యక్రమానికి తామంతా సాక్షీభూతులైనందుకు ఒకింత ఉద్వేగ పడుతున్నారు. నిర్వాహకులు తామొక మంచి కార్యక్రమాన్ని ఏర్పాటు చేసినందుకు తృప్తిగా పరికిస్తున్నారు!

అన్నీ మరచి ఆనందంగా ఆడుతున్న వాళ్ళల్లో ఒకరిద్దరికి కుడికాళ్ళు, మరొకరికి ఎడమకాలు లేదు. కొందరికి చేతులు లేవు... కొందరు కాళ్ళు ఈడుస్తూ ఆడుతున్నారు. ఒకరిద్దరు కృత్రిమ కాళ్ళతో ఆడుతున్నారు.. మరో ఇద్దరు నేల మీదే కూర్చుండిపోయి, మరో అయిదారుగురు వీల్‌చైర్స్‌లో కూర్చుని తోటి వారిని తమ చప్పట్లతో ఉత్సాహపరుస్తున్నారు.

వారిలో రెండుకాళ్ళు లేని ఒక అమ్మాయి పల్టీలు కొడుతూ బంతి అందుకుంటూ విసిరి కొడుతున్నది. ఆ అమ్మాయి విన్యాసాలను చూసి అబ్బురపడ్తున్నారు. ప్రత్యక్ష ప్రసారం చేస్తున్న స్నేహ టీవీ వ్యాఖ్యాత ఆదిత్య అయితే ఆ అమ్మాయిని చూస్తూ మధ్యమధ్యలో మాటలే మరచిపోతున్నాడు.

“వీళ్ళలో అసలు ఎవరు విజేతలు? ఇక్కడ ఆడుతున్న ప్రతీ ఒక్కరూ విజేతలే. ప్రతీ ఒక్కరూ ప్రతిభావంతులే.. వీళ్ళంతా అన్నీ అవయవాలు సక్రమంగా వున్న మనలోని ఉదాసీనతను నిగ్గదీస్తున్నారు. మనలో పేరుకుపోతున్న నైరాశ్యాన్ని తరిమికొడ్తున్నారు... అందుకేనేమో వీరిని దివ్యాంగులు అన్నారు. అసంకల్పితంగా వీరంతా మనలో నూతన ఉత్తేజాన్ని నింపుతున్నారు... నిజమే! వీళ్ళంతా ఫిజికల్లీ ఛాలెంజ్డ్. భగవత్ సృష్టినే ఛాలెంజ్ చేస్తూ ధీటుగా నిలబడుతూ... మనందరి

హృదయాలను గెలుచుకున్న ఈ ఆటగాళ్ళంతా విజేతలే...” ఆదిత్య వ్యాఖ్యానం ఎంతో స్ఫూర్తివంతంగా సాగింది.

కాస్సేపటికి భోజన విరామం ప్రకటించారు. ఆ క్రీడాకారులంతా వాళ్ళకోసం ఏర్పాటు చేసిన టెంట్‌కు వెళ్ళి, ఎవరి సహాయం కోరకుండా భోజనం పెట్టించుకుని తింటున్నారు..

స్నేహ టీవీ టీమ్‌తో ముచ్చటిస్తూ “ఆదిత్యగారూ! పాతికేళ్ళ క్రితం ఈ స్వశక్తి సంస్థను నెలకొల్పాము. నూట ఇరవైమంది ప్రత్యేక అవసరాలు గలవారు ఇందులో వున్నారు” అని చెప్తూ... వాళ్ళలో ఒకొక్కరిని ఎప్పుడు ఏ స్థితిలో తమ సంస్థలో చేర్చుకున్నారో ఇప్పుడు పెద్దయి వాళ్ళు ఎలా నిలదొక్కుకున్నారో వాళ్ళందరిని మురిపెంగా చూసుకుంటూ... పితృవాత్సల్యంతో వివరించసాగారు... సారంగపాణి, పార్వతిల జంట.

సిరాజ్ దూరంగా ఎవరితోనో మాట్లాడుతూన్న అమితను చూస్తూ “ఆదిత్యా... నీకు గడ్డం మీసాలు తీసేస్తే ఎలా వుంటావో అలా వుంది ఆ అమిత” చిన్నగా అన్నాడు. తన మనసులోని మాట బయట పెట్టినట్లై ఉలిక్కిపడ్డాడు. రెండుకాళ్ళు లేని ఆ అమ్మాయిని చూస్తుంటే గుండె తరుక్కుపోతుంటుంది ఆదిత్యకి. కానీ అమిత మాత్రం వెల్లువెత్తే ఉత్సాహంతో, ఆత్మవిశ్వాసాలతో, చైత్యానికి ప్రతీకలా వుంటుంది.



క్రితం సంవత్సరం ఇదే రోజుల్లో ఇవే కార్యక్రమాలకు వ్యాఖ్యాతగా వ్యవహరిస్తూ అమితను చూసినప్పటినుంచి తనలో కలుగుతున్న కలవరం మనసులోనే కప్పెట్టేసాను అనుకున్నాడు. అది సాధ్యం కాలేదతనికి. అమిత మాట, నవ్వు, కదలికలు అన్నీ పసికడ్తూనే వున్నాడు. అవకాశం దొరికినప్పుడల్లా ఆమె ఉండే స్వశక్తి హోమ్ గురించి వివరాలు సేకరిస్తునే వున్నాడు. ఏదో తెలియని అలజడికి జవాబు ఏమిటన్నది ఈ సారంగపాణి దగ్గరే దొరుకుతుందేమో అని చూస్తున్నాడు.

ఏదో అడగాలని వున్నా ఏమీ అడగలేక... అడగకుండా వుండలేక నలిగిపోసాగాడు. అనేక ప్రాంతాలనుంచి వచ్చిన ప్రత్యేక అవసరాలు కలవారు గత రెండురోజులుగా అనేక విభాగాల్లో పోటీలలో పాల్గొంటున్నారు. వాళ్ళందరినీ మరోసారి కలవాలని, ముఖ్యంగా అమితను కలవాలని ఈ ప్రత్యక్ష ప్రసార వాఖ్యాన డ్యూటీ తనకే వచ్చేలా ఏర్పాటు చేసుకున్నాడు. కాస్సేపటికి మరో కార్యక్రమం మొదలయ్యింది.

క్యారమ్స్, చెస్ వంటి ఇండోర్‌గేమ్స్ జరుగుతున్నాయి. తన సిస్టమ్ ముందు కూర్చుని వ్యాఖ్యానం మొదలుపెట్టాడు ఆదిత్య! అమిత దాదాపు అన్నింట్లో పాల్గొనడమో, పాల్గొన్న మిగతావారిని ప్రోత్సాహపరచడమో చేస్తున్నది. కెమెరాలు జరుగుతున్న ఆటలను చిత్రీకరిస్తుండగా ఆదిత్య రెట్టించిన ఉత్సాహంతో వ్యాఖ్యానం చేస్తున్నాడు.

కాస్సేపటికి తన సీటు ప్రక్కన వీల్ చైర్ శబ్దం వినపడి వెనకకు తిరిగి చూసాడు. అమితను చూసి మైక్ మ్యూట్ చేశాడు.

“ఏమి మాట్లాడుతున్నారన్నా మీరు... ఇందాక ఆ ఔట్ డోర్ గేమ్స్ మేమంతా ఛాలెంజింగ్‌గా ఆడడం విశేషమే. కానీ ఇవ్వన్నీ కూర్చుని ఆడే ఆటలు. ఇక్కడ క్రీడాకారులు క్యారమ్స్, చెస్ ఎంత గొప్పగా ఆడుతున్నారో చెప్పాలే తప్ప... ప్రతీ వాక్యంలో మా అవకరాలను ఎందుకు గుర్తుచేస్తున్నారన్నా?” అని అడిగింది.

ఆదిత్య తెల్లబోయాడు.

“ఇవి మాలాంటి వాళ్ళు ఆడుతున్న ఆటలని బానర్‌పై ముందే రాసి వుంది కదా! విశ్వాకు కాలు లేకపోయినా, భారత్‌కి ఒక చెయ్యి లేకపోయినా... అంటూ ప్రతివాక్యంలో వాళ్ళ అవిటితనాన్ని ఎందుకు చేరుస్తున్నారు?” అమిత బాధగా అడిగింది.

ఆదిత్య కదిలిపోయాడు. “సారీ అమ్మా! వినేవారికి స్ఫూర్తిగా వుంటుందని అలా చెప్పాను. ఇంక అలా చెప్పనులే తల్లీ!” అమిత చేయి తన చేతుల్లోకి తీసుకుని బుజ్జగింపుగా చెప్పాడు... చంటిపాప చేయిలా మెత్తగా ఉన్నదా చేయి. ఒక స్పర్శకి ఇంత శక్తి ఉంటుందా! అతనిలో మళ్ళీ ఏదో అలజడి మొదలయ్యింది.

రాత్రి భోజనమయ్యాక అందరూ గార్డెన్‌లో కూర్చున్నారు.

నీరజ్ ఆదిత్య దగ్గరకు వచ్చి, “అన్నా అమిత అట్లా మాట్లాడిందని ఏమీ అనుకోకు.. నేను డిగ్రీ గోల్డ్ మెడలిస్ట్‌ని! సాక్షాత్తు వీసీగారి చేతుల మీదుగా గోల్డ్ మెడల్ అందుకోవడానికి వేదిక మీదకు వెళ్ళాను.. ‘ఒక కాలు లేనప్పటికీ నీరజ్ గోల్డ్ మెడల్ సాధించాడు...’ అంటూ వక్తలందరూ నా ప్రతిభ కంటే ముందు నా అవిటితనాన్ని గురించే ఎక్కువగా మాట్లాడారు. మీరన్నట్టే మిగతావారికి స్ఫూర్తిగా వుంటుందన్నది వారి ఉద్దేశ్యం కావచ్చు కానీ, కాళ్ళూచేతులు వున్నవారికి... అవి లేని మాలాంటి వారికి మేధస్సు మాత్రం ఒకేలా పనిచేస్తుంది కదా! ఆ కాస్సేపు మా అవకరాన్ని పక్కన పెట్టలేరా? ఇప్పుడు అమిత అన్నది కూడా అదే, మేము మరచి పోవాలనుకుంటున్నది మీరు పదేపదే గుర్తుచేయవద్దు అని! కానీ అలా జరుగదు. ఇది మాకు మమూలేలే అన్నా!” అన్నాడు.

ఆదిత్య టీమ్ అంతా ఆలోచనలో పడిపోయారు.

"నిన్న పాటల పోటీ జరిగిందన్నా! మా కావ్య పాట పాడుతుంటే... పాటకు ముందు, పాడిన తరువాత, ఆమె బహుమతి అందుకునే వేళా.. ప్రతీవాక్యంలో కావ్య అంధురాలయినప్పటికీ... ప్రపంచాన్ని చూడలేని ఈ కావ్య ఎంత అద్భుతంగా పాడుతున్నదో... ఒక వికలాంగురాలు ఇంత శ్రావ్యంగా పాడిందంటే ఆశ్చర్యంగా వున్నది కదూ...' ఇట్లానే సాగింది వారి వ్యాఖ్యానం.

అప్పుడు కూడా అమిత వాళ్ళ దగ్గరకు వెళ్ళి... 'అట్లా మాట్లాడకండన్నా! ఒక్క మూగవారు తప్ప మీరు మాట్లాడినట్టే మేము కూడా మాట్లాడగలం. పాడగలం. తాను బాగా పాడుతున్నది అని మాత్రమే చెప్పవచ్చు కదన్నా...' అని అభ్యర్థించి వచ్చింది" అనూష వివరించింది.

అమితతో పాటు అక్కడున్న వారందరి ఆత్మాభిమానం చాలా గొప్పగా అనిపించింది. 'మామూలుగా మేమేదో గొప్ప సానుభూతి ప్రకటిస్తున్నాము, ఏదో ఉద్ధరిస్తున్నాము అనుకుంటాము కానీ, వారికి మన సానుభూతి అక్కరలేదు, వాళ్ళను వాళ్ళుగా బ్రతకనిచ్చే సహకారం అందించగలిగితే మేలు' అనిపించి అందరూ మౌనం వహించారు.

"రేపు సాయంత్రం బహుమతి ప్రదానం. సర్టిఫికెట్స్ మీద పేర్లు రాద్దాం లోనికి రండి!" పిలిచారు నిర్వాహకులు.

ఆయా సంస్థల నిర్వాహకులు వివరాలు చెప్తుంటే ఆదిత్య, సిరాజ్ కూడా సర్టిఫికెట్స్ మీద పేర్లు రాయసాగారు. సారంగపాణి రిజిస్టర్లో చూస్తూ అందరి పేర్లు, డేటాఫ్ బర్త్‌లు వివరంగా చెప్పసాగాడు. అమిత డేటాఫ్ బర్త్ చెప్పగానే, ఆ తేదీ రాస్తూ ఉలిక్కిపడ్డాడు ఆదిత్య. రాయడం పూర్తయ్యాక, ఉద్వేగాన్ని అణుచుకుంటూ కాంప్ ఫైర్ ఉందంటే మళ్ళీ గార్డెన్లోకి వెళ్ళాడు.

"ఏంటన్నా, రాయడం పూర్తయ్యిందా?" అమిత అడిగింది.

"అయ్యిందమ్మా. అదిసరే అక్కడ రాసిన మీ డేటాఫ్ బర్త్‌లన్నీ కరక్టేనా?" అడిగాడు

"అయ్యో అన్నా! మీకలాంటి అనుమానమే వద్దు. మేము ఇలా అవకారాలతో పుట్టగానే మా తల్లిదండ్రులు కొన్నిగంటల్లోనే మమ్మల్ని వదిలించుకుంటారు. మేము ఆసుపత్రి నుంచీ, చెత్త కుండీల నుంచీ.. పోలీస్ స్టేషన్‌ల నుంచి ఇలాంటి సంస్థలకు కొన్నిగంటల్లోనే చేరిపోతాము. ఏ కారణాల వల్లనైనా ఆలస్యమైనా ఒకటో, రెండో రోజులు తేడా వస్తుందేమో గానీ, అంతకంటే ఎక్కువ ఏమీరాదు!" నిర్లిప్తంగా అన్నది.

అమిత ఏమి మాట్లాడినా ఆదిత్య ఉలిక్కిపడుతూనే వున్నాడు.

"మీ అందరికీ మీ అమ్మానాన్నల దగ్గరకు వెళ్ళిపోతే బాగుండును అని అనిపిస్తుంటుందా అనూషా?" అడిగాడు సిరాజ్.

"అనిపిస్తుందన్నా... అమ్మానాన్నలంటే ఎవరికిష్టం వుండదు చెప్పండి" అన్నది అనూష.

"అందరిలాగే మాకూ ఒక ఇల్లుండి, మాకు అమ్మానాన్నలుండి వాళ్ళు మమ్ములను ప్రేమగా చూసుకుంటూ, గారాబం చేస్తుంటే ఎంత బాగుంటుంది? అంతకంటే అదృష్టమా!" ధీరజ్ అన్నాడు.

"మా అమ్మావాళ్ళు వచ్చి మమ్ములను ఇంటికి తీసుకువెళ్తామంటే... అబ్బా! మేమయితే ఇప్పుడే వెళ్ళిపోతాము!" ఒకరిరిద్దరు అన్నారు.

అమిత మాత్రం ముఖం పక్కకి తిప్పుకున్నది.

"నాకు మాత్రం సారంగపాణి సార్, పార్వతమ్మలే మా అమ్మానాన్నలు!" దృఢంగా అన్నాడు సాగర్.

"భలే చెప్పావురా తమ్ముడూ! ఇప్పుడు మన జీవితంలోకి ఈ కొత్త పాత్రలు ఎందుకు? చిన్నప్పుడు నాకు వీల్‌చైర్ లేదు. గవర్నమెంట్ బడేమో దూరంగా వున్నది. అంత దూరం వెళ్ళలేనని, ఫీజులెక్కువైనా సరే దగ్గరలోని ఇంగ్లీషు మీడియంలో వేశారు సారంగపాణి సర్. నేను బాగా చదవడం చూసి, స్కూల్ ప్రిన్సిపాల్ ఫీజులు వద్దన్నారు. మా సార్ వాళ్ళకూ, మా బడివాళ్ళకు వున్న ప్రేమా, జాలీ కూడా లేని ఆ అమ్మానాన్నలనబడే వాళ్ళు ఇన్నేళ్ళకు వస్తే, అసలు ఎలా వెళ్తాము? ఎందుకు వెళ్తాము?" ఆవేశపడింది అమిత.

★★★

క్యాంప్ ఫైర్ మొదలయ్యింది చుట్టూ కూర్చున్న క్రీడాకారులంతా చప్పట్లు కొడ్తూ డాన్సులు చేస్తున్నారు అక్కడ రేగుతున్న పొగలో ఆదిత్యకు ఏవేవో దృశ్యాలు కనపడ్తున్నాయి.

'ఆదిత్యా! నీకు తమ్ముడో, చెల్లెలో పుట్టబోతున్నారు. వాళ్ళను నువ్వు చక్కగా ఆడించాలి సుమా!' అమ్మ మాటలు... 'అమ్మా నా పేరు ఆదిత్య కదా! తమ్ముడు పుడ్తే ఆకాశ్, చెల్లి పుడ్తే అనన్య అని పేర్లు పెడ్దాం' అని చెప్పేశాడు. అందమైన బొమ్మలాంటి తమ్ముణ్ణో, చెల్లినో ఎత్తుకుని వచ్చే అమ్మ కోసం ఎదురుచూస్తుంటే, పుట్టిన బిడ్డ పురిటిలోనే పోయిందని చెప్తూ...నానమ్మను పట్టుకుని గుండెలవిసేలా ఏడ్చిన అమ్మ ఏడుపు ఇప్పటికీ గుర్తుకొస్తుంటుంది.

'ఒరే సత్యం! మీ నాన్న గుర్తురా ఆ పచ్చరాయి ఉంగరం. ఎలా పోగొట్టుకున్నావురా?' ఉండుండి నానమ్మ అరుస్తూ వుండేది. అమ్మ ఇంట్లో లేని ఒకరోజు... "మళ్ళీ ఆ ఉంగరం మాటెత్తకు. ఆ ఉంగరం అమ్మే... ఆసుపత్రి వాళ్ళ చేతులు, పోలీసుల చేతులు తడిపి, రెండు కాళ్ళూ లేకుండా పుట్టిన దోసెడంత అవిటి బిడ్డను వదుల్చుకుని, పుట్టిన బిడ్డ చచ్చిపోయిందని రాయించాను!" గట్టిగా అరిచాడు. చెట్టు కింద ఆడుకుంటున్న ఆదిత్య చెవుల్లో ఆనాడు వినపడ్డ మాటలే ఇప్పుడు మళ్ళీ వినపడ్తున్నాయి. తనకో అవిటిబిడ్డ పుట్టిన విషయం అమ్మకసలు తెలుసా?

క్యాంప్ ఫైర్‌లో లీనమైన అమిత... ఉత్సాహంగా చప్పట్లు కొడ్తూ పాట పాడుతున్నది. అమ్మ ఓ చిన్ని శిశువును ఎత్తుకుని వస్తుందని తాను ఎదురుచూసిన తేదీ... ప్రతీ సంవత్సరం దేవుని ముందు దీపం పెట్టి అమ్మ మూగగా రోదించే తేదీ, అమిత పుట్టిన తేదీ ఒక్కటే. ఏ పాశమో ఇక్కడకు ఈడ్చుకుని వచ్చి తోడబుట్టిన చెల్లెలి ముందు నిలబెట్టింది. 'నా చెల్లిని ఇంటికి తీసుకెళ్ళగలనా?' అతని మనసులో అంతులేని అలజడి.

మర్నాడు బహుమతుల ప్రదానం తరువాత, అమిత చేయి పట్టుకుని, "అమితా! నిన్ను మీ అమ్మ నాన్నల దగ్గరకు చేర్చాలని ఉందమ్మా!" అన్నాడు.

"అయ్యో పిచ్చి అన్నా! నువ్వు మమ్మల్ని మా అమ్మానాన్నల దగ్గరకు చేర్చడానికి... మా అమ్మానాన్నలు మమ్మల్ని పొరపాటున పోగొట్టుకోలేదు. వాళ్ళే కావాలని మమ్మల్ని వదిలించుకున్నారు. మా హోమ్‌లో మేమంతా ఒకే గూటి పక్షులము. అక్కడ మమ్మల్నెవరూ మా అవకరంతో పిలవరు. మాకు కాలు, రెక్కలు లేకున్నా... స్వేచ్ఛా, ఆనందం వున్నాయి. మేమంతా ఒకరినొకరం పేర్లతోనో, వరుసలతోనో పిలుచుకునే ఆత్మబంధువులం. కొత్తగా మాకు ఏ రక్తసంబంధాలూ వద్దు. అది ముగిసిపోయిన ఆట!" ఆదిత్య చేయి విడచిపెట్టి, వీల్‌చైర్‌ను తోసుకుంటూ అమిత ముందుకు సాగిపోయింది.

# అడవి

సి. కుమార యశస్వి



9494077046

**సినీ రంగమార్తాండ కథలపోటీలో సాధారణ ప్రచురణకు ఎంపికైన కథ**

***వాళ్ళ చేస్తున్న ప్రయత్నం ముందు నా ప్రయత్నం ఏపాటికి సరిపోదు అనిపించింది. నిరాశ చెంది వెనక్కి వెళ్ళాలని ఆలోచన వచ్చినందుకు నాపైన నాకే కోపం వచ్చింది. ఒకవేళ వెళ్ళిపోయింటే నా పరిస్థితి ఎమైవుండేదో ఏమో అని భయం కూడా వేసింది.***

మలుపులు తిరిగున్న పూలదారి వదిలి మట్టి దారి వెంబడి నడిచాను. వెళ్ళే దారి సులభమైంది కాదని నాకు తెలుసు. కాని అనుకుంది సాధించాలనే గట్టి ఆశయం గుండెల నిండా నిండి ఉంది. అదే నన్ను నా గమ్యానికి చేర్చుతుందని నమ్మి నడిచాను!

అక్కడక్కడా నాలాగే కొండంత ఆశతో ముందుకు నడుస్తున్న వాళ్ళు కనిపించారు. అలాగే నాకు ఎదురుగా వెనుదిరిగి వస్తున్న వాళ్ళు కూడా కనిపించారు. వాళ్ళ ముఖాలను నిరాశ ఆవరించి ఉండటం గమనించాను. వాళ్ళని ఆపి వివరం కనుక్కునే ప్రయత్నం చెయ్యలేదు. ఎందుకంటే వాళ్ళ నిరాశకు కారణం ఏంటో నేను అర్థం చేసుకున్నాను కాబట్టి! ఆ క్షణంలో నేను దేవుడిని కోరుకుంది ఒక్కటే... అలాంటి స్థితిలో నేను ఉండకూడదు అని! కాస్త నడిచాక నాకు ఎదురుగా కనిపించిన దృశ్యం చూసి నివ్వెరపోయాను.

కొన్ని వందల మంది ఇనుముతో నిర్మించిన ఒక పెద్ద గోడను దాటేందుకు ప్రయత్నం చేస్తున్నారు. చిన్న..పెద్ద, కుర్ర.. ముసలి, ఆడ..మొగ అనే తేడాలు లేవు అక్కడ. అందరి ప్రయత్నం గోడ దాటాలనే! ఆ గోడ ఎత్తు ఎంతో, వెడల్పు ఎంతో లెక్కకట్టలేం.

లోపల తెలిసిన వారి సహాయంతో సులభంగా గోడ దాటి వెళ్ళిపోయిన వాళ్ళు కొందరైతే, తెలిసిన వారెవరూ లేకపోయినా ఓర్పుతో దాటి వెళ్తున్న వాళ్ళు ఇంకొందరు! ప్రయత్నం చేసినా దాటలేకపోతున్నవాళ్ళు కూడా ఉన్నారు. చేసేది లేక అలాంటి వారంతా వెనుదిరగడం చూశాను!

ఓర్పుతో ఆ గోడ దాటేందుకు నాకు కొన్ని నెలల సమయం పట్టింది. మొదట కొంత కాలం సొంతంగా ప్రయత్నం చేశాను. అలా ప్రయత్నం చేసేటప్పుడు, నాలాగే ఇంకొందరు పరిచయం అయ్యారు. అందరం కలిసి గోడ దాటే ప్రయత్నం మొదలు పెట్టాం. దాటిన వారిని, సులభంగా దాటుతున్న వారిని ఆసరా అడిగాం. కొందరు పట్టించుకోలేదు. కొందరు వాళ్ళకు సాధ్యమైన సహాయం చేసారు కాని, అది సరిపోలేదు. చివరికి మా సొంత ప్రయత్నంతోనే గోడ దాటాము.

గోడ అవతల ఉండేది ఒక పెద్ద అడవి. పెద్ద పెద్ద వృక్షాలు కలిగిన దట్టమైనది అడవి. ఆ అడవి విస్తీర్ణం ఎంతో చెప్పడం చాలా



కష్టం. ఒక రకంగా అసాధ్యం కూడా. ఈ అడవిలో ఇప్పుడు మేము ప్రయాణం చెయ్యాలి. అడవి లోపలి వెళ్లేందుకు మధ్యలో ఒక పెద్ద దారి వుంది. కాని అందులో నుండి అందరు వెళ్ళలేరు. గోడ సులభంగా దాటారని చెప్పా కదా... వాళ్ళు మాత్రమే ఆ దారిలో ప్రయాణం చెయ్యగలరు. మిగిలిన వారికి చెట్ల మధ్యన ఉన్న చిన్న చిన్న దార్లు అడవి లోపలికి తీసుకొనివెళ్తాయి!

లోపలికి కలిసొచ్చినా, అక్కడి నుండి ఎవరి ప్రయత్నం వారిదే. కాబట్టి నాతో పాటు వచ్చిన వాళ్ళు కంటికి కనిపించిన దారిలో వారి ప్రయాణం మొదలుపెట్టారు. నేను కూడా నాకు ఎదురుగా ఉన్న దారి గుండా నడక ప్రారంభించాను.

రాళ్ళతో, గుట్టలతో, ముళ్ళతో ఉన్న మార్గంలో రోజుల తరబడి నడిచాను కాని, దూరం కొలత తెలియలేదు. తిండి లేక పస్తులున్న రోజులున్నాయి. నిద్ర రాక జాగారం చేసిన రోజులూ ఉన్నాయి. అక్కడ కూడ వెనుదిరిగి వస్తున్న వాళ్ళు తారసపడ్డారు. వాళ్ళని చూసి నా పరిస్థితిని చూసుకున్నాక, నాలో ఎక్కడో ఒక మూల చిన్నపాటి అనుమానం మొదలైంది. ఆ అనుమానాన్ని నీళ్ళు పోసి పెంచకూడదని సంకల్పించుకున్నాను. 'ఏమో వాళ్ళకు సాధ్యం కానిది నాకు సాధ్యపడొచ్చేమో' అనే ఆశను పోగు చేసుకొని కొన్ని నెలలు ప్రయాణం చేశాను.

నాతోపాటుగా ప్రయాణం మొదలుపెట్టిన వాళ్ళలో ఇద్దరు అడివి దాటి వెళ్లిపోయారు అని తెలుసుకున్నాను. ఆ క్షణం పట్టరాని కోపం వచ్చింది. 'వాళ్ళతో సమానంగానే నేను కూడా కష్టపడ్డాను. కష్టపడుతున్నాను. మరి నేనెందుకు ఇంకా

ఇక్కడే ఉన్నాను. నా కష్టానికి ఫలితం ఎందుకు రావడం లేదు' అని రోజూ అనుకుని మధనపడ్డాను. తర్వాతి కొద్ది రోజులు నన్ను రకరకాల భావోద్వేగాలు చుట్టుముట్టాయి. కోపం, ద్వేషం, అసూయ, బాధ, అశాంతి, ఇలా అన్నీ ప్రతికూల భావోద్వేగాలే! వాటినన్నింటిని మూటకట్టుకొని నడకలో వేగం పెంచాను. విరామం, విశ్రాంతి అనేవే లేకుండా కొన్ని రోజుల పాటు ఉక్కు సంకల్పంతో నడిచాను. అయినా కూడా అడివి దాటలేకపోయాను.

ఏం చెయ్యాలో అర్థం కాని స్థితిలో ఉన్నప్పుడు. నన్ను, నా కష్టాన్ని గమనించి ఒక మనిషి నాకు సహాయం చేస్తానని చెప్పాడు. చెప్పినట్టుగానే అడవి దాటేందుకు నాకు సహాయం చేసాడు. తనతో పాటు క్షణాల్లో అడివి దాటాను.

అడవి దాటగానే మేము చేరింది ఒక కోటలోకి!

ఆ కోట చేరేందుకే అందరు అంతలా కష్టపడేది. కోటంతా వెండితో పూత పూసారు. లోపల కూడా అంతా వెండే. మొత్తము మిలమిలా మెరిసిపోతోంది. అదంతా చూసి నాకు చాలా ఆనందం వేసింది. కోటలో అబ్బురపోయే విషయాలు ఎన్నో చూసాను. తల తిప్పి చూసిన ప్రతిసారీ ఏదో ఒకటి కనిపిస్తూనే ఉంది. లోపల చాలా మంది జనాలు ఉన్నారు. వారిలో కొత్తగా లోపలి వచ్చిన వారు ఉన్నారు, ఎప్పటి నుండో లోపలే ఉన్నవారు ఉన్నారు. వాళ్ళల్లో ఎవరి చేతులో ఏ అద్భుతం ఉందో ఊహించలేము.

ఆ కోటకు రాజు, రాణి అంటూ ఉండరు. కేవలం స్థాయిలు మాత్రమే ఉన్నాయి. చిన్న స్థాయి, మధ్య స్థాయి, పెద్ద స్థాయి అంటూ మూడు రకాలున్నాయి. చిన్న స్థాయి నుండి పెద్ద స్థాయికి వెళ్ళిన వాళ్ళూ ఉన్నారు. పెద్ద స్థాయి నుండి చిన్న స్థాయికి దిగజారిన వాళ్ళు కూడా ఉన్నారు. ఏ ప్రయత్నం ఎప్పుడు ఎవరిని ఏ స్థాయికి తీసుకొని వెళ్తుందో అంచనా వెయ్యడం చాలా కష్టం.

కోటలోకి చేరాననే సంబరం నాకు మూడునాళ్ళ ముచ్చటగా మారింది. లోపలకు తీసుకెళ్ళిన మనిషి నన్ను మోసం చేసాడు. నా కష్టాన్ని తన కష్టంగా చూపించుకొని నన్ను వెనక్కి తోసేసాడు. అక్కడ నా మాట వినే వారెవరు నాకు కనపడలేదు. తిరిగి మళ్ళీ అడవిలోకి వచ్చి చేరాను.

ఆ పరిస్థితి నన్ను చాలా కుంగదీసింది. అప్పటి వరకు నేనెప్పుడు కుంగిపోనంతలా కుంగిపోయాను. నా జీవితం ఆ రోజు ఆగిపోయిందేమో అనిపించింది. తరవాత నుండీ గడిచిన ప్రతిరోజు నన్ను మొదట నిరాశే పలకరించేది.

వెనుదిరుగుతున్న చాలా మందిని ఆపి వివరం తెలుసుకున్నాను. వారందరు నాలాంటి సామాన్యులే! కోటే లక్ష్యంగా వచ్చిన వారు. వాళ్ళల్లో చాలా మంది నాకంటే ఎక్కువ కష్టం పడ్డారు. నాకంటే ఎక్కువ రోజులు ప్రయత్నం చేసారు. ఎన్నో కష్టాలు, బాధలు అనుభవించారు. చాలా త్యాగాలు చేశారు. అయినా కూడా వాళ్ళ ఆశయం ఫలించలేదు. అందుకే మోడుబారిన ఆశని భుజాన వేసుకొని, ఆ బరువును మోయలేక మోస్తూ తిరుగు ప్రయాణం చేస్తున్నారు. నేను కూడా వారిలో ఒకడినే ఏమో అనే అనుమానం పునర్జన్మ ఎత్తి, రోజు రోజుకి బలపడుతూ వచ్చింది. నమ్మకం పూర్తిగా పోయిన రోజున అనుమానం నాపై గెలిచింది.

వెనక్కి అయితే నడక మొదలుపెట్టాను కానీ, వేసిన ప్రతి అడుగు మనసులో భారాన్ని పెంచడం మొదలుపెట్టింది. కొంత దూరం నడిచిన తర్వాత నా వల్ల కాలేదు. నింగి మొత్తం నా భుజానే ఉందేమో అనేంత బరువు. మోయలేకపోయాను. ముందుకు వెళ్ళాలా లేక వెనక్కి వెళ్ళాలా? అనే సందిగ్ధావస్థలో చిక్కుకున్నాను. ముందుకే అనుకుంటే ఇంకా ఎంత కాలమో

తెలియదు. పోనీ వెనక్కి వెళ్లిపోదాం అనే ధృఢ సంకల్పం లేదు. వెళ్ళినా పూలదారి అయితే ఉండదు.

ఆ మీమాంసలో నేనుండగా నాకు నాణానికి రెండో వైపు వుండేవారు ఎదురుపడ్డారు. కష్టాలు, బాధలు, నిరాశలు, నిస్పృహలు, ఇవేవీ వాళ్ళని అపలేకపోతున్నాయి. ఫలితం సానుకూలంగా లేకపోయినా సరే పట్టు వదలక ప్రయత్నిస్తున్న వారు వీరు! దేనికీ చలించలేదు. ఎందుకంటే వాళ్ళకి గుండెల నిండా అనుకుంది సాధించాలనే కసి, పట్టుదల కోకొల్లలుగా ఉన్నట్టు అర్థమైంది నాకు.

వాళ్ళు చేస్తున్న ప్రయత్నం ముందు నా ప్రయత్నం ఏపాటికి సరిపోదు అనిపించింది. నిరాశ చెంది వెనక్కి వెళ్ళాలని ఆలోచన వచ్చినందుకు నాపైన నాకే కోపం వచ్చింది. ఒకవేళ వెళ్ళిపోయింటే నా పరిస్థితి ఏమైవుండేదో ఏమో అని భయం కూడా వేసింది.

అప్పుడు నేను నేర్చుకున్న జీవిత సత్యం నన్ను చాలా ప్రభావితం చేసింది. అదేంటంటే "జీవితంలో ఏదైనా సాధించాలంటే, చేసే ప్రయత్నంలో లోటు ఉండకూడదు. లోటు ఉంటే కనక నువ్వు సాధించాలనుకుంది నీకు ముఖ్యమైంది కాదు" అని.

తర్వాత రోజు నుండి ఆశ్చర్యం కలిగించే రీతిలో నాకు అన్ని కలిసొచ్చాయని చెప్పను. కలిసిరాలేదు కూడ. అనుకున్నది జరగని రోజు నిరాశ చెందాను కాని కుంగిపోలేదు. ప్రయత్నం ఆపలేదు. ఆపబోను కూడా. ఎందుకంటే నా ప్రతి ప్రయత్నము వృథా కాదు అనే నమ్మకం నాకుంది. ఈరోజో రేపో నా లక్ష్యం కచ్చితంగా నెరవేరుతుంది.

నా లక్ష్యం సినిమా అనే ఆ కోటలోకి వెళ్ళడం మాత్రమే కాదు. అక్కడ నా ప్రతిభని నిరూపించుకొని నాకంటూ ఒక స్థానాన్ని ఏర్పరుచుకోవడం. ఆ లక్ష్యం నెరవేర్చుకునేందుకు సినీరంగం అనే అడవిలో అవకాశం కోసం పట్టుదలతో ప్రయత్నిస్తున్న సామాన్యులలో నేను కూడా ఒకడిని!!

# మౌలిక స్వరం!

బులుసు సరోజినీదేవి

9866190548



**సినీరంగ మార్తాండ కథలపోటీలో సాధారణ ప్రచురణకు ఎంపికైన కథ**

***"ఇదే మొదటిసారా? భయపడ్డావా? నేను రాక్షసుడిని కాదు. సంగీత కళాకారుడిని. మృదువుగా ఉండడం, స్వరాల్ని సున్నితంగా మీటి రాగాల్ని పలికించడం మన నైజం కదా!" అన్నాడు. అవునన్నట్టు తలూపింది. ఏదో మాట్లాడబోతున్నట్టు అనిపించి, "చెప్పు!" అన్నాడు.***

సినీరంగానికి చెందిన సంగీత ప్రముఖులు కొత్త గొంతుల సెలక్షన్ కమిటీగా నిర్ణయించబడి స్టేజ్ మీద ఆసీనులై ఉన్నారు. కింద సంగీతాభిమానులు బారులు తీరి కొత్త గొంతుల్ని వినేందుకు ఈగర్‌గా ఎదురు చూస్తున్నారు!

మొట్టమొదట ఒకమ్మాయి మైక్‌తో భయం భయం గా వచ్చి నిల్చుంది.

"పేరు?" అడిగాడు సారసాక్ష.

"స్వరగాత్రి!"అంది ఆ అమ్మాయి.

"ఆహా! మొదలు పెట్టు!" అన్నాడు.

'మేఘాల దారిలో రాగమాలికలల్లి!'అనే లలితగీతం పాడబోయింది.

"ఆపు ఆపు" అని గోల పెట్టేసాడు. అతడే తెలుగు సినీప్రపంచపు ఏలిక, సంగీతంలో దిట్ట! ఎన్నెన్నో హృదయాలను రంజింపజేసే ట్యూన్స్ కట్టి, పద్మశ్రీ పురస్కారంతో వెలుగొందుతున్న సారసాక్ష! తెలుగు సినీజగత్తుకి మకుటంలాంటి వాడు. చిన్న వయసులోనే పేరు, ప్రఖ్యాతులు స్వంతం చేసుకున్న మ్యూజిక్ డైరెక్టర్.

"ఇది సినిమాకి సంబంధించిన సంగతి. సినిమా పాట పాడు!" హుకుం జారీ చేసాడు.

మరొకతను కూడా హడావుడిగా ఆపేసాడు. అతడు హృదయేంద్ర. బాగా పేరున్న సినీ నిర్మాత. ఇప్పుడు సెలెక్ట్ చేస్తున్నది అతడి సినిమాకే. 'ప్రాణమా! నువ్వెక్కడ?'అనే టైటిల్‌తో సినిమా రిలీజ్‌కి ముందే మారుమోగిపోతూ ఆకర్షిస్తోంది.

హృదయేంద్ర రెండు కళ్ళూ మూసుకుని, తెరిచి సూటిగా స్వరగాత్రిని చూసి, "పాత పాటలు వచ్చా?" అడిగాడు. వచ్చని తలూపింది స్వర.

"చుక్కలతో చెప్పాలని... పాట అందుకో!" అన్నాడు.

'ఇక్కడ ఏకాంతంలో ఏమో ఏమేమో...'అన్న దగ్గర శృతి తప్పిందని పదే పదే పాడిస్తూ పక్కకి తిరిగి తన పక్కన ఉన్న లేడీ

జడ్జ్‌తో, “ఈ అమ్మాయికి బాగా ట్రైనింగ్ ఇవ్వాలి!” అన్నాడు.

ఆవిడ ఏమి మాట్లాడకుండా అటూ ఇటూ కాని రూట్‌లో తల ఊపింది.

ఈ లోపల సారసాక్ష... ‘ఎందుకే నీకింత తొందరా...’పాడించాడు. భానుమతిగారిని అనుకరించకుండా చక్కగా పాడింది స్వర.

“పెద్దల్ని ఇమిటేట్ చేయాలి. నువ్ పాడిన పాటలో ఒక స్వరం దెబ్బతింది!” అన్నాడు.

స్వర భానుమతిలా పాడి వినిపించాక కానీ హృదయేంద్ర మొహం విప్పారలేదు.

“సంగీతంలో నిర్విరామంగా పలికే మౌలిక స్వరం ఏది?” అడిగాడు సారసాక్ష.



“స” ఈ స్వరం ద్వారానే అన్ని మనోరంజక రాగాలూ ఆలపిస్తారు!” అంది స్వర.

“సంగీతంలో ఎన్నటికీ తరగని సంపద ఏది?”

“ధన అంటే సంపద. సాధన అంటే ఎన్నటికీ తరగని సంపద! ఐశ్వర్యం మన వెంట రాదు. కానీ సాధన ద్వారా సంపాదించిన స్వరసంపద తరతరాలుగా ఎన్నటికీ ఉంటుంది. అందుకే నేను గాయనిని కావాలని ఒక దీక్షతో సంగీతాన్ని ఆశ్రయించాను!” అంది.

చప్పట్లు మారు మోగాయి.

చివరిగా మరోపాట పాడమన్నారు.

“స్నేహితుడా... స్నేహితుడా... రహస్యస్నేహితుడా... అంటూ... “ఆ లిరిక్ ఏంటండి హృదయ్? చిన్న చిన్న నా కోరికలే అల్లుకున్న స్నేహితుడా... అని కదూ!” అన్నాడు. అతడు ఉల్లాసంగా తల ఊపాడు.

ఆ తరువాత వరసగా అందరితో పాడించి సెలక్టయిన వారి పేర్లు అనౌన్స్ చేస్తూ... వారి తల్లిదండ్రుల్ని కూడా స్టేజ్ మీదకి రమ్మని అభినందించాడు. స్వరగాత్రిని డైరెక్ట్‌గా ఐదవ విభాగంలో పోటీలో పాల్గొనవచ్చని ప్రకటించగానే స్వర తల్లి కన్నీరు పెట్టుకుంది.

ఆమెని తమ టీవీ రేటింగ్ కోసం ఇంకా ఇంకా ఏడిపించి, ఆమె కుటుంబం గురించి పూర్తి వివరాల కోసం ప్రశ్నల వర్షం కురిపించారు.

ఆమె తల్లి తన పేరు వాగ్దేవి అనీ, తన భర్త చనిపోయాక ఆర్థికంగా పడరాని పాట్లు పడ్డామనీ, ఇప్పుడు ఈ పోటీకి రావడానికి కూడా తమ వద్ద డబ్బు లేదనీ... అమ్మాయికి ఉచిత సంగీత కళాశాలలో లభించిన సీటుతో ఈ స్థితికి రావడం జరిగిందని హృదయవిదారకంగా చెప్పింది. అందరూ కన్నీళ్ళు తుడుచుకున్నారు.

★★★

పది రోజుల తరువాత –

ఆ రోజు స్వరగాత్రి ఛాన్స్...

“ఉగ్రూతలూగే కుర్రకారు పాటల సందడిని చేసి పండుగ వాతావరణాన్ని తెద్దాం!” అన్నాడు హృదయేంద్ర.

“కుర్రాడు బాబోయ్... పిల్లాడు బాబోయ్ అనే పాట స్వరకి, ధీరజ్ అనే అబ్బాయికి డ్యూయెట్‌గా ఇచ్చారు. పాట మొదలవగానే ఈలలు మొదలయిపోయాయి. సారసాక్ష, హృదయేంద్ర కూడా వెర్రి గంతులు వేస్తూ ఈలలు విసిరారు. ధీరజ్ మాత్రం కేవలం పాట మీదే ధ్యాస ఉంచడంతో గట్టిగా ఊపిరి పీల్చింది స్వర.

రెండో రౌండ్‌లో ‘బావలు సయ్యా... మరదలు సయ్యా’ పాడించారు. ఒకటే దుఃఖం వస్తోంది స్వరకి. ఎనిమిదో ఎపిసోడ్‌లో ఏడుపు పాటలు ఇస్తే... ‘బతుకు జీవుడా!’అనుకుంది. తొమ్మిదో ఎపిసోడ్ వచ్చేసరికి స్వర తల్లికి జ్వరం వచ్చి స్వర బెరుకు బెరుకుగా ఆడిటోరియంలోకి అడుగుపెట్టింది.

ప్రారంభం అయే ముందు మేకప్ రూమ్‌కి రమ్మని ఒక పిలుపు వచ్చింది స్వరకి.

బెదురుతూనే వెళ్ళింది. అక్కడ సారసాక్ష కూర్చుని ఉన్నాడు. ఇంకెవరూ లేరు.

“రారా... లోపలికి రా! చాలా బాగా పాడుతున్నావోయ్. ఒక్క చిన్న ఫేవర్ చేస్తే నిన్ను నెంబర్ వన్‌లో నిలబెడతా!” అన్నాడు.

డబ్బు అడుగుతాడేమో అని గుండె గుభేల్మంది.

“అమ్మగారు రాలేదట కదా? జ్వరం అని విన్నాను. మరేం ఫరవాలేదు. తగ్గిపోతుంది. లాస్ట్ ఎపిసోడ్‌కి అయిదు రోజుల టైం ఉంది. మనం సీరియస్‌గా ఈ పిక్చర్‌లో పాటల గురించి డిస్కస్ చేయాలి. ఒక అడ్రెస్ ఇస్తాను. మీ అమ్మని కూడా తీసుకురాకు! అక్కడికి వచ్చెయ్. మాట్లాడుకుందాం. నువ్వెలా పైకి వస్తావో నీకు టిప్స్ చెప్తాను. ఒక్కసారి అక్కడికి వస్తే సరిపోతుంది. నీకు పేరు వచ్చేసాక నీ పాట కోసం క్యూ కడతారు. నీ జోలికి ఎవ్వరూ రారు. నువ్వు ఎలాగూ సెలెక్ట్ అయిపోతావ్. సరేనా!” అని ఒక అడ్రెస్ రాసి ఇచ్చాడు. అది తీసుకుని వచ్చేసింది.

హృదయ విదారకమైన పాటలతో ఆ ఎపిసోడ్లో ఫస్ట్ వచ్చింది స్వర.

★★★

‘ఒకసారి వస్తే సరిపోతుంది!’ఆమాటలే పదే పదే వెంటాడుతున్నాయి స్వరని! అలాగే ఆలోచిస్తూ ఉంటే... అవును. నెక్స్ట్ టైం మరో కొత్త అమ్మాయి. సారసాక్ష ఏమి ఎరగనట్టు యాక్ట్ చేస్తూ, అతి గొప్ప వ్యక్తిగా చలామణి అయిపోవొచ్చు.

మనసు ఒప్పుకోలేదు. ఒకసారి అడుసు తొక్కితే అధోగతే!

వెంటనే అన్నీ పాక్ చేసుకుని తమ ఊరు వెళ్ళిపోదామని అనుకుంది. ఇన్ని రోజులు తన కోసమే శ్రమకోర్చి, ఇక్కడిదాకా తీసుకువచ్చిన తల్లి పక్క బెడ్ మీద మూలుగుతూ ఉంటే, మనసు ఆర్ద్రమైపోయింది. ఈ సినిమా ఆర్గనైజేషన్ వాళ్ళు ఇచ్చిన ఫైవ్‌స్టార్ హోటల్‌లో ఉన్నందుకు, మొదటిసారిగా అమ్మకి సుఖం అంటే ఏమిటో తన ద్వారానే తెలిసింది. వాళ్ళే డాక్టర్‌కి చూపిస్తున్నారు. డబ్బు కోసం తాను ఎక్కడికి పరుగెత్తలేదు.

ఇటువంటి రూమ్‌లో ఉండడం కూడా అదృష్టమే! కానీ ఈ అదృష్టం ఇంత వరకు చాలు. ఇంకా అనుభవించాలంటే తనని అర్పించుకోవాలి.

“ఒక్కసారి వస్తే సరిపోతుంది!” మళ్ళీ మళ్ళీ వినిపిస్తోంది.

ఒక్కసారిగా కన్నీళ్ళు ఆగకుండా వర్షించాయి. ఈ లోగా ఎవరో బెల్ కొట్టారు.

వచ్చింది డాక్టర్!

“మీకు ఇప్పుడు జ్వరం లేదు. ఈ మందులు మాత్రం మరిచిపోకుండా వేసుకోండి. మూడు రోజుల్లో హాయిగా తిరగవచ్చు!” అన్నాడు ఇంజక్షన్ చేస్తూ! రెండు నిముషాల్లో కొన్ని పళ్ళు, పాలు తీసుకొచ్చి పెట్టారు. రూమ్ మళ్ళీ శుభ్రంగా క్లీన్ చేశారు. వేడి వేడి కాఫీ తెచ్చి స్వరకి ఇచ్చారు.

“ఒక్కసారి వస్తే సరిపోతుంది!” మళ్ళీ చెవుల్లో వినబడింది. వాష్‌రూమ్ తలుపు వేసుకుని బావురుమంది స్వర.

★★★

స్వర... సారసాక్ష చెప్పిన చోటుకి టాక్సీ మాట్లాడుకుంది. ఆగలేక ఫోన్ చేసిన సారసాక్ష "శభాష్!" అన్నాడు. అదొక రిసార్ట్. చుట్టూ తోట. మధ్యలో ఒక అపూర్వ భవనం. నెమ్మదిగా లోపల అడుగుపెట్టింది.

సారసాక్ష రెండు చేతులూ చాచి ఆహ్వానించాడు.

అటు చూడకుండా అక్కడున్న సోఫాలో ఒదిగి కూర్చుంది.

"చెప్పు! బిడియమా? మరేం పర్లేదు. ఇక్కడ మనం తప్ప ఎవ్వరూ లేరు. ఒకసారి దగ్గరగా వచ్చాక నువ్వు ఇంకెక్కడ కనపడ్డా నిన్ను గాయనిగా గుర్తిస్తానే తప్ప, ఎటువంటి జ్ఞాపకాలు రానివ్వను. మళ్ళీ ఎప్పుడూ పిలవను. మనం ఎక్కడెక్కడో భోజనం చేస్తుంటాం. అన్ని రకాల ఫుడ్‌ని టేస్ట్ చేస్తాం. తిన్నాక ఎక్కడ ఏది తిన్నామో గుర్తు ఉంటుందా? ఇదీ అంతే! కాకపోతే కొత్త పదార్థాన్ని చూస్తే జిహ్వ ఊరుకోదు లవ్లీ!" అన్నాడు.

గుండె పట్టేసినట్టయి దుఃఖం తన్నుకు వస్తోంది. దగ్గరగా వచ్చి చెయ్యి పట్టుకుని బెడ్‌రూమ్ లోకి తీసుకెళ్ళాడు. సున్నితంగా వ్యవరిస్తున్నాడు. కూల్‌గా మాట్లాడుతున్నాడు. ఇంకా ఇంకా దగ్గరకు రాగానే గట్టిగా ఏడుస్తూ... తోటకూర కాడలా వేళ్ళాడిపోయింది.

ఒక్కసారిగా భయపడిపోయాడు సారసాక్ష.

గంటసేపు నీళ్ళు జల్లుతూ, సపర్యలు చేస్తూ ఉండిపోయాడు. కాస్త కళ్ళు తెరిచాక అడిగాడు.

"ఇదే మొదటిసారా? భయపడ్డావా? నేను రాక్షసుడిని కాదు. సంగీత కళాకారుడిని. మృదువుగా ఉండడం, స్వరాల్ని సున్నితంగా మీటి రాగాల్ని పలికించడం మన నైజం కదా!" అన్నాడు.

అవునన్నట్టు తలూపింది.

ఏదో మాట్లాడబోతున్నట్టు అనిపించి... "చెప్పు!" అన్నాడు.

"వింటారా సర్?" దీనంగా అడిగింది.

తలూపాడు.

"సర్... హింసా, అహింసా అనేవి చర్య మీద ఆధారపడి ఉండవు. దాని వెనుక ఉన్న ఉద్దేశం మీద ఆధారపడి ఉంటాయి. హింసకు మూలం కోపం, కామం, ఈర్ష్య, దురాశ, విసుగు లేదా దూకుడు స్వభావం! ఒక డాక్టర్ రోగి పొట్ట కోస్తాడు. అదే పనిని ఒక దుర్మార్గుడు కూడా చేస్తాడు. చర్య ఒకటే. కానీ వైద్యుని ఉద్దేశం రోగిని రక్షించడం. కానీ దుర్మార్గుడి ఉద్దేశం సర్వనాశనం చేయడం! హింస లేక అహింస అనేవి ప్రవృత్తి మీద ఆధారపడతాయి... కానీ చర్యను బట్టి కాదు! సార్ మీరు అనవచ్చు... యుద్ధం అహింసాత్మకంగా ఉండొచ్చు కదా అని! దాన్లో కోపానికి, కక్షకు, ఈర్ష్యకు, దురాశకు తావు లేకుండా ఇతరులకు పాఠం నేర్పేదిగా ఉండాలి. యుద్ధం ద్వారా తప్ప, వేరే విధంగా అవగాహనకు రాదు కనుక యుద్ధం అవసరం అవుతుంది. ఎదుటి వారి దగ్గర అన్నీ దోచి, బానిసలుగా మార్చడానికి చేస్తుంటే 'దానం'అయినా హింస క్రింద జమ కట్టాల్సిందే! యుద్ధం కూడా దయతో నిండి మంచి మార్గానికి నిర్దేశించేదే అయితే మంచి పద్ధతే. ఆశ్చర్యకరమే... కానీ నిజం సార్! నేను ఎంతో ఆలోచించాను. నేను నమ్మిన దానికి వ్యతిరేకంగా ప్రవర్తించి మీకు ఒక్కసారి అయినా లొంగిపోతే

నేను జీవితాంతం కుంగిపోతాను. ఒకవేళ నేను మౌనంగా ఉండి సర్దుకుపోగలిగితే, మీరన్నట్టు మంచి గాయనిగా అందరిలో ప్రకాశిస్తాను. కానీ సర్... మనసనేది ఒకటుంటుంది. అది నన్ను పరిహసిస్తూనే ఉంటుంది. నాకు ఎప్పుడో ఒకప్పుడు వివాహం అవుతుంది. అప్పుడు నా భర్త నన్ను దగ్గరకు తీసుకున్నప్పుడల్లా, అపరాధ భావంతో ఏ ఆనందాన్ని పొందలేను. అలాగే నాకు నేను ఒంటరిగా దొరికిపోయిన ప్రతి సెకండ్, తప్పు చేశాననే బాధ నన్ను మనిషిగా బతకనివ్వదు! ఒక ఆడదానికి ఇంత కంటే శాపం మరొకటి ఉండదు. మీరు నన్ను గాయనిగా ఎన్నుకోక పోయినా పరవాలేదు. నేను నా పవిత్రతని, నా శీలాన్ని కాపాడుకున్నందుకు ప్రతి క్షణం జీవిస్తాను!" అంది స్వర.

సారసాక్ష ఒక మహా సాధ్విని చూస్తున్నాడు.

అతడికి ఒక స్వరజతి అపురూపంగా వినిపిస్తోంది.

'సారసాక్షా! నేరమేమి... మారు బాధకోర్వలేరా...'అని వినిపిస్తోంది.

'జీవితం భగవంతుడిచ్చిన కానుక. దాన్ని మాయామర్మం లేకుండా జీవించాలి!' అనుకున్నాడు.

స్వర సెలవు తీసుకుంటూ చేతులు జోడించింది!

ఒక మౌలిక స్వరం పదే పదే వినపడుతోంది.

అదే మూలం!!

# మొదటి అడుగు

డా.మజ్జి భారతి

☎ 9440615206



*నేటి పరిస్థితులను చూసి అందరూ 'అప్పుడలా ఉండేది. ఇప్పుడలా కాదు' అనేవారే కాని, అప్పుడులా ఇప్పుడుందామని ఎవరూ ఎందుకనుకోవడం లేదు? వాతావరణ సమతుల్యం చెడిపోతుందని గగ్గోలు పెట్టేవారే కాని, ఒక మొక్క నాటిన పాపాన పోవడంలేదెవ్వరూ? ఎవరికి వారే మనకెందుకనుకుంటే, ముందడుగు వేసేది ఎవరు? ముందడుగు వేసేవాళ్ళను ప్రోత్సహించకపోతే పరిస్థితులు ఎప్పటికి మారేను?*

"ధ్రువా, మంచి ఆఫర్ వచ్చిందిరా! వైజాగ్ దగ్గరలో స్థలం చూశాను. మనకి వచ్చిన బీమా సొమ్ముతో స్థలం కొనుక్కొని, హౌసింగ్ లోన్ తీసుకొని నెమ్మదిగా ఇల్లు కట్టించుకుందాం!" ఆఫీసుకు వచ్చిన ధ్రువతో వరుణ్ చెప్పాడు ఉత్సాహంగా.

అతని ముఖంలో స్నేహితులిద్దరూ ఇల్లు కట్టించుకున్నంత ఆనందం కనిపిస్తోంది. వరుణ్, ధ్రువలు మంచి స్నేహితులు. ఒకే ఊరు. చిన్నప్పటినుండి కలిసి చదువుకున్నారు. వరుణ్ ప్రోద్బలంతోనే ఉద్యోగంలో చేరిన కొత్తలో, కట్టిన జీవితబీమా సొమ్ము ఇప్పుడు చేతికందబోతోంది. గత ఆరునెలల నుండి ఇంటిస్థలాలు చూసే పనిలోనే ఉన్నాడు వరుణ్.

"చూద్దాంలేరా!" ఆలోచనగా అన్నాడు ధ్రువ.

అప్పటికిగాని ధ్రువ తన సంతోషాన్ని పంచుకోవడం లేదనే విషయం గమనించలేదు వరుణ్.

"ఏమైందిరా?" లాలనగా అడిగాడు.

"నీ ఆలోచన మంచిదే. కాని నా ఆలోచన వేరేగా ఉందిరా!" సమాధానం చెప్పాడు ధ్రువ.

"మనిద్దరికీ పనికి వస్తుందనే కదా, నేనప్పుడు జీవితబీమా చేయించాను. నీ ఆలోచనేమిటో చెప్పు. ఇద్దరం అదే చేద్దాం!" అభయమిస్తూ అన్నాడు వరుణ్.

ధ్రువ సమాధానం విని నమ్మలేనట్లు చూసాడు.

"నీకిలాంటి ఆలోచనేమిటిరా? చిన్నప్పటినుండి మనవాళ్లు ఎన్ని కష్టాలుపడ్డారో చూస్తూనే ఉన్నాము కదా! మరల అదే రొంపిలో దిగుతానంటావేమిటి?" నిలదీశాడు వరుణ్.

"నిజమే. అది కష్టమే. నేనొప్పుకుంటాను. కాని అంతమాట అనొద్దురా!" దిగులుగా అన్నాడు ధ్రువ.

"లేకపోతే ఏమిటిరా! అందరూ వద్దనుకుంటుంటే, నువ్వేమిటి... మరల వెనక్కి వెళతానంటావు."

"అందరూ అలా అనుకుంటే ఎలారా?" బాధగా అన్నాడు ధ్రువ.

"నిజమే నేను కాదనను. నాకూ ఆ బాధ ఉంది. కాని మనలాంటి మధ్యతరగతి వాళ్ళం ఏమీ చెయ్యలేం. తనకు మాలిన



ధర్మం లేదు. అందుకని వేరే ఏమీ ఆలోచించకు. సాయంత్రం మనం స్థలం చూడడానికి వెళ్తున్నాం. అంతే!" కాస్త గట్టిగానే చెప్పాడు వరుణ్.

"క్షమించరా, నా నిర్ణయం మార్చుకోలేను!" వేడుకోలుగా అన్నాడు ధ్రువ.

అప్పటికి గాని, ధ్రువ ఈ విషయాన్ని ఇంత సీరియస్‌గా తీసుకుంటున్నాడని అర్థం కాలేదు వరుణ్‌కు. "ఆశయాలు చెప్పడానికి బాగానే ఉంటాయి. కానీ ఆచరణలోనే ఇబ్బందులు! పిల్లలు మరో నాలుగైదేళ్లలో కాలేజీ చదువులకు వస్తారు. అప్పటికైనా మనకంటూ సొంతగూడు ఉండకపోతే ఎలా? అదీకాక, విశాఖపట్నంలో కాకపోయినా ఆ దగ్గరలో ఉన్నా, పిల్లల కాలేజీ చదువులకి సౌకర్యంగా ఉంటుంది. ఇవన్నీ ఆలోచించకుండా, ఆశయాలు పట్టుకొని కూర్చుంటే అవుతుందా?" గట్టిగా నిలదీశాడు వరుణ్.

"నిజమేరా! కాని అందరూ అలా అనుకుంటే ఎలా? ఎవరో ఒకరు ముందడుగు వేయాలి కదా! అది నాతోనే ప్రారంభం అనుకో!" నెమ్మదిగానే అయినా తన నిర్ణయాన్ని స్పష్టంగా చెప్పాడు ధ్రువ.

"చెల్లెమ్మకు చెప్పావా ఈ విషయం?" ఆఖరి అస్త్రం సంధించాడు వరుణ్.

అడ్డంగా తలూపాడు ధ్రువ. "ఇప్పుడే చెబుతున్నాను. చెల్లెమ్మకిష్టం లేకపోతే మాత్రం, ఆ డబ్బులు తీసుకెళ్లి చెల్లెమ్మతో సంతకం పెట్టించి ఆ స్థలం కొనిపించేస్తాను. ఆ తర్వాత నన్నేమైనా అంటే బాగుండదు." హెచ్చరించాడు వరుణ్

★★★

"నాన్నా! ఇక్కడకు దగ్గరలో పొలం అమ్మకానికుందట... కొందామనుకుంటున్నాను. మీరేమంటారు?" అడిగాడు తండ్రి రామచంద్రని ధ్రువ.

ప్రక్కగదిలో ఏదో పని చేసుకుంటున్న సాహిత్యకు, ధ్రువ మాటలు పిడుగుపాటులా తోచాయి. 'అందరూ పెళ్లయిన ఐదు, పదేళ్లకే ఇల్లు కట్టుకుంటుంటే... పదిహేనేళ్లయినా తామింకా ఆ కలకు చాలా దూరంలో ఉన్నారు. తామున్న ఆర్థిక పరిస్థితిని బట్టి ఇప్పుడప్పుడే ఇల్లు కట్టే మార్గం అయితే లేదు. ఏవో కొద్దిగా డబ్బులు అందుతున్నాయి. ముందు ఇంటి స్థలం కొనుక్కుంటే, ఆ తర్వాత లోను తీసుకొని ఇల్లు కట్టించుకోవచ్చన్న ఆలోచనలో ఉంది తాను. ఇప్పుడాయన ఆలోచనలు..... ఈ విషయం తనకి ఇంకా చెప్పనే లేదు! మామయ్య గారికి చెప్తున్నారంటే.... అవునూ మామయ్య గారికి ఈ విషయం ముందే తెలుసా! తెలిసే ఆ విషయం మాట్లాడడానికి ఆయన ఆ పల్లెటూరి నుండి వచ్చారా? చేతికి వచ్చిన ఆ కాస్త సొమ్ము పొలం మీద పెడితే, ఇంక తాము ఇల్లు ఎలా కట్టుకుంటారు? ఎప్పుడు కట్టుకుంటారు? ఇంకా ఎన్నాళ్ళని అద్దె ఇళ్లల్లో ఉంటారు. ఇన్నాళ్లూ ధ్రువ ఏమన్నా తాను ఎదురు చెప్పలేదు. కాని ఇప్పుడు ఊరుకుంటే లాభం లేదు. తాడోపేడో తేల్చుకోవాల్సిందే' అనుకుంటూ, కోపంగా ముందు గదిలోకి వెళ్దామని లేచిన సాహిత్య రామచంద్ర మాటలు వినిపించి ఆగిపోయింది.

"చేతికందిన కాస్త సొమ్ము, పొలంమీద పెడతానన్న నీ ఆలోచనను సమర్థించలేకపోతున్నాను!" అన్నాడు రామచంద్ర.

"పొలం కొంటానంటే మీరు సంతోషిస్తారనుకున్నాను" ఆశ్చర్యంగా అన్నాడు ధ్రువ.

"ఒకప్పుడైతే సంతోషించేవాడినేమో! కాని ఇప్పుడు పరిస్థితులు అలా లేవు. పొలం మీద డబ్బు పెట్టడమంటే చేజేతులా డబ్బు పారేసుకున్నట్లే!" చెప్పాడు రామచంద్ర.

"అదేమిటి నాన్నా, అలా అంటారు?" ఆశ్చర్యంగా అన్నాడు ధ్రువ.

"వ్యవసాయం లాభసాటిది కాదురా. రేపెప్పుడో అవసరాలకు ఆ పొలం అమ్మాలనుకున్నా కొనేవాళ్ళు కూడా ఉండకపోవచ్చు!"

"నన్ను బాగా అర్థం చేసుకున్న మీరే ఇలా అంటారనుకోలేదు నాన్నా!"

"మరేం చెయ్యమంటావురా! వ్యవసాయం చేస్తున్నవాళ్లే గిట్టుబాటు ధరలు కూడా రాక, ఆ పొలం అమ్ముకొని, ఏవో చిన్న చిన్న వ్యాపారాలు చేసుకొని కాలం నెట్టుకొస్తున్నారు. నన్నే చూడు... మీ తాత ఇచ్చిన ఐదు ఎకరాల పొలం..... వ్యవసాయం చెయ్యడానికి చేసిన అప్పులు పోగా, రెండెకరాలు మిగిలింది. ఏదో నువ్వు, మీ చెల్లి నా నుండి ఏదీ ఆశించకపోబట్టి.... పొలం మీద ఉన్న మమకారం ఇంకా పోలేదు కాబట్టి.... వ్యవసాయం చేస్తున్నాననిపించుకుంటూ ఉన్నాను. నన్ను చూస్తున్నావు కదా, ఒక్కొక్కసారి మదుపులకే డబ్బులుండవు. పిల్లలు వస్తే, చేతిలో పెట్టడానికి నాలుగు డబ్బులు చేతిలో ఆడవు. అందరిలాగా నేను కూడా, వ్యవసాయ భూమిని ఇళ్ల స్థలాలుగా అమ్మి ఉంటే బాగుండేదేమో! కాని ఏమిటో పొలం మీద మమకారం తెంచుకోలేకపోతున్నాను. నేనంటే పాతకాలం వాడిని. పల్లెటూరివాడిని. చదువులేనివాడిని. కానీ చదువుకున్న నువ్వు ఇలా ఆలోచించడం నాకేమీ నచ్చలేదు. ఏ రోజూ నీ నిర్ణయాలను తప్పుపట్టలేదు. కాని, నీ ఈ నిర్ణయాన్ని నేను సమర్థించలేను!" చెప్పాడు రామచంద్ర.

"నా పాయింట్ కూడా అదే నాన్నా! వ్యవసాయం లాభసాటిది కాదు. నష్టాలు కూడా వస్తున్నాయని అందరూ పొలం అమ్ముకుంటుంటే, రేపు వ్యవసాయం ఎవరు చేస్తారు? రాబోయే తరం వ్యవసాయం అంటే ఏమిటంటారేమో! కొన్నాళ్ళకి మనం తిండిగింజలకు కూడా వేరే దేశాల మీద ఆధారపడవలసి వస్తుందేమో? అటువంటి పరిస్థితి మనకు, ఎదురుపడకూడదని నేను పొలం కొంటానంటున్నాను. నా ఒక్కడి నుండి ఏమీ అయిపోదు. అయినా భవిష్యత్తు మీద

ఏదో ఆశ. ఎవరు ఎలా ఆలోచించినా నా వరకు నాకు భూమితల్లి మీద పచ్చదనపు చీర కప్పుదామన్న చిరు ఆశ. నాలాగా కొంతమంది అయినా ఆలోచించకపోరా అన్న చిన్న ఆశ." స్థిరంగా అన్నాడు ధ్రువ.

"ఏమోరా! వినడానికి బాగానే ఉన్నా, ఆచరణలో కొన్ని సాధ్యం కావు. నన్ను చూస్తూనే ఉన్నావు కదా! నీలాగే ఆలోచించి, నా పిల్లలకు, చదువు తప్ప ఏమీ ఇవ్వలేకపోయాను. నువ్వు నాలా కాకూడదని.... తాత ముత్తాతల పొలం... అమ్ముకోలేకపోయాను. నువ్వు నీ కష్టార్జితం పొలం మీద పెడతానంటున్నావు. నిర్ణయం తీసుకునే ముందు కోడలి మనసు కూడా తెలుసుకో. ఆమెకిష్టం లేకుండా నువ్వేమి చేసినా నేను హర్షించలేను!" నిష్కర్షగా చెప్పాడు రామచంద్ర.

'ఇప్పుడేమి చేయాలి?'ఎదురుగా ఉన్న ధ్రువ, ప్రక్కగదిలో ఉన్న సాహిత్య.... ఇద్దరూ ఆలోచనలో పడ్డారు. 'తన నిర్ణయాన్ని సమర్థిస్తాడనుకున్న నాన్నే ఇలా అంటే సాహిత్య ఏమంటుంది?'అన్న ఆలోచనలో ధ్రువ. 'మామయ్యగారు ఇంత గట్టిగా చెప్పినా, ఆయన పొలమే కొంటానంటే, తన నిర్ణయం ఏమిటి?'అన్న ఆలోచనలో సాహిత్య.

★★★

ధ్రువ ఆలోచన విన్న అందరూ వద్దని చెప్పేవాళ్లే! ధ్రువతో చెప్పలేక "ఎందుకంత మూర్ఖత్వం? లోకం దారిన నడవకుండా" అని సాహిత్య దగ్గర సుద్దులు వెళ్ళబోసిన వాళ్లే.

ఇరుగుపొరుగు ఆడవాళ్లు, "మగాడు ఆశయాలని తిరిగితే, ఆడదైనా మగవాడిని సరిదిద్దుకోవాలి. రేపు రిటైర్ అయ్యాక కూడా అద్దె ఇళ్లల్లోనే ఉంటారా?" అని సాహిత్యను ప్రశ్నించేవాళ్లే.

ఇంకా కొంతమందైతే, "నాలుగు రోజులు దగ్గరకు రానివ్వకపోతే ఏ మగాడు లొంగడు చెప్పండి?" అని సాహిత్యకు సలహాలు ఇచ్చినవాళ్లే. విషయం తెలిసి వచ్చారు సాహిత్య తల్లిదండ్రులు.

★★★

"ఏంటమ్మా! ఏదో వింటున్నాం. ఏంటి విషయం?" సూటిగా అడిగేసాడు తండ్రి.

నవ్వేసి, "మీరు విన్నదే నాన్నా!" అనేసింది సాహిత్య.

"అదేంటమ్మా అలా అంటావు? మరి నువ్వేమి చేస్తున్నావు!" అడిగాడు తండ్రి.

'నేనేమి చేస్తున్నానా?' ఆలోచనలో పడింది సాహిత్య.

సాహిత్య తల్లిదండ్రులు, సాహిత్యకు గట్టిగా చెప్పారు... ధ్రువ ఆలోచనకు ఒప్పుకోవద్దని. నవ్వింది సాహిత్య. "మా పెళ్ళప్పుడు ఆయన కట్నం తీసుకోనంటే అభ్యుదయవాది అన్నారు. ఇప్పుడూ అటువంటి అభ్యుదయవాదంతో, ఆయన పొలం కొంటానంటే వద్దని చెప్పమంటారేమిటి నాన్నా?" అడిగింది.

"అప్పుడు మేము పిల్లని ఇస్తున్నాం కాబట్టి అలా అనుకున్నాం. ఇప్పుడు పిల్లను ఇచ్చాం కాబట్టి ఇలా అంటున్నామేమో!" లౌక్యంగా అన్నాడు తండ్రి.

"అయినా అవన్నీ కాదే! అప్పుడు వేరు. ఇప్పుడు వేరు. అప్పుడంటే మీకు పిల్లా పీచు లేరు. ఇప్పుడు పిల్లలు పెద్దవుతున్నారు.

సొంత ఇల్లు లేకపోతే ఎలా? నీ మంచికోసమే చెప్తున్నాం!" అంది తల్లి.

"అది కాదమ్మా! నీతోటి వాళ్ళందరూ ఎప్పుడో ఇల్లు కట్టుకున్నారు. ఉన్న డబ్బంతా పొలం మీద పెడితే, ఇల్లు కట్టుకోవడం ఎలాగ? నువ్వే ఆలోచించు. పోనీ మీ మామగారు ఏమన్నా చెప్తారంటే, వాళ్ళిద్దరికీ ఇష్టమైనప్పుడు నేనేమీ చెప్పను అని తప్పించుకున్నారు. కొడుకు బాగోగులు చూడక్కరలేదా ఆయన? కొడుకు లోకంతో పాటు నడవకపోతే, నువ్వు తప్పు చేస్తున్నావని మందలించనక్కరలేదా? పోనీ ఆస్తిపాస్తులేమన్నా ఉన్నాయంటే అవీ లేవు. మరి ఉన్నదాన్ని జాగ్రత్త చేసుకోనక్కరలేదా? నువ్వే చెప్పు?" సాహిత్యను ప్రశ్నించాడు తండ్రి.

తండ్రి మాటలతో కోపం వచ్చింది సాహిత్యకు. ఏనాడూ, ఏ విషయంలోనూ ధ్రువ నిర్ణయాలలో తల దూర్చని తన మామగారు, 'కోడలికి ఇష్టం లేకపోతే నిన్ను సపోర్ట్ చెయ్యనురా' అని నిక్కచ్చిగా చెప్పారు. అటువంటిది తన తల్లిదండ్రులెందుకు ధ్రువను అర్థం చేసుకోలేకపోతున్నారు?

"నాన్నా! ఈయన కట్నం తీసుకోనన్నప్పుడు మా మామగారు ఈయననే సపోర్ట్ చేశారు కదా! అప్పుడూ మీ అల్లుడు లోకంతో పాటు నడవలేదు కదా! అప్పుడు లేని అభ్యంతరం ఇప్పుడెందుకు చెప్తున్నారు. మీరు ఏమంటే అనండి కాని, మీ హిపోక్రసీ నాకు నచ్చలేదు!" సూటిగా చెప్పేసింది సాహిత్య తండ్రికి.

"అది కాదమ్మా! ధ్రువని, వాళ్ళ నాన్నగారిని తప్పు పట్టడం నా ఉద్దేశం కాదు. వాళ్ళ నాన్నగారు చెప్తే వింటాడేమోనని అంతే!" నచ్చచెప్పబోయాడు తండ్రి.

"నాన్నా! ఏరోజన్నా ఆయన మీ అల్లుడి నిర్ణయాలలో తలదూర్చారా! కట్నం కానివ్వండి... పెట్టుపోతలు కానివ్వండి...పిల్లలు పుట్టినప్పుడు కానివ్వండి... ఏ సందర్భంలోనూ ధ్రువ మీ దగ్గర నుండి ఒక్క పైసాకూడా తీసుకోలేదు. అటువంటప్పుడైనా మా మామగారు 'అడగడం తప్పుగాని, ఇస్తామన్నప్పుడు తీసుకోవడానికేమిటి అనైనా అన్నారా?'అటువంటిది ఈసారి, 'కోడలికి ఇష్టం లేకపోతే నిన్ను సపోర్ట్ చెయ్యనురా' అని నిక్కచ్చిగా చెప్పారు. అటువంటి ఆయనను మీరలా అనడం నాకేమీ నచ్చలేదు!" కినుకగా అంది సాహిత్య.

"నన్ను తప్పుగా అనుకోకమ్మా! ధ్రువనుగాని, మీ అత్తమామలను గాని వేలెత్తి చూపడానికి కాదు. ఆశయాలు ఉండడం తప్పని అనను. కానీ ముందు వెనకలు చూసుకోవాలి కదా! తనకు మాలిన ధర్మమేముంటుంది ఈ లోకంలో!" ప్రశ్నించాడు సాహిత్యను.

అందరిలాగ అల్లుడు 'నేను, నా కుటుంబం అనుకొని ఉండడని కోపం. జీతంలో కొంత దానధర్మాలకు వెచ్చిస్తాడని కోపం.'

"ఆయన ముందూ వెనకా చూసుకోకుండా ఏమి చేశారు నాన్నా! మమ్మల్ని బాగానే చూసుకుంటున్నారు కదా" ప్రశ్నించింది సాహిత్య.

"బాగా చూసుకుంటున్నాడని నువ్వంటే సరిపోతుందా! మీ కన్నా తక్కువ జీతగాళ్లు కార్లు, ఇల్లు, బంగారాలు కొనుక్కుంటున్నారు. అంటున్నానని కాదు గాని, పెళ్లయి పదిహేనేళ్ళయింది. మీరేం వెనకేసుకున్నారు? వెనక డబ్బు బాగా మూలిగితే అప్పుడు ఆశయాలంటూ ఎగరవచ్చు. అంతేకాని, గొప్పకోసం నలుగురూ మెచ్చుకుంటారని, కుటుంబాన్ని తాకట్టు పెట్టి ఇలాంటి పనులు చెయ్యక్కర్లేదు!" సాహిత్య తండ్రి కోపం దాచుకోలేకపోయాడు.

తండ్రి మాట విన్న సాహిత్య ఆలోచనలో పడింది. ఆశయాలంటూ చేస్తున్నాడా ఈ పని. అందరి మెప్పు కోసం చేస్తున్నాడా? ఇంటిస్థలం వద్దని, ఏ ఆలోచనతో పొలం కొంటాననంటున్నాడు ధ్రువ. ఆలోచనలో పడి, రెండు రోజుల క్రితం జరిగిన విషయం గుర్తుకు తెచ్చుకుంది.

★★★

ఆ రోజు రాత్రి పడకగదిలో "సాహిత్యా! నీకో విషయం చెప్పాలి. ఇలారా కూర్చో!" అన్న ధ్రువ ప్రక్కన కూర్చుంది.

"నా మనసులో ఒక ఆలోచన వచ్చింది. నీ సహకారం లేకపోతే ఆ విషయంలో ఒక్క అడుగు కూడా ముందుకు వెయ్యలేను!" అంటూ ఆగాడు ధ్రువ.

విషయం ముందే తెలిసిపోయింది కాబట్టి, ఆ సంభాషణకు ఆశ్చర్యపోలేదు సాహిత్య. వినడానికి సిద్ధంగా ఉన్నానన్నట్లు, చూస్తూ కూర్చుంది.

విషయం ఎలా మొదలు పెట్టాలో అన్న ఆలోచనలో కొంత సమయం గడిపాడు ధ్రువ. చివరకు గొంతు సవరించుకొని "నేను పుట్టి పెరిగింది పల్లెటూర్లో... నీకు తెలుసు కదా! మా చిన్నప్పుడు పచ్చని పంటచేలతో, చుట్టూ మామిడి తోటలతో ఆకుపచ్చని చీర సింగారించుకొని ఉండేది మా ఊరు. మండువేసవిలో కూడా చల్లగా ఉండేది. మేము పెరుగుతున్న కొద్దీ, ఆకుపచ్చదనం క్రమేణా కుంచించుకుపోయి, భూమి బీడుగా మారిపోసాగింది. కారణాలనేకం. మదుపులు పెరిగిపోవడం ఒక కారణమైతే, గిట్టుబాటు ధరలు రాకపోవడం ఇంకో కారణం. అవి అలా ఉండగా, పంట చేతికి వచ్చే సమయానికి కురిసే అకాల వర్షాలు, వడగండ్లు.... మేము సైతం అంటూ... రైతుతో ఆటలాడుకోవడం ఇంకొక కారణం. పొలం మీద సంవత్సరమంతా కష్టపడినా, అప్పులే మిగలగా... పొలం అమ్ముకొని ఆ వచ్చిన డబ్బుతో ఏదో ఉపాధి చూసుకుందామని, ఇన్నాళ్లూ తిండి పెట్టిన పొలాన్ని అమ్ముకోవడం మొదలుపెట్టాడు రైతు. అలా సాగుచేసే భూమి తగ్గిపోయింది.

కొనుక్కున్నవాడు వ్యవసాయం చెయ్యకుండా రియల్ ఎస్టేట్ వ్యాపారం మొదలుపెట్టాడు. అలాగ, తిండి గింజలు పండించే రైతు కూడా, ఆఖరికి తన తిండి గింజలకోసం ఇంకొకరి మీద ఆధారపడే స్థితికి వచ్చాడు. పరిస్థితి ఇలాగే కొనసాగితే కొన్నాళ్లకు, రైతన్నవాడు దేశంలోనే మిగలడేమో! చాలా కాలం నుండి ఈ ఆలోచన నా గుండెలను కోసివేస్తోంది. ఒక రైతుబిడ్డగా వ్యవసాయపు కష్టనష్టాలు, సాధకబాధకాలు అన్నీ అనుభవించి ఉన్నాను. ఒకప్పుడు మా ఊరు వెళ్లడానికి పరిగెత్తుకెళ్లే నేను, ఇప్పుడు మా ఊరు వెళ్లాలంటే బెంగ పడిపోతున్నాను. బోడిగా అయిపోయిన మా ఊరిని చూడలేకపోతున్నాను. మా ఊరే కాదు. ఏ పల్లెటూరిని చూసినా అలాగే ఉంటుంది. ప్రస్తుతం పల్లెటూరు తన పూర్వ వైభవాన్ని కోల్పోయింది. నుదుట నయాపైసంత కుంకుమ బొట్టుతో కళకళలాడే కన్నతల్లికి, వైధవ్యం ప్రాప్తిస్తే, కుంకుమబొట్టు లేని తల్లి ఫాలాన్ని చూడాలంటే బిడ్డ ఎలా బెంగటిల్లిపోతాడో.... ఏ పల్లెటూరిని చూసినా, నా మనసు అలాగే చలించిపోతుంది. ఏదో చెయ్యాలన్న తపన నన్ను నిలవనీయడం లేదు.

కొన్ని నెలలుగా ఆ విషయమే ఆలోచిస్తున్నాను. వచ్చిన డబ్బుతో, కొద్దిగా పొలాన్ని కొని... ఏదో ఒక పంట.... లాభాన్ని ఆశించి కాదు.... నష్టం కూడా రావచ్చు... శ్రమే మిగలవచ్చు... అయినా నాలుగు రోజులు నేలతల్లి పచ్చగా ఉన్నా చాలన్న ఆలోచన.... నా ఒక్కడివల్లా ఏమీ కాదు.... అయినా ఉడతా భక్తిగా.... నన్ను మోస్తున్న నేలతల్లికి నా వంతు ప్రయత్నం అంత! నేలతల్లి కరుణించిందా.... ఆ పొలంలోనే చిన్న ఇల్లు... ఇదీ నా ఆలోచన. నీ అంగీకారం లేకుండా నేను ముందుకెళ్లలేను.

నన్ను అర్థం చేసుకుంటావన్న ఆశ... ఆ పైన నీ ఇష్టం” భర్త మాటలు నిన్న సాహిత్యకు సమాధానం ఏం చెప్పాలో అర్థం కాలేదు. ఏ నిర్ణయం తీసుకోవాలో కూడా అర్థం కాలేదు. అప్పటినుండి ఆలోచిస్తూనే ఉంది.

ఇప్పుడు తండ్రి మాటలు విన్నాక, సమయానుకూలంగా మనుషులెలా మాట్లాడగలరో అర్థమైంది. తన తండ్రి దగ్గర నయాపైసా తీసుకోనప్పుడు ధ్రువను ఆకాశానికెత్తేసిన ఆయనే, ఇప్పుడు ధ్రువ ఆశయాలను అంగీకరించలేకపోతున్నారు. అంతేకాదు, అవి తప్పని చెప్పడానికి కూడా వెనకాడడం లేదు. సొంతమనుకున్న వాళ్లే, ధ్రువ ఆలోచనను హర్షించకపోతే, వేరేవాళ్ళు విమర్శించడంలో తప్పులేదు. నేటి పరిస్థితులను చూసి అందరూ ‘అప్పుడలా ఉండేది. ఇప్పుడలా కాదు’అనేవారే కాని అప్పుడులా ఇప్పుడుందామని ఎవరూ ఎందుకనుకోవడం లేదు? వాతావరణ సమతుల్యం చెడిపోతుందని గగ్గోలు పెట్టేవారే కాని, ఒక మొక్క నాటిన పాపాన పోవడంలేదెవ్వరూ? ఎవరికి వారే మనకెందుకనుకుంటే, ముందడుగు వేసేది ఎవరు? ముందడుగు వేసే వాళ్ళను ప్రోత్సహించకపోతే పరిస్థితులు ఎప్పటికి మారేను? “సొంత లాభం కొంత మానుకు, తోటి వారికి సాయపడవోయ్” అని ఆనాడే మహానుభావుడు గురజాడ చెప్పారు. ఈరోజు ధ్రువ పుడమితల్లికి తన వంతు బాధ్యత నెరవేరుస్తానంటున్నాడు. సహధర్మచారిణిగా ఆయనకు, సహకారం అందించకపోతే ఎలా? తన కర్తవ్యం ఏమిటో, తానేమి చెయ్యాలో నిర్ణయించుకుంది సాహిత్య.

“నాన్నా! ఆశయాలంటూనో, ఎవరో మెచ్చుకుంటారనో ఈ పని చేయడం లేదాయన. తన మనసు చెప్పిన మాట వింటున్నారాయన. నేలతల్లికి తన వంతు బాధ్యత నెరవేర్చాలనుకుంటున్నారాయన. ‘ఎండలు మండిపోతున్నాయి. వానలు కురవడం లేదు. పంటలు పండడం లేదు. నేల బీడైపోతుంది...’అంటూ మాటలు చెప్పేవాళ్లే గాని, ఉన్న కొంచెం స్థలంలో నాలుగు మొక్కలు నాటి పచ్చదనాన్ని పెంచుదామని ఎందుకు అనుకోవడంలేదెవ్వరూ? ఇప్పుడు ఆ పని ధ్రువ చేస్తానంటున్నాడు. ఆయన భార్యగా ఈ విషయంలో ఆయనకు సంపూర్ణ సహకారం అందించి, భార్యగా నా బాధ్యత నెరవేర్చుకుంటాను. మీరేమనుకున్నా సరే!” అంటూ తేలికైన మనసుతో, తన నిర్ణయం స్పష్టంగా చెప్పింది సాహిత్య, తెల్లబోయి చూస్తున్న తల్లిదండ్రులతో.



7032480233

# గాజు బతుకులు

ఓలేటి శ్రీనివాస భాను

**విశిష్ట అతిథి కథ**

***పెళ్లి గాజులు, పేరంటం గాజులు, చిన్న పిల్లల గాజులు, సీమంతం గాజులు.. లక్క వీ, మట్టివీ, రబ్బరువీ... ఒకటా? రెండా? బసప్ప విజాపుర కుటుంబం ఎన్నిరకాల గాజులు అమ్మిందో! ఊళ్లూ , రాష్ట్రాలూ మారి ఎన్నెన్ని కష్టాలు పడిందో! 'గాజుల బేరం భోజనానికి సరి' అని సామెత! ఎన్ని గాజులమ్మినా పూట గడవకపోవడం ఆ కుటుంబం తలరాత!***

భార్య, భర్త, నలుగురు పిల్లలు – మొత్తం ఆరుమంది తలదాచుకోవాలంటే ఎన్ని గదులు కావాలి?

ఒక్క గది చాలనుకున్నాడు బసప్ప విజాపుర.

ఒంటిగది ఇంటి కోసం పార్వతీపురంలోని బెలగాం ప్రాంతమంతా వెతికాడు. చివరికి అగ్రహారం వీధిలో చవగ్గా దొరికింది. అది బోడపాటి రమాపతిగారి ఇంటికీ, వెంకోబరావు డాక్టర్‌గారి ఇంటికీ మధ్య పాడుబడ్డ ఆవరణలో ఉండేది. అక్కడి జనం దాన్ని 'భూత్ బంగ్లా' అనేవాళ్ళు.


ఏపుగా ఎదిగిన తుమ్మ, రేగు తుప్పలు, ఏ మూల చూసినా జిల్లేడు మొక్కలు. పురుగూ, పుట్రా తిరిగే ప్రదేశం. ముందు ఖాళీ భాగంలో పాత ఇల్లు కూలి పోయి, పునాదులు పైకి లేచి, వృద్ధాప్యంలో పెల్లుబికిన నరాల్లా కనిపించేవి! వెనక భాగంలో, మేడ మీద ఒకే ఒక్క గది! రోడ్డు మీంచి చూస్తే జగన్నాథస్వామి రథంలాగా కనిపించినా, పైకి వెళ్తే మాత్రం ఎండిపోయిన మాను మీద బక్కచిక్కిన కొంగలాగా అనిపించేది. పెంకుల మధ్య సందుల్లోంచి ఎండ... పొడుగాటి గొట్టంలా ఏటవాలుగా దిగేది. వానాకాలంలో ఒలిపిరికి గోడలు చారలు కట్టి అక్కడక్కడ పెచ్చులు రాలిపోయాయి. గోడ కన్నాల్లో బిల బిలమంటూ నల్లుల పటాలాలు... చూరు పట్టుకు వేలాడుతూ సాలీళ్ళు! వీధిలో విద్యుత్ స్తంభాలున్నాయి గానీ, ఇంట్లో మాత్రం కరెంటు లేదు. నీళ్ళ కోసం బంగ్లా వెనక నూతికి వెళ్ళాలి. మొండి గోడల వెనక కాలకృత్యాలు తీర్చుకుని, నూతి చప్టా మీద చాటుగా స్నానాలు చెయ్యాలి.

“ఇది ఇల్లా? ఇక్కడ ఆరుగురితో బతకాలా?” అని బసప్ప ఆలోచించాడో, లేదో, గానీ తలదాచుకోడానికి చవగ్గా నీడ దొరికింది చాలనుకున్నాడు. ఓ సాయంత్రం విజయనగరంలో విశాఖపట్నం – దుర్గ్ ప్యాసింజర్ ఎక్కి, పార్వతీపురంలోని బెలగాం స్టేషన్‌లో సంసారంతో పాటు దిగిపోయాడు. రిక్షా ఖర్చు మిగల్చాలని ఇంటికీ, స్టేషన్‌కీ మధ్య సుమారు కిలోమీటరున్నర దూరం... బసప్ప, భార్య, ఇద్దరు పెద్ద పిల్లలూ సామాన్లు మోసుకొచ్చారు. బెలగాం సెంటర్లో కాటూరు సోములు దుకాణం దగ్గర కుడుం ముక్కలు తిని, టీ నీళ్ళు తాగారు. భూత్ బంగ్లా మేడ మీద గదిలో బుడ్డీ దీపం వెలిగించి,

పెచ్చులూడిన గచ్చు మీద ఎక్కడ సామాన్లు అక్కడే పడేసి, తుంగ చాపల మీద కూలబడ్డారు.

ఒకవైపు బొగ్గుల కుంపటి, మరో వైపు రెండు చెక్క పెట్టెల్లో బట్టలు, పాత్రలు, వంట పాత్రలు, తత్తిమా సామాన్లు. ఇంకో వైపు గాజుల బస్తాలు... వాటి మధ్య చంద్రుడిలో ఒదిగిపోయిన కుందేటి కూన లాగా ఆ రాత్రికి సర్దుకుపోయిన కుటుంబం, అనేక రాత్రులు అలవాటుగా సర్దుకుపోతూ వచ్చింది. నిట్టూర్పులతో రోజులు నెట్టుకొచ్చింది.

విజయనగరం లోని నాలుగు గదుల ఇంట్లో బసప్ప విజాపుర ఒకప్పుడు బాగానే బతికాడు. ఉన్నట్టుండి కాలం తిరగబడింది. కుదురుగా సాగుతున్న వ్యాపారం ఊబిలో దిగబడింది. నష్టాల మీద నష్టాలొచ్చిపడ్డాయి. చెప్పాలంటే మొదట్లో అంతా బాగానే నడిచిందట. కానీ బసప్పకి కల్లా, కపటాలు తెలీవు. అయినదానికీ, కానిదానికీ మరొకరి మీద



ఆధారపడే మనస్తత్త్వం! అవే తమ కొంప ముంచాయనేది బసప్ప భార్య రేణుక. తన భర్త అమాయకత్వాన్ని అలుసుగా తీసుకున్న భాగస్వాములు అందినకాడికి బుక్కేశారని నెత్తీ, నోరూ కొట్టుకునేది!

"బొత్తిగా సత్తికాలం మనిషిలా ఉన్నాడు... ఎలా బతుకుతారో ఏంటో?" అని ఎవరైనా అంటే..,

"ఏం చేతును? ఎల్లా హణెబర..." అని నొసట మీద చూపుడు వేలితో అడ్డంగా రాస్తూ, ఇదంతా తమ తల రాత అని చెప్పేది. మానవమాత్రుడి చేతిలో ఏమీ లేదంటూ "ఎల్లా దేవర ఆట" అని చేతులు జోడించి ఆకాశం వైపు చూసేది.

బసప్ప విజాపుర స్వస్థలం కర్ణాటకలోని బీదర్ జిల్లాలోని ఓ మారుమూల పల్లె. కరువు కాటకాలతో అలమటించే ప్రాంతం. బతుకు తెరువు కోసం ఆయన షోలాపూర్ వెళ్ళాడు. పూనా వెళ్ళాడు. కొన్నాళ్ళు బొంబాయిలోను, ఇంకొన్నాళ్లు బెంగళూరులోనూ తిరిగి, ఊళ్లూ, రాష్ట్రాలూ మారుతూ విజయనగరం వచ్చాడు. ఒక ఊళ్ళో స్టేషనరీ, ప్లాస్టిక్ సామాన్లు అమ్మితే, మరో ఊళ్ళో కూరలు, బొగ్గుల దుకాణాలు పెట్టాడు. అలా పొంతనలేని వ్యాపారాలు చాలా చేశాడు. అవేవీ అంతగా ఎత్తిరిల్ల లేదు. చివరికి విజయనగరంలో గాజుల వ్యాపారం కాస్తంత కలిసొచ్చింది. జీవితం ఓ మోస్తరుగా కుదురుకుంది. పాతదే అయినా, అయ్యకోనేటికి దగ్గరలో నాలుగు గదుల ఇల్లు కొన్నాడు. నలుగురు పిల్లల్ని కన్నాడు. అక్కణ్ణించి దశ తిరగబడింది. ఖర్చులు పెరిగాయి. కష్టాలు చుట్టుముట్టాయి. పగవాడికి కూడా వద్దనుకున్నాడు బసప్ప. సంపాదన కరిగి, పెట్టుబడి గల్లంతయింది. మొండి బకాయిలు పెరిగి, అప్పులు మిగిలాయి. ఇల్లు అమ్మి అసలు తీర్చాడు. భార్య నగలమ్మి, వడ్డీలు కట్టాడు. బతుకు తెరువు కోసం బెలగాంకి మారాడు.

బసప్పకి తెలిసిందీ, కాస్త కలిసొచ్చిందీ గాజుల వ్యాపారమే! విజయనగరంలో టోకున కొనుగోలు చేసి, పార్వతీపురం, బొబ్బిలి, రాయగడల్లోని దుకాణాల వారికి గాజుల స్టాకు సరఫరా చేసేవాడు. ఉన్ననాడు తింటూ, లేని నాడు నీళ్ళతో కడుపులు నింపుకుంటూ, పిల్లల్ని నూకల జావతో పోషిస్తూ బసప్ప, ఆయన భార్య బతికేవారు.

ఎదురుగా లాయర్ లక్ష్మాజీరావుగారి ఆరో అబ్బాయి పదేళ్ళ శీనుబాబుకి ఇవేవీ తెలీవు. తన ఈడు వాడైన బసప్ప రెండో కొడుకు రామచంద్రతో శీనుబాబుకి జట్టు కుదిరింది. వాళ్ళిద్దరూ మూడు నుంచి అయిదు వరకు బెలగాం ఆర్.సి.ఎం స్కూల్లో కలిసి చదువుకున్నారు. రామచంద్ర ఆటల్లో చురుగ్గా ఉండేవాడు. బడిలోగానీ, నడి వీధిలోగానీ పరుగుల పందేల్లో ఫస్టు వచ్చేవాడు. ఎలాంటి ఆధారం లేకుండా కాళ్ళు మీదికీ, తల కిందికీ పెట్టి, ఎంతసేపైనా ఉండేవాడు. బెలగాం హైస్కూల్లో ఎనిమిదో తరగతి చదువుతున్న అన్నయ్య పండరినాథ్‌తో పాటు రామచంద్ర ఇంటి పనుల్లో అమ్మకి సాయం చేసేవాడు.

బసప్ప పొదుపరి. గాజుల వ్యాపారం మీద ఊళ్లు తిరగాల్సివచ్చినప్పుడు, బస్సులో అయితే ఎక్కువ చార్జీలు అవుతాయని ట్రైన్ లోనే తిరిగేవాడు. తండ్రి ఒక్కడే గాజుల బస్తాలు మోయలేడని అన్నయ్య పండరినాథ్‌తో పాటు రామచంద్ర కూడా సాయం కోసం స్టేషన్‌కి వెళ్ళేవాడు. విజయనగరం నుంచి బసప్ప గాజుల స్టాక్ తెచ్చిన రోజు... రేణుక తన వంతు పనిలోకి దిగేది. నేల మీద మెత్తటి గొంగటిని పరిచి, గాజుల కట్టల్ని జాగర్తగా విడదీసేది. కుడిచేతి నాలుగు వేళ్లకీ, బొటన వేలికీ మధ్య ఒక్కో గాజునీ అడిస్తూ, వాటి గట్టితనాన్ని పరీక్షించేది. ఆ పరీక్షలో అవుకు గాజులు పుటుక్కుమనేవి. వాటిని రేణుక చెత్త కింద పారవేసేది కాదు. ఓ అట్టపెట్టెలో భద్రపరచి, బుడ్డీ దీపం జ్వాలలో వాటిని అంటీ అంటనట్టు కరిగించి, ఒక్కో ముక్కనీ ఒడుపుగా అంటిస్తూ రంగు రంగుల గొలుసులు తయారు చేసి, అమ్మకానికి పెట్టేది. కొన్నవాళ్ళు వాటిని ఇళ్ళలో తోరణాలుగా అలంకరించుకునేవారు. ఈ పనితో పాటు ఊళ్ళో సీమంతం, పెళ్ళికూతుర్ని చెయ్యడం లాంటి శుభకార్యాలకు బసప్పతో పాటు రేణుక కూడా ఇళ్ళకు వెళ్లి, ఆడవాళ్ళకి గాజులు తొడిగేది.

రామచంద్రతో స్నేహం బాగా కుదిరిన తర్వాత శీనుబాబుకి ఆ కుటుంబంతో మరింత చనువు ఏర్పడింది. ఎప్పుడు చూసినా రామచంద్ర వాళ్ళ ఇంట్లోనే కబుర్లు చెబుతూ, బసప్ప కుటుంబ సభ్యులు కన్నడంలో మాట్లాడుకుంటూ ఉంటే వింతగా గమనించేవాడు. ఆకలిని 'హసివు' అంటారనీ, 'ఊట' అంటే భోజనమని తరచు వినిపించే రెండు మాటలకు అర్థాలు తెలుసుకున్నాడు శీనుబాబు.

ఒకరోజు లంచ్ బ్రేక్‌లో శీనుబాబు, రామచంద్ర బడి నుంచి వచ్చారు. శీనుబాబు గబగబా అన్నం తిని, మధ్యాహ్నం బడికి వెళ్ళడానికి ఇంటి గుమ్మం దిగాడు. అలవాటు ప్రకారం రామచంద్ర కోసం ఎదురుగా మేడ మెట్లెక్కి ఒంటి గది ఇంట్లో అడుగుపెట్టాడు. నలుగురు పిల్లలూ బిక్కమొహాలు వేసుకుని కూర్చున్నారు. చిన్నవాళ్ళిద్దరూ అయితే... తోటకూర కాడల్లా అమ్మ ఒళ్లో వాలిపోయారు. ఇంట్లో బసప్ప లేడు. ఎదురుగా లేని భర్తను ఉద్దేశించి రేణుక స్వరం పెంచి మాట్లాడుతోంది. ఆ మాటల్లో మందలింపు ఉంది. గుండె మండుతున్న చప్పుడు ఉంది. నిస్సహాయత వల్లా, నిలువునా దహించుకుపోతున్న బాధ వల్లా ఎగదన్నుకొచ్చే ఆక్రోశం ఉంది. ఉండీ, ఉడిగీ అది ఏడుపుగా మారుతోంది.

అన్ని మాటలకు అర్థం తెలీకపోయినా మధ్య మధ్యలో వినిపించిన 'హసివు', 'ఊట' లాంటి మాటలు శీనుబాబుకి అర్థమయ్యాయి. మనుషుల కవళికలు చూస్తే సన్నివేశం అర్థమయినట్లే అనిపించింది. శీనుబాబుని చూడగానే రామచంద్ర చొక్కాతో కళ్ళు తుడుచుకున్నాడు. బడి సంచిని భుజానికి తగిలించుకుని గబగబా మెట్లు దిగి శీనుబాబుతో కలిసి బయలుదేరాడు.

"ఏమైందిరా? మీ అమ్మగారు ఎందుకలా ఉన్నారు?" అని దారిలో అడిగాడు శీనుబాబు.

అంతవరకు ఉగ్గబట్టుకుని, గంభీరంగా ఉన్న రామచంద్ర వెక్కి వెక్కి ఏడుస్తూ జరిగిందంతా చెప్పాడు.

బసప్ప ఎప్పటిలాగే స్టాకు తీసుకొస్తానంటూ విజయనగరం వెళ్ళాడు. మామూలుగా ఉదయం ప్యాసింజర్‌లో వెళ్లి, రాత్రి ప్యాసింజర్‌లో గాజులమూటతో రావడం ఆయన అలవాటు. అలాంటిది మూడు రోజుల క్రితం వెళ్ళిన మనిషి, ఈ రోజు వరకు రాలేదట. అన్నయ్య పండరినాథ్‌తో కలిసి రామచంద్ర గత రెండు రోజులుగా రాత్రి ప్యాసింజర్ వేళకి బెలగాం స్టేషన్‌కి వెళ్తున్నాడు. తండ్రి రాకపోవడంతో ఇద్దరూ కాళ్ళీడ్చుకుంటూ తిరిగి వస్తున్నారు. బసప్ప స్టాక్ తెస్తేనే ఇల్లు గడిచేది. ఇంట్లో రెండు రోజులుగా ఇంట్లో ఎవరికీ భోజనాలు లేవట. ముందురోజు నూకల జావతో తీరీ తీరని ఆకలి, మర్నాడు మంచి నీళ్ళతో చల్లారనంది... మరింతగా రెచ్చిపోయింది!

"అయ్యో..." అప్రయత్నంగా అన్నాడు శీనుబాబు. ఇద్దరూ ఆర్.సి.ఎం స్కూలు కి చేరుకున్నారు. అయిదో తరగతిలో కూర్చున్నారు. అయిదు నిమిషాల్లో క్లాసు టీచర్ సిస్టర్ మార్టినా వస్తారనగా శీనుబాబుకి ఏదో ఆలోచన వచ్చింది. క్లాసులోంచి బయటకు వచ్చాడు. ఎదురుగా నన్స్ ఉండే హాస్టల్ బిల్డింగ్‌కి చేరుకున్నాడు. మెట్లు దిగి వస్తున్న సిస్టర్ మార్టినాతో రామచంద్ర వాళ్ళ పరిస్థితి గురించి గబగబా చెప్పాడు. ఆవిడ క్లాసుకు వస్తూనే పిల్లలకి ఏదో వర్క్ పురమాయించి, రామచంద్రను తనతో రమ్మన్నారు. నన్స్ హాస్టల్‌కి తీసుకువెళ్ళారు. రెండు అరటి పళ్ళు, ఒక చిన్న బన్ను ఇచ్చి అక్కడే హాస్టల్ వరండాలోనే తినమన్నారు. రామచంద్ర ఆవురావురంటూ అరటి పళ్ళు తినేసి, బన్నును నిక్కరు జేబులో దాచబోయాడు. మార్టినా అది కూడా తినేయమన్నారు. ఇంట్లో ఇద్దరు తమ్ముళ్ళున్నారు. వాళ్ళ కోసం తీసుకు వెళ్తానన్నాడు రామచంద్ర. మార్టినా కళ్ళు చెమ్మగిల్లాయి. వెంటనే గది లోపలకు వెళ్ళారు. రెండు ప్లాస్టిక్ కవర్లతో తిరిగి వచ్చారు. ఒక దాన్లో కొన్ని బన్నులు, అరటి పళ్ళు ఉన్నాయి. మరో దాన్లో గోధుమ నూక ఉంది. వాటిని తీసుకొని వెంటనే ఇంటికి వెళ్ళమని

రామచంద్రను పంపించేశారావిడ.

ఆ రాత్రి పండరినాథ్, రామచంద్ర బెలగాం స్టేషన్‌కి వెళ్లారు. అప్పటికే ఆలస్యమైపోయింది. ప్యాసింజర్ కూత పెట్టి వెళ్ళిపోయింది. ప్రయాణికుల్లో కొందరు రిక్షాల్లో మరికొందరు నడుచుకుంటూ వస్తున్నారు. దీపాలు వెలగకపోవటం వల్ల స్టేషన్ రోడ్డు చీకటిగా ఉంది. అన్నదమ్ములిద్దరూ అటూ ఇటూ వెదికారు. అంతలో, ”అణ్ణా... అల్లి నోడు అప్ప బందరు...” తండ్రి వచ్చారు చూడమంటూ చీకట్లో ఆకారాన్ని చూపించాడు రామచంద్ర.

రోడ్డువార నీరసంగా కాళ్ళీడ్చుకుంటూ నడుస్తున్న బసప్ప కనిపించాడు. తండ్రి భుజం మీది గాజుల బస్తాను అన్నదమ్ములు అందుకున్నారు. ముగ్గురూ ఇంటికి చేరుకున్నాక జరిగిందంతా చెప్పాడు బసప్ప.

మూడు రోజుల క్రితం తను విజయనగరం వెళ్ళినప్పుడు హోల్‌సేల్ వ్యాపారి పాత బకాయిలు జమకడితే తప్ప స్టాక్ ఇవ్వనన్నాట్ట. సాయంత్రం వరకు అతణ్ణి బతిమాలుకుంటే చివరి నిమిషంలో కనికరించాట్ట. గాజుల బస్తాతో బసప్ప స్టేషన్‌కి పరుగులు తీశాడు. టిక్కెట్ కోసం రద్దీలో ఎగబడినప్పుడు బుకింగ్ కౌంటర్ దగ్గర ఎవరో పర్స్ కొట్టేశారు. అప్పటికే ప్లాట్‌ఫారం మీద బండి కూత పెట్టడంతో టిక్కెట్టు కొనకుండానే బసప్ప రైలు ఎక్కేశాడు. రోజులు బాగా లేవు. బండి బొబ్బిలి చేరుకోగానే చెకింగ్ స్క్వాడ్ వాళ్ళు విరుచుకు పడ్డారు. టిక్కెట్ లేని ప్రయాణికుల నుంచి జరిమానా వసూలు చేశారు. డబ్బులు కట్టని వాళ్ళని రైల్వే పోలీసులకు అప్పచెప్పారు. రెండు రోజులపాటు కస్టడీలో ఉన్న బసప్ప, ఎవరి కాళ్ళో పట్టుకుని బయటపడ్డాడు.

“అయ్యో!” అంటూ రేణుక భర్త చేతికి నీళ్ళ గ్లాసు అందించి, గాజుల మూటను కిందికి దించింది. ఆవిడకి ఏదో అనుమానం వచ్చి, బుడ్డీ దీపం వెలుగులో ఆత్రంగా మూట తెరిచి చూసింది...

“అయ్యో దేవరే... ఏనప్పా నమ్మ హణెబర...” అని దేవుణ్ణి తలచుకుని తమ తలరాతను నిందించుకుంది.

మూటలోని స్టాకులో సగానికి పైగా గాజులు చిట్లిపోయి ఉన్నాయి!

# పట్టు పరికిణీ

**పంతుల జోగారావు**



**కథా మార్గదర్శి కథ**

*"ఒసే ముండా, కట్టుకునే వరకూ చచ్చిపోయావు. ఈ చింకి పరికిణీ దానికెలా ఇవ్వను? నీ ఒళ్ళు చీల్చినా పాపం లేదే రాక్షసీ!" ఆవేశంతో ఊగిపోతూ నిర్మలను బాదేసింది. ఆమె కళ్ళు నిప్పులు కురుస్తున్నాయి.*
*"నా పాలిట దయ్యంలా దాపురించావే. నీ కర్మ బాగుంటే నిన్నూ ఒక అయ్య తీసుకుపోయి పెంచుకునేవాడు. నీ రాత ఇలా తగలడింది. కోరికలకు మాత్రం కొదవలేదు. ఛీ వెధవ బతుకు!"*

మధ్యాహ్నం రెండవుతోంది. ముందురోజు రాత్రి కుట్టిన నిక్కర్లకు కాజాలు వేసి, గుండీలు కుడుతూ కూర్చుంది జానకి. నిర్మల సాయంత్రం స్నేహితురాళ్లతో ఆడబోయే బొమ్మలాటకు తాటాకుబొమ్మలను తయారు చేసుకుంటోంది.

"ఎప్పుడూ ఆట ధ్యాసేగాని, చదువుకుందామన్న జ్ఞానం లేదే నీకు?" దీర్ఘం తీస్తూ, నవ్వుతూ అంది జానకి.

"చదివేసుకున్నానుగా" తల తిప్పకుండానే జవాబిచ్చింది నిర్మల.

"ఏం చదివేవు నీ ముఖం"

నిర్మలకు కోపం వచ్చింది. తల్లికి జవాబు చెప్పకూడదనుకుంది. తాటాకురేకులు చీలుస్తూ, మాట్లాడకుండా కూర్చుంది. జానకి ఏదో అనబోయే లోపల వీధిలోనుంచి "పోస్ట్" అన్న కేక వినబడింది.

"నిమ్మీ ఉత్తరం అందుకో"

నిర్మల సంబరంగా వీధిలోకి పరుగెత్తి పోస్ట్‌మేన్ ఇచ్చిన ఉత్తరం అందుకుంది. అడ్రసు చూడగానే అదెక్కడినుంచి వచ్చిందో అర్థమైపోయింది. అడ్రస్ రామం బాబాయిగారి దస్తూరితో ఉంది. లోపల విజయక్క రాసిన ఉత్తరం ఉంటుంది.

"విజయక్క ఉత్తరం రాసిందే" నిర్మల సంతోషంతో నవ్వుతూ తల్లి చేతికి అందించింది ఉత్తరాన్ని.

జానకి ఉత్తరాన్ని ఒకసారి ముద్దుపెట్టుకుని మరీ చదివింది.

"అమ్మకి నమస్కారములు. ఇచ్చట నేను, అమ్మ, నాన్నగారు క్షేమం. నువ్వు చెల్లి క్షేమమని తలుస్తాను. సోమవారం ఉదయం శంకరం పెదనాన్నగారింటికి నేనూ, అమ్మా వస్తున్నాము. ఆ సాయంత్రంలోగా మనింటికి వస్తాను. లేదా, నువ్వే చెల్లిని తీసుకొని వస్తే మరీ మంచిది. చెల్లిని అడిగానని చెప్పు."

ఇట్లు
విజయ.



నిర్మల సంతోషం పట్టలేక, తల్లి మెడ చుట్టూ చేతులు వేసి వాటేసుకుంది. "అబ్బ విజయక్కను చూసి ఎన్నిరోజులైందో!"

జానకి కళ్ళవెంట వచ్చిన కన్నీరు జారిపోతూ ఉంటే, చీరకొంగుతో ఒత్తుకుంది.

"ఏమ్మా ఏడుస్తున్నావు?"

"ఏం లేదమ్మా"

"చెప్పవూ"

"పిచ్చీ ఏంలేదే. మీ అక్క వస్తోంది కదూ"

"అయితే ఏడవడమెందుకు?"

"నీకు తెలీదులే నిమ్మీ"

నిర్మలకు చప్పున ఎప్పుడో, ఏదో సినిమాలో తను విన్న పాటలోని 'నవ్వినా, ఏడ్చినా కన్నీళ్లే వస్తాయి' అన్న ముక్క గుర్తొచ్చింది. అందుకే కారణం చెప్పమని మరి తల్లిని బలవంతపెట్టలేదు.

ఆ పిల్ల మనసు మనసులో లేదు. అక్క వస్తుందనే తియ్యని ఆలోచనతో పరవశించి పోతుంది. ఆ చిన్న మెదడు నిండా ఆలోచనలు ఉక్కిరిబిక్కిరిగా చోటు చేసుకున్నాయి. అక్కతో తన ముచ్చట్లు తలంచుకుంటూ, సంతోషంతో తలమునకలౌతోంది.

అక్కతో తిరగడం ఎంత బాగుంటుంది. ఆడుకుంటే దానితోనే ఆడుకోవాలి! దానికెన్ని ఆటలు వచ్చుననీ!

బొంకులదిబ్బ దగ్గరకు వెళ్ళినప్పుడల్లా తనకు ఎక్కువ ఆశ్చర్యం కలిగించేది రాజుగారి కోట! ఎత్తైన ఆ కోట గోడలమీద ఎన్ని పావురాలు ఉంటాయనీ!

"మనల్ని రానిస్తారా లోపలికి?" ఓసారి అడిగింది అనుమానంగా.

అక్క కిసుక్కున నవ్వింది. "రానివ్వకపోవడమేంటి? ఇప్పుడు అందులో అంతా చదువుకుంటున్న అమ్మాయిలూ అబ్బాయిలూ ఉంటారుగా. రా చూద్దాం" అంటూ తనను తోడ్చుకుపోయి అంతా చూపించింది. గంటనీ, ఆ గంట కొట్టే

ముసిలి బంట్రోతునీ చూపించింది. రౌండుమహలు చూపించింది. పావురాల గూడు చూపించింది. ఆడపిల్లల బడి కూడా చూపించింది.

ఎందుకో మరి, అక్కను రామం బాబాయీ, సుమిత్ర పిన్నీ ఓ రోజు వచ్చి, తీసుకొని పోయారు. ఆవేళ ఇంటిలో పండుగలాంటిది కూడా చేశారు. అమ్మ ఆవేళ కూడా నవ్వుతూనే ఉంది. విజయక్క రిక్షా ఎక్కుతుంటే తనకు ఏడుపు ముంచుకొచ్చింది. అమ్మ తనని దగ్గరకి తీసుకుంది. పిన్ని తన చేతిలో ఒక రూపాయి పెట్టింది. అమ్మ లడ్డూ ఇచ్చింది.

పిన్ని డబ్బులిస్తుంది గాని, అక్కను తీసుకెళ్ళడం మానదు. అమ్మ తినడానికిస్తుంది గాని అక్కను వదిలేయమని వాళ్ళతో చెప్పదు. అక్క వెళ్లకపోతే, ఆ డబ్బుతో నేల సినిమాకు ఇద్దరూ కలిసి వెళ్లొచ్చు. అక్క వెళ్లకపోతే, ఆ లడ్డూ పెట్టి అక్కా తానూ బొమ్మల వంటలాట ఆడుకోవచ్చు.

అక్కను తీసుకెళ్లవద్దని ఆవేళ అమ్మ చెప్పనూ లేదు, వాళ్ళు ఉంచనూ లేదు. అక్క వెళ్లిపోయాక తను పడిన బాధ అంతా ఇంతా కాదు. మొదట్లో రోజంతా ఏడుస్తూనే గడిపింది.

అప్పుడు వెళ్ళిన అక్క మళ్ళీ ఇన్నాళ్లకు వస్తుంది.

“అబ్బ అక్క వస్తుంది!’

ఈ ఆలోచన నిర్మల మనసుని ఆనందంతో తబ్బిబ్బు చేస్తుంది. ఆ పిల్ల మరునాటి ఉదయం తాను అనుభవించబోయే అపరిమితమైన ఆనందంలోని మాధుర్యాన్ని గురించి ఈ క్షణంలోనే ఊహలు పోతుంది.

“అమ్మా.. అక్క ఇప్పుడు బాగా మారిపోయి ఉంటుంది కదే?”

జానకి గతుక్కుమంది. ‘అవును... విజయ... తన విజ్జీ... తన ప్రాణం... బాగా మారిపోయి ఉంటుంది. మారదూ? ఇంకా తన దగ్గర ఉన్నప్పటిలాగే చింకి పరికిణీతో, చింపిరిజుత్తుతో ఉంటుందా? బాగా మారిపోయి ఉండాలి. పనికి దొంగతనం పడకుండా... తనేం చెప్తే అది చేస్తూ కూడా, కాజాలు సరిగ్గా వెయ్యకపోతే, తన చేత చీవాట్లూ దెబ్బలూ తినేది. ఛీ! పాపిష్టి చేతులు, ఆ బంగారుతల్లిని కొట్టడానికి తన మనసెలా అంగీకరించేదో?’

రోజంతా ఎవరివో బట్టలు కుడుతూనే ఉంటుంది తను. తమకి మాత్రం సరైన బట్టలుండవు. బట్టల వరకూ ఎందుకు... భర్త పోయాక తృప్తిగా ఒక్కరోజైనా కడుపునిండా తిందా, పిల్లలకు పెట్టిందా? జానకికి దుఃఖం వచ్చింది. కళ్ళలో నీళ్ళు తిరిగాయి. విజయ అక్కడే సుఖపడుతుంది. ఈ బీదతల్లి దగ్గర ఉండే కన్నా అక్కడే ఆనందంగా గడుస్తుంది దానికి.

ఆయన తాలూకా ఆఫీసులో గుమస్తాగా పని చేసేవారు. మాయదారి జ్వరం, ఒక్కరోజు వచ్చి తీసుకొని వెళ్లిపోయింది. తనకి అమ్మానాన్నా చిన్నతనంలోనే పోయారు. తననీ, ఇద్దరు పిల్లల్నీ పోషించే బాధ్యత స్వీకరించడానికి ఎవరూ సిద్ధపడలేదు. మొదట్లో అంతా కలిసి కొంత ధనసహాయం చేశారు. అంతే... దానితోనే ఈ కుట్టు మిషను కొంది. ఈవేళ తన సంసారం దాని మీదే ఆధారపడి ఉంది. ఆయన పోయాక, ఏడాది తిరిగే వేళకి, మరిది రామం, తోటికోడలు సుమిత్రా పెద్దదాన్ని మాత్రం తమతో పాటు విశాఖపట్నం తీసుకుపోయి, పెంచుకుంటామంటూ వచ్చారు. వాళ్ళకి సంతానం లేదు. వాళ్ల దగ్గర విజయ సుఖంగా పెరుగుతుందనిపించినా... మమత అడ్డం వచ్చి, ఎలాగోలా తమతో పాటు అదీ రోజులు గడుపుతుందిలే అన్న ఆలోచనతో దాన్ని వారితో పంపడానికి ఇష్టపడలేదు. కాని వాళ్ళు ఊరుకోలేదు. ఎన్నో విధాలా చెప్పారు. శంకరం

వాళ్ళచేతా, వేరే వాళ్ళ చేతా చెప్పించారు. దాన్ని పెద్దచేసి, చదువు చెప్పించి, పెళ్లిచేసే బాధ్యత తాము వహిస్తామన్నారు.

అంగీకరించక తప్పలేదు తనకి. విజయను వారు పెంచుకోడానికి తీసుకుపోయారు. అది వెళ్లిపోయేముందు తన ఒడిలో చేరి, ఒక్కలా ఏడుస్తుంటే, తనకీ దుఃఖం ఆగింది కాదు. దాని తల నిమురుతూ అంది: "అమ్మా విజ్జీ, నా తల్లీ, నా బంగారుకొండవి, అలా ఏడవ్వచ్చా? తప్పుకాదూ? నామాట వింటావు కదూ? ఇక నుంచి రామం బాబాయిగారిని 'నాన్నగారూ' అని పిలవాలి. పిన్నిని 'అమ్మా' అని పిలవాలి. నువ్వక్కడ చక్కగా చదువుకోవచ్చు. సరదాగా ఆడుకోవచ్చు. తెలిసిందా!" చెప్తూ ఉంటే, కన్నీళ్లు జలజలా రాలిపోయాయి.

విజయ బుద్ధిమంతురాలు. తన మాట దానికి వేదవాక్కే. వెళ్ళిన దగ్గరనుంచీ అక్కడ బుద్ధిగా ఉంటుంది. ఏణ్ణర్దం కింద ఒకసారి తీసుకొచ్చారు. అంతే! మళ్ళీ ఇప్పుడే రావడం.

"ఏమ్మా మాట్లాడవు?" నిర్మల పిలుపుతో ఆలోచనల్లోనుంచి తేరుకుంది జానకి. నిర్మల తల నిమురుతూ అంది.

"ఏం మాట్లాడను? ఎలాగూ రేపు వస్తున్నానని ఉత్తరం రాసిందిగా. చూడబోతూ నన్నెందుకు అడగడం?"

నిర్మల ఓ క్షణం ముభావంగా ఉండి, ఏదో గుర్తొచ్చినట్టుగా అడిగింది.. "మరి అక్క ఈసారి కూడా మనింటికి రావటం లేదేంటమ్మా? శంకరం పెదనాన్నగారింటికి వస్తోందేం?"

జానకి గుండెను ఎవరో ఇనపతొడుగులతో పిండినట్టైంది. బాధతో విలవిలలాడిపోయింది. గుండె సహస్రధా ఛిద్రమైపోయి దుఃఖం వెల్లువలా బయటకు వచ్చేస్తుందేమోననిపించింది. వణుకుతున్న పెదిమలను కరుచుకొని వదిలి, కుమార్తెను గుండెలకు హత్తుకుంది.

"ఛా... లేదు తల్లీ! అలా అనొచ్చా? ఎక్కడికి వస్తేనేం? అదీ మనిల్లేగా! శంకరం పెదనాన్నగారింటికేగా వస్తోంది. రాగానే వెళ్ళి చూసొద్దాం. సాయంత్రమో ఎప్పుడో ఓసారి మనింటికి కూడా వస్తుందిలే."

ఆమె తనకు తెలియకుండానే కుమార్తె తలను కన్నీళ్లతో తడిపేసింది.

★★★

ఉన్నవాటిలో కాస్త మంచి గౌను తీసి, ఉతికి ఆరవేసి, నిర్మలకు తొడిగింది. తనుకూడా తయారై, ఇంటికి తాళం వేసి, నిర్మలను వెంటబెట్టుకొని, శంకరంగారింటికి బయలుదేరింది.

ఉదయం పదకొండు గంటలైంది. సుమిత్రా, విజయా గంట కిందటే విశాఖపట్నం నుండి వచ్చి ఉండాలి. దారిలో కొంచెం మిఠాయి, పువ్వులూ కొంది.

వీధిగుమ్మంలోనే విజయ ఎదురైంది. ఎంతలా మారిపోయిందో! ఖరీదైన బట్టలతో పెద్ద ఆఫీసరుగారి అమ్మాయిలా ఉంది. పొందికగా నిల్చొని ఉంది. ఎడమచేతికి వాచీ, ఉంగరం! జడగంటలు వేసుకున్న జడ ముందుకు వేసుకొని, సున్నితంగా ఎగరేస్తోంది.

జానకి కళ్ళు చెమర్చాయి. ఆమె ఆశించినట్టుగా ఆ పిల్ల తమను చూడగానే పరుగెత్తుకు వచ్చి, తనను వాటేసుకుపోలేదు. బావురుమనలేదు. స్తిమితంగా నడుచుకుంటూ వచ్చి, నవ్వుముఖంతో పలకరించింది. దీనికింత పెద్దమనిషి తరహా ఎప్పుడొచ్చిందీ!

నిర్మల చేతిని తన చేతిలోకి తీసుకొని నొక్కుతూ "చెల్లీ బాగున్నావా?" అనడిగింది. మాట కూడా పూర్తిగా మారిపోయింది. చెల్లెలితో మాట్లాడడమంటే ఒళ్ళు మరచిపోయేది.

విజయ నిజంగానే మారిపోయింది. విశాఖపట్నంలో మంచి వాతావరణంలో పెరుగుతోంది. ఆమాత్రం హుందాతనం రాకపోతుందా? నిర్మల అక్క వేపు ఆశ్చర్యంగా చూస్తూ, ఆ పిల్ల వేసుకున్న బట్టల్ని భయంభయంగా, సంభ్రమంతో తాకుతూ ఉండడం గమనించిన జానకి మనస్సు చివుక్కుమంది.

సుమిత్ర ఎదురొచ్చి జానకిని ఆహ్వానించింది. శంకరంగారూ, అతని భార్య వరలక్ష్మి కూడా వచ్చి పలకరించారు. ఒకే ఊళ్ళో ఉన్నా వారి మధ్య రాకపోకలు అరుదు. బంధువులెవ్వరికీ జానకి బట్టలు కుట్టుకుంటూ బతుకు వెళ్ళమార్చడం ఇష్టం లేదు. అలాగని ఆమెను పోషించడానికి కూడా ఎవరూ ముందుకు రాలేదు.

సుమిత్ర కబుర్లు చెప్తూ కూర్చుంది. విజయ తనకు స్కూలో వచ్చిన బహుమతుల గురించీ, మార్కుల గురించీ చెప్పింది. నిర్మలకంతా ఆశ్చర్యమే. మధ్యలో సుమిత్ర లేచివెళ్ళి ఓ పేకెట్ తీసుకొని వచ్చింది. అందులో మంచి పట్టు పరికిణీ గుడ్డ ఉంది.

"విజ్జీ ముచ్చట పడితే ఈ గుడ్డ మొన్ననే తీసుకున్నాం జానకీ. కుట్టించేందుకు అక్కడ వ్యవధి లేకపోయింది. రాయఘఢలో మా బంధువులమ్మాయి పెళ్లి ఉంది. దానికి వెళ్తున్నాం. ఆయన నేరుగా అక్కడికే వస్తారు. రెండురోజుల్లో కుట్టి ఇచ్చెయ్యాలి. మంచిరకం బట్టలెన్ని ఉన్నా, అది దీన్నే మోజుపడింది. పిల్లల ముచ్చట్లు తీర్చకుండా ఎలా ఉండగలం చెప్పు?"

జానకి పరికిణీ బట్ట అందుకుంది. మెత్తగా ఉంది. ఆకర్షణీయమైన రంగు. నిర్మల ఆ బట్టను చేత్తో ముట్టుకొని, 'ఎంత బాగుందో' అని మురిసిపోయింది.

జానకి కింది పెదవి నెమ్మదిగా కరచుకొని, వదిలింది. పిల్లల ముచ్చట్లు తీర్చలేకుండా ఉండలేకపోవడం నిజమే. కానీ, తీర్చగలిగే అనువైన పరిస్థితులు అందరికీ ఉంటాయా? నిమ్మీ కూడా అలాంటి పరికిణీ కోసం ఎన్నో కలలు కంటోంది! దాని కోరిక తనీ జన్మకు తీర్చగలదా? దాని బతుకింతేగాబోలు! చిరుగులు పట్టిన లంగాతోనూ... ఎప్పుడూ చాకలి ముఖమెరుగని గుడ్డలతోనూ.... అంతే! అంతే! జానకి మనసు బరువెక్కుతోంది బాధతో!

విజయ బిస్కెట్లు తెచ్చి చెల్లెలి చేతిలో పెట్టింది. సుమిత్ర అది గమనించి, తొందరగా "అయ్యో విజ్జీ, అవెందుకే అలా ఖర్చు చేస్తావు? సాల్టు బిస్కెట్లు కదా, నీ ఆరోగ్యం బాగోలేదని తెప్పించాను. నువ్వు తినడం మానేస్తావేం?" అంది, జానకి బాధపడుతుందనైనా ఆలోచించకుండా.

జానకి గాభరాగా విజయని దగ్గరకు తీసుకుంటూ, "ఏమ్మా ఈమధ్య ఒంట్లో బాగుండడం లేదా? జ్వరమేమైనా వస్తోందా?" అనడిగింది. విజయ లేదన్నట్టు తల అడ్డంగా తాటించింది.

"లేకపోవడమేమిటే..."

సుమిత్ర మాటలు పూర్తికాకముందే జానకి మాటమార్చేస్తూ, "సుమీ, నేను టేపు తీసుకొని రాలేదు. ఇక్కడెవరి దగ్గరైనా ఉందా?" అడిగింది.

"వరలక్ష్మి దగ్గర ఉండొచ్చు" అంటూ వెళ్ళి, ఆమెనడిగి టేపు తీసుకొచ్చింది. జానకి కొలతలు తీసుకుంది. బట్టకూడా

కొలిచింది.

"ఇందులోనే దానికి జాకెట్టు కూడా అవుతుందిగా" "కాదు సుమీ, బట్ట మరికొంచెం ఎక్కువ తీసుకోవలిసింది."

"కొట్టువాడు అవుతుందన్నాడే?"

సుమిత్ర మాటల్లో అనుమానం జానక్కి అర్థమైంది. ఆమె మనసు చివుక్కుమంది.

"ఉహూ" అంది నెమ్మదిగా. పరికిణీ గుడ్డ తీసుకొని, నిర్మలతో సహా బయలుదేరింది. వెళ్ళేముందు "సుమిత్రా సాయంత్రం దాన్నోసారి తీసుకొని వస్తావు కదూ?" అని అడిగింది. అనిష్టంగానే తలూపింది సుమిత్ర.

★★★

ఆ సాయంత్రం విజయను వెంటబెట్టుకొని సుమిత్ర రాలేదు. చీకటి పడేముందు నిర్మలే వెళ్ళి చూసొచ్చింది. జానకి మనసు బాధతో విలవిలలాడిపోయింది. ఆలోచనలతో ఆమె తల వేడెక్కిపోయింది. ఆ రాత్రి ఆమెకు కంటి మీద కునుకులేదు. మర్నాటి ఉదయానికల్లా బాగా జ్వరమొచ్చేసింది. ఆ జ్వరం మూడోనాటికిగాని తగ్గలేదు. పక్కింటావిడే నిర్మలకు అన్నీ చేసింది.

మూడోనాడు పథ్యం తీసుకుంది. నీరసం ఇంకా వదల్లేదు. మధ్యాహ్నం మూడింటికి సుమిత్ర శంకరంగారి పనిమనిషి చేత కబురు చేసింది. సాయంత్రమే బస్సులో వెళ్లిపోవాలనీ, ఈలోగా పరికిణీ కుట్టి ఇచ్చేయ్యమనీ.

జానకి గాభరాగా మిషను ముందు కూర్చుంది. నీరసంతో తోపు వస్తున్నా పట్టించుకోలేదు. గుడ్డ జాగ్రత్తగా కత్తిరించి కుట్టడం మొదలుబెట్టింది. బాగా కుట్టి ఇవ్వాలనే దీక్షతో పని చేసింది. వాళ్ళ బస్సు టైముకి ముందే పట్టుకెళ్లి ఇవ్వాలి. లేకపోతే సుమిత్ర ఏమైనా అనుకోగలదు.

ముప్పావుగంటలో పరికిణీ కుట్టడం అయిపోయింది. బస్సు ఆరింటికి ఉంటుంది. ఇంకా చాలా టైముంది. పరికిణీ చాలా బాగా వచ్చింది. జానకి తృప్తిగా నిట్టూర్చింది. పరికిణీ మడతపెడుతూ ఉంటే నిర్మల వచ్చి పక్కన చేరింది. ఆ పిల్లకి పరికిణీ బాగా నచ్చింది. ఒకలా మురిసి ముక్కలౌతోంది.

"అమ్మా ఒక్కసారి కట్టుకొని, అద్దంలో చూసుకొని విప్పేస్తానే?"

జానకి మనసు చివుక్కుమంది. కళ్ళలో నీళ్ళు గిర్రున తిరిగాయి.

"వద్దమ్మా" అని వారించింది.

"ఒక్కసారంటే ఒక్కసారి ఇవ్వమ్మా"

"పాడైపోతుంది నిమ్మీ. అల్లరి పెట్టకూడదు"

"అమ్మా"

"అబ్బా చంపకే బాబూ. వద్దన్నాను విను. అంతే!"

నిర్మల కళ్ళలో నీళ్ళు తిరగడం గమనించి, జానకి మనసు చివుక్కుమంది.

★★★

"అమ్మా, అన్నట్టు పిన్నిగారెందుకో రమ్మని చెప్పమన్నారే" అంది నిర్మల ఏదో గుర్తొచ్చినట్టు.

పిన్నిగారంటే పక్కింటావిడ.

"ఎప్పుడు?"

"ఇందాక నువ్వు పరికిణీ కుడుతున్నప్పుడు."

"సరే, ఇప్పుడే వచ్చేస్తాను. నువ్వెక్కడికీ పారిపోకు. శంకరం పెదనాన్నగారింటికి వెళ్దాం" అంటూ పరికిణీ పెట్టె మీద ఉంచి, పక్కింటికి వెళ్లింది జానకి. తీరా వెళ్తే ఆవిడ తానేమీ కబురు చెయ్యలేదంది.

ఇంటికి తిరిగి వచ్చేసరికి, నిర్మల పట్టు పరికిణీ, దాని మీద చింకి జాకెట్టుతో నవ్వుతూ నిల్చొని కనిపించింది. పిచ్చితల్లి కట్టుకోకుండా ఉండలేకపోయింది. ఎంత అబద్ధమాడింది! అది కట్టుకోవాలని ఎంత మనసు పడిందో!

వెలిగిపోతున్న ముఖంతో నవ్వింది నిర్మల.

"భడవా, కట్టేసుకున్నవూ?" నవ్వుతూ నిర్మల చెయ్యందుకోబోయింది. నిర్మల ఆమెకు దొరక్కుండా ఇల్లంతా పరుగెత్తింది.

"ఆగవే పిచ్చితల్లీ, నీ సంబరం బాగానే ఉంది."

నిర్మల ఆగిపోయింది. తల్లి మాటలు విని కాదు. ఊడిపోతున్న తలుపుకున్న మేకుకి తగులుకొని, పరికిణీ కొంతమేర చిరిగిపోవటం వల్లనే.

ఆ పిల్ల భయంతో వణికిపోతోంది. జానకి ముఖం జేవురించుకుపోయింది. ఆవేశంగా ఒక్క ఊదుటున వెళ్ళి దాని జుత్తు పట్టుకొని గుంజింది.

"ఒసే ముండా, కట్టుకునే వరకూ చచ్చిపోయావు. ఈ చింకి పరికిణీ దానికెలా ఇవ్వను? నీ ఒళ్ళు చీల్చినా పాపం లేదే రాక్షసీ."

ఆవేశంతో ఊగిపోతూ నిర్మలను బాదేసింది. ఆమె కళ్ళు నిప్పులు కురుస్తున్నాయి.

"నా పాలిట దయ్యంలా దాపురించావే. నీ కర్మ బాగుంటే నిన్నూ ఒక అయ్య తీసుకుపోయి పెంచుకునేవాడు. నీ రాత ఇలా తగలడింది. కోరికలకు మాత్రం కొదవలేదు. ఛీ వెధవ బతుకు!"

నిర్మల వెక్కివెక్కి ఏడుస్తోంది. జానకి ఆయాసంతో రొప్పుతోంది.

జానకి విసురుగా పలకా బలపం తెచ్చి, పలక మీద 'మళ్ళీ ఇలాంటి తప్పు చెయ్యను' అని రాసిచ్చి, "గోడకుర్చీ వేసి దిద్దుతూ కూర్చో. ఈరోజు నీకు పచ్చి మంచినీళ్లు కూడా ఇవ్వను!" అంది.

నిర్మల పలక అందుకుంటూ ప్రయత్నం మీద "అమ్మా" అని పిలిచింది.

"ఏం రాణీగారికి ఇంకా కోరిక ఏం మిగిలిపోయింది?" కసిరినట్టుగా అడిగింది.

ఆ పిల్ల జంకుతూనే చెప్పింది "నా బట్టల కోసం డబ్బులు దాస్తున్నావుగా, వాటితో మళ్ళీ గుడ్డ కొని అక్కయ్యకు ఇచ్చేస్తే?"

జానకి గతుక్కుమంది. ఆ డబ్బు ముందుముందు నిర్మల చదువుకోసం, బట్టలకోసం కష్టపడి తను ఆదా చేస్తున్నది. ఇప్పుడది ఖర్చు చెయ్యాలి. తప్పదు. దుఃఖం ముంచుకొచ్చి కుమార్తెను కౌగలించుకొని ఏడవాలనిపించింది. ప్రయత్నం మీద తమాయించుకుంది. డబ్బు తీసుకొని ఆదరాబాదరా వీధిలోకి పరుగెత్తింది.

ఊళ్ళో ఉన్న అన్ని బట్టలకొట్లూ గాలించగా ఎలాగో అలాంటి బట్టే దొరికింది. అది నిజంగా అదృష్టమే. దాచిన డబ్బు మొత్తం దానికే అయిపోయింది. బిల్లు ఇస్తుంటే చెయ్యి తీవ్రంగా వణికింది. పాకెట్ తీసుకొని వడివడిగా ఇంటికి వచ్చిపడింది. వస్తూనే మిషన్ ముందు కూర్చుంది. బట్ట కత్తిరించి మళ్ళీ కుట్టడం ప్రారంభించింది. సాయంత్రానికి అందించలేకపోతే, సుమిత్ర తప్పకుండా అపార్థం చేసుకుంటుంది. ఆమె మనస్థత్వమే అంత.

ఆలోచనలు చిందరవందరగా ముసురుకుంటున్నాయి. వాటిని దూరగా నెట్టి, స్తిమితపడదానికి ప్రయత్నిస్తూ పరికిణీ కుట్టడం పూర్తిచేసింది. భయం చేతనో ఏమో, ఈసారి బాగా టైమ్ తీసుకుంది. పరికిణీ పూర్తయ్యేసరికి ఆరు కావస్తోంది.

పరికిణీ మడతపెట్టి, కాగితంలో చుట్టి, తొందరగా నడుచుకుంటూ శంకరంగారింటికి దారి తీసింది. ఇల్లు చేరి, మెట్లెక్కబోతూ, ఎవరో అదిమిపట్టినట్టు ఆగిపోయింది. తాళం ఆమెను వెక్కిరించింది. జానకి చకితురాలైంది. నీరసం ఆమెను ఆవరించింది.

పక్కింటావిడ చెప్పింది: "అయ్యో జానకమ్మా, ఇలా చేశావేంటీ? వాళ్ళంతా వెళ్ళి అరగంట అయింది. ఈపాటికి బస్సుకూడా వెళ్ళిపోయి ఉంటుంది. నీకోసం ఎంతలా చూశారనీ! సుమిత్ర ఎంతలేసి మాటలందనుకున్నావు! మాయమాటలు చెప్పి, ఆ గుడ్డను రెండోదానికి కుడదామనుకున్నావట. రెండుమాటలు పడినా, మంచి గుడ్డ వస్తుంది కదా... అనుకున్నావట.."

జానకి మరి వినలేకపోయింది. వెల్లువలా వస్తున్న దుఃఖాన్ని పెదిమల మధ్య బంధించి, ఎవరో తరుముతున్నట్టు ఇంటివేపు దారి తీసింది.

ఇల్లు చేరేటప్పటికి నిర్మల కూర్చున్న దగ్గరే నిద్రపోతూ కనిపించింది. తలుపుచప్పుడు వినిపించి, చప్పున కళ్ళు తెరిచి, "ఏమ్మా అక్క పరికిణీ ఇవ్వలేదూ?" అని అడిగింది.

జానకి భళ్ళున ఏడుస్తూ, కుమార్తెను బలంగా గుండెకు అదుముకొని, దాని తలను కన్నీళ్ళతో తడిపేసింది.

ఆ పిల్ల అంతసేపు దిద్దుతూ కూర్చున్న పలక ఆమె వక్షాన్ని కఠినంగా అదుముకుంది.

*(ఆంధ్రప్రభ, సచిత్ర వారపత్రిక తేదీ. 10.02.2001 నుంచి పునర్ముద్రణ)*





సుమారు నెలా పదిహేను రోజులపాటు క్రికెట్ ప్రపంచకప్పు పోటీలు యావత్ భారతదేశాన్ని ఉర్రూతలూగించాయి.

పదికి పది వరుస విజయాలతో భారత జట్టు అగ్రగామిగా నిలిచి కప్పును గెలవటమే లాంఛనంగా మిగిలేసరికి, కోట్లమంది భారతీయుల హృదయాలలో ఊపిరాడనంత ఉద్వేగం, ఆకాశమంత ఆశ.

ఇక పత్రికలు, టీవీలు, సామాజిక మాధ్యమాలు భారత జట్టు విజయావకాశాల గురించి వరుస కథనాలతో ఊదరగొట్టేసాయి. క్రికెట్ క్రీడా ప్రపంచంలో మన దేశ కీర్తిప్రతిష్టలను ఇనుమడింపజేసిన గత విజయాలను కథలు కథలుగా ప్రచురించాయి, ప్రసారం చేసాయి.

కాని, ఆశించినది ఒక్క అడుగుదూరంలో ఆగిపోయింది. ఆ ఓటమి మీద మళ్ళీ బోలెడు కథలు, కథానాలూ.

ఇప్పుడు ఇదంతా ఎందుకూ అంటే... కథ గురించే! అసలు సమాజంలో ఏ సంఘటన జరిగినా దానికి పల్లవులూ, అనుపల్లవులుగా ఎన్నో కథలు పుట్టుకొస్తాయి. కథ .. అంత బలమైన యానకం!

ప్రింటు పత్రికలు కనుమరుగైన తర్వాతా, అంతర్జాలం అందుబాటులోకి వచ్చాకా.. కథా రచయితల సంఖ్య, పాఠకులను మించిపోయింది. ఇది ఆహ్వానించదగ్గ విషయమే అయినా, రాశి పెరిగి వాసి తగ్గిందన్న భావన పలురీతులుగా ప్రచారంలో ఉన్నదన్న విషయం కాదనలేనిది.

ఈ కష్టాలన్నీ అనుభవించి, అధిగమించి, కథామంజరి.. తనకు అందుతున్న రాశిలో నుంచి, ఏరి ఏరి కాస్త వాసి ఉన్న కథలనే పాఠకులకు అందిస్తోంది. ప్రతిఫలాపేక్ష లేకుండా అందిస్తున్న ఈ శ్రమకి ఓ ‘శభాష్’ ఆశించడం తప్పు కాదేమో!?

